ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 265 పేజీలు: 8+16 వెల: 6.50

జిఎస్టీలో మార్పులతో అందరిలో సంతోషం: పిఎం 5

కరూర్ బాధిత కుటుంబాలను నేడు కలవనున్న విజయ్

## 'జూబ్లీ' తర్వాతే డిసిసిలు!

### 'స్థానిక' ఎన్నికలు మరింత ఆలస్యం



### 7న కేబినెట్‌లో చర్చ

రెండు రోజులు ఢిల్లీలో వేణు గోపాల్‌తో కసరత్తు జరిపిన సిఎం రేవంత్, డిసిఎం భట్టి, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

కార్యకర్తల అభిప్రాయాలు సేకరించిన ఎఐసిసి పరిశీలకులు: వేణుగోపాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి)అధ్యక్షుల నియామకం జూబ్లిహిల్స్ ఎన్నికల తర్వాతే జరిగేలా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ నేతల దృష్టి అంతా జూబ్లిహిల్స్ ఎన్నికలపై ఉంది. డిసిసి అధ్యక్షుల ఎంపికపై కసరత్తు కోసం ఢిల్లీలో కెసి వేణుగోపాల్‌తో సిఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క టిపిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, సంఘటన్ సుజన్ అభియాన్‌కు చెందిన పలువురు పరిశీలకులు సమావేశమైన విషయం తెలిసిందే. కానీ జూబ్లిహిల్స్ ఎన్నికలకు రాష్ట్ర నేతలు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన చేస్తున్నందున జిల్లా పార్టీలు బలోపేతంగా ఉండాల్సిన అవశ్యకత గురించి సిఎం రేవంత్‌రెడ్డి ప్రధానంగా ప్రస్తావించారని తెలిసింది. అందుకు కెసి వేణుగోపాల్ స్పందిస్తూ దేశంలోని మరి కొన్ని రాష్ట్రాల జిల్లాల కమిటీల ఎంపిక ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తి కావచ్చని, వాటితో పాటు తెలంగాణ డిసిసి అధ్యక్షులనూ నియమిస్తామని వివరించారు. ఏఐసిసి నియమించిన ఇరవై రెండు మంది పరిశీలకులు తమకు కేటాయించిన జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి, పార్టీ నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలే కాకుండా స్థానికంగా ఉండే వివిధ సంఘాలతో, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధుల అభిప్రాయలను సేకరించారని కెసి వేణుగోపాల్ తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తమకు సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించామని, ఇందులో కొన్ని జిల్లాల్లో మూడు పేర్లు ఉంటే, మరి కొన్ని జిల్లాల్లో ఐదు, ఆరు పేర్లతో కూడిన జాబితాలను అందజేశారని ఆయన తెలిపారు. మూడు పేర్లతో జాబితాలు ఇవ్వాల్సిందిగా వారికి అందజేసిన మార్గదర్శకాల్లో చెప్పామని, అయితే బలమైన నాయకులు, ఉండడం, మహిళలు, సామాజిక సమతుల్యత కోసం ఐదు, ఆరు పేర్లతో జాబితాలు ఇవ్వాల్సి వచ్చిందని పరిశీలకులు చెప్పారని ఆయన తెలిపారు. వీటిని మరోసారి పరిశీలించి, వడపోసి మూడు పేర్లతో తుది జాబితాను సిద్ధం చేసి, ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ముందు పెట్టి ఖరారు చేస్తామని ఆయన వివరించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తమ పరిశీలకులు ఎవరి వత్తిళ్ళకు లొంగకుండా జాబితాలు సిఫార్సు చేశారని ఆయన చెప్పారు. డిసిసి అధ్యక్షులుగా ఉన్న వారు తిరిగి పోటీ చేయరాదన్న నియమం ఉండడం ఒక రకంగా మంచిదేనని, దీని వల్ల పార్టీలో కొత్త ఇంకా యువతరాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందన్న అభిప్రాయాన్ని పార్టీ రాష్ట్ర నాయకులు వ్యక్తం చేశారు. కాగా పలువురు ఎమ్మెల్యేలు సైతం డిసిసి అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలుస్తోంది. డిసిసి అధ్యక్ష పదవి పొందడం ద్వారా జిల్లా పార్టీలో మరింత పట్టు సాధించేందుకు అవకాశం లభిస్తుందని వారు భావిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత జాప్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నవంబర్ 3న హైకోర్టులో విచారణ తర్వాత 7న చర్చించాలని ఇటీవల కేబినెట్ నిర్ణయించింది. అయితే నవంబరు 11న జరిగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ ముగిసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పంచాయతీల ఎన్నికల ఆలస్యం వల్ల బీసీల్లో ఉత్కంఠ పెరగడంతో >>2



### 2 లక్షల మంది 'ఔట్‌సోర్సింగ్'

## జీతాలు నిలిపివేత!

### 55% ఉద్యోగుల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు

45 శాతం మంది అసలు ఉన్నారా! లేదా?

వారికిస్తున్న జీతాలు ఏమవుతున్నాయి?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, కార్పొరేషన్లు, యూనివర్సిటీల్లోని హెచ్ఓడీలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయిస్ వివరాలు ఇవ్వాలని, లేకపోతే వారికి వేతనాలు చెల్లించబోమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. శనివారం రాత్రి వరకు కేవలం 55శాతం మంది వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. మిగతా 45శాతం మంది ఉద్యోగులు అసలు పనిచేస్తున్నారా? లేదా? అనే చర్చ జరుగుతున్నది. ఇంతకాలం సదరు ఎంప్లాయిస్ వివరాలను రికార్డుల్లో నమోదు చేసి, ఆ జీతాలను అధికారులు, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు వాటాలుగా పంచుకున్నట్టు అనుమానం మొదలైంది. అందుకే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వివరాలు ఇవ్వలేదని ప్రచారం జరుగుతున్నది. వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో >>2



బస్తర్‌లో లొంగిపోయేందుకు వచ్చిన మావోయిస్టులు

### మరో 21 మంది మావోలు

## లొంగుబాటు

ఆయుధాలు అప్పగింత

**బస్తర్, అక్టోబరు 26:** మావోయిస్టు పార్టీకి మరోసారి భారీ దెబ్బతగిలింది. పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో 21 మంది మావోలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. బస్తర్ రేంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లొంగిపోయిన మావోయిస్టులు కేశ్‌కాల్ డివిజన్ కుమారి,కిస్కోడా ఏరియా కమిటీ మావోయిస్టులని.. లొంగిపోయిన వారిలో కేశ్‌కాల్ డివిజన్ కమిటీ కార్యదర్శి ముకేష్, నలుగురు డీవీసీఎంలు డివిజన్ వైస్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ఏఎంసీ ఏరియా కమిటీ సభ్యులతో పాటు ఎనిమిది >>2

లొంగు బాటలో టాప్ లీడర్ హిడ్మా? 7

## 'మొంథా' ఎఫెక్ట్



నేడు, రేపు భారీ వర్ష సూచన

ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉండొచ్చు

రేపు కాకినాడ సమీపంలో తీరం దాటే సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో రేపు అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశంఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం కొన్ని ఈశాన్య జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడతాయని, మరికొన్ని ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఈరోజు, రేపు తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం ఆదివారం తీవ్ర వాయుగుండంగా మారి అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాగల 24 గంటల్లో ఈ తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి తుపానుగా మారి నైరుతి బంగాళాఖాతం, దాని సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. తదుపరి ఈ తుపాను మొదట వాయవ్య దిశలో తదుపరి ఉత్తర వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి ఈనెల 28నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. తదుపరి తూర్పు వాయువ్య దిశలోనే కదులుతూ ఈ నెల 28న సాయంత్రానికి కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు.

**అన్నదాతకు తుఫాన్ గండం..**
ఆరుగాలం శ్రమ వర్షార్పణం 7



## హైకమాండ్ రాడార్‌లో ఉన్నాం

మంత్రుల రగడ ముగిసిన అధ్యాయమే..

కులాలపై సుస్మిత మాట్లాడి ఉండాల్సింది కాదు..

జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు26,ప్రభాతవార్త:** గోడలకు చెవులుంటాయి మంత్రుల గొడవలు ముగిసిన అధ్యాయం పార్టీ నేతలు ఆచితూచి జాగ్రత్తగా మాట్లాడాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ హితువు చెప్పారు. ఢిల్లీలో ఆదివారం ఆయన విలేఖరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ మంత్రి కొండాసురేఖ కూతురు కొండ సుస్మిత కులాల గురించి మాట్లాడి ఉండాల్సిందికాదని అభిప్రాయపడ్డారు. కులం,మతం గురించి ఎవరు మాట్లాడినా ఆక్షేపించాల్సిందే అని ఆయన అన్నారు. పోలీసులు రావడంతో పానిక్ అయినట్లు చెప్పిందనీఎంత ఎదిగితే అంత ఒదగాలని అన్నారు. పోలీసులది కమ్యూనికేషన్ గ్యాప్ కెటిఆర్ హరీష్ రావులు ఎడ్వాంటేజీ గా తీసుకుంటున్నారని ఆవేదన చెందారు.జీవన్ రెడ్డి, లక్ష్మణ్‌ల మధ్య గురుశిష్యుల బంధం అని అభివర్ణించారు.పార్టీ అన్నింటికి సుప్రీం అని తెలిపారు. పార్టీ నియమావళికి లోబడి నడుచుకోవాలని గౌడ్ సూచించారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే, మంచి మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.జూబ్లిహిల్స్‌లో 46 వేల ఇళ్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయనీ తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు అన్నింటిని హైకమాండ్ గమనిస్తుందనీ, అందరం హైకమాండ్ రాడార్‌లో ఉన్నాం. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు డిసిసి బాధ్యతలు తీసుకోవడం మంచిదనీ,మా అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ అంశంపై ఉత్తం తన అభిప్రాయాలను పంపారు. కొంత మంది ఎమ్మెల్యేలకు డిసిసి బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి సతీమణి డిసిసి అధ్యక్ష పదవి కోసం అప్లై చేసినట్లు ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యేలకు డిసిసి పదవులు డబుల్ పోస్టులుగా చూడమని తెలిపారు. కుటుంబాలు అంటే అప్పటికే పార్టీలో ఉండి, సర్వీస్ చేస్తుంటే అడ్డంకి ఉండదని తెలిపారు. ఉన్నపలంగా తెరపైకి వచ్చి పోస్టులు అడిగితే ఇవ్వరని అన్నారు. నేను పార్టీలో ఉన్నా నాకొడుకు ఇప్పటిప్పుడు వచ్చి పోస్ట్ అడిగితే ఇవ్వరని వివరించారు రెండు పదవులు ఉండొద్దు అనే నిబంధన ఉంది. ఒక పదవికి సెలెక్ట్ అయితే, ఇంకో పదవికి రాజీనామా చేస్తారని అన్నారు. కేంద్రం నుంచి సరైన విధంగా రాష్ట్రానికి సహకారం లేదని అన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే, అభివృద్ధి కోసం అందరూ కలిసి పని చెయ్యాలని అన్నారు. మెట్రో ఫేస్ టూకు కిషన్‌రెడ్డి అడ్డంకి అని మహేష్ కుమార్ ఆరోపించారు. కిషన్ రెడ్డికి బాధ్యత లేదా అనిప్రశ్నించారు. బిజెపి ఎప్పుడైనా మతం అంశమే కదా మతం పేరుతో ఓట్లు దండుకోవడమే కదా అని అన్నారు. బిజెపి నేతలుమతం కులం పేరుతో ఓట్లు అడుగుతున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌కు ఏం చేశాడని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ఉండి బండి >>2

### నవంబరు 3 నుంచి

## ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్!

రీయింబర్స్‌మెంట్ బకాయిల రగడ

1వ తేదీలోగా పెండింగ్ నిధులివ్వాలని డిమాండ్

ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 26:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఉన్నత విద్యా సంస్థలకి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 900 కోట్లను నవంబర్ 1 లోగా చెల్లించకపోతే.. నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్‌ను నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య (ఎఫ్ఏటిహెచ్ఐ) ప్రకటించింది. అసోసియేషన్ రాష్ట్రకార్యవర్గం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాఖ్య ఛైర్మన్ ఎన్ రమేష్ బాబు మీడియాకు తెలిపారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ కెఎస్ రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె సునీల్ కుమార్, కోశాధికారి కృష్ణారావు, కోఆర్డినేటర్ రాందాస్ పాల్గొన్నారు. ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ఛైర్మెన్ రమేష్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్మెంట్ >>2

### నవంబరు 1 నుంచి

## దేశమంతా 'సర్'

ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో తొలివిడత ప్రత్యేక సర్వే

**న్యూఢిల్లీ,అక్టోబరు 26:** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్)నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘంకార్యాచరణ సిద్ధంచేసింది. ఇందుకు సంబంధించిన షెడ్యూలును సోమవారం మధ్యాహ్నం ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషిలు కూడా మీడియా మీట్‌లో పాల్గొంటారు. తొలివిడత సర్‌లోనే పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడులు ఉంటాయని అంచనా. మొదటిదశలో పదిరాష్ట్రాలు ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఉంటుంది. ఎన్నికలకు వస్తున్న అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో తొలిదశలో ప్రత్యేక సవరణ జరుగుతుందని అంచనా. నవంబరు ఒకటవ తేదీ నుంచి ఈ సర్ ప్రారంభం అవుతుంది. రెండు దశల్లో నిర్వహిస్తారు. 2026లో ఎన్నికలు నిర్వహించే రాష్ట్రాల్లో ముందు >>2



మీడియాతో కలెక్టర్ ఎ. సిరి

### మద్యం సేవించి

## నడిపిన బైకర్

ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులో స్పష్టం చేసిన వైద్యులు

బైకర్ ఫ్రెండ్ ఎర్రిస్వామి విచారణలో ఆసక్తికర విషయాలు

**కర్నూలు, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** కావేరి బస్సు దగ్ధం కేసులో బైకర్ శివశంకర్ మద్యం సేవించినట్లు శవ పరీక్షల్లో స్పష్టమైనట్లు జిల్లా ఎస్పీ కాంత్ పాటిల్ తెలిపారు.అదే >>2

### బైక్‌ను గుర్తించని

## బస్సు డ్రైవర్

నల్ల రంగు వల్లనే కనబడలేదని వివరణ

అప్పటికే పక్కనుంచి వెళ్లిన రెండు బస్సులు

**కర్నూలు, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** వి కావేరి బస్సు దగ్ధం కేసులో మరికొన్ని విషయాలు వెలుగులో వచ్చాయి. బస్సు ప్రమాదం జరగడానికి ముందే యాక్సిడెంట్ అయిన బైక్ రోడ్డుపై పడి ఉంది. ఆ బైక్‌ను పక్కకు తీసేందుకు మృతుడు శివశంకర్ మిత్రుడు ఎర్రి స్వామి ప్రయత్నాలు ప్రారంభించాడు. అయితే రోడ్డుపై వేగంగా బస్సులు వస్తుండటంతో బైకును పక్కకు తీయలేకపోయాడు. బైక్ యాక్సిడెంట్ జరిగిన తర్వాత రెండు ట్రావెల్స్ బస్సులు బైకును గుర్తించి పక్కనుంచి వెళ్ళిపోయాయని ఎర్రి స్వామి చెబుతున్నాడు. తర్వాత వచ్చిన వి కావేరి బస్సు మాత్రం బైక్ పైనుంచి వెళ్ళిందన్నాడు. దీంతో బైక్ బస్సు కింద ఇరుక్కుని వెళ్లిపోయిందని, కొద్దిసేపటికి బస్సు కింద నుంచి మంటలు వ్యాపించాయని చెబుతున్నాడు. ఈ ప్రమాదంలో కావేరీ బస్సు కన్నా ముందు రెండు బస్సులు వెళ్లాయని వారు బైకును గుర్తించి పక్క నుంచి వెళ్లారని చెబుతున్నాడు. అయితే ఈ బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య మాత్రం తాను బైకు గుర్తించలేదని చెప్తున్నాడు. అందుకు కారణం బైకు నల్ల రంగులో ఉందని పోలీసులకు వివరణ ఇచ్చాడు. బైక్ కనిపించకపోవడంతోనే బైక్ పై నుంచి బస్సు వెళ్లిందన్నాడు. అంతేగాక వర్షం కారణంగా బ్రేక్ వేస్తే ప్రమాదం జరుగుతుందని బ్రేక్ వేయలేదన్నాడు. అయితే మంటలు వ్యాపించే వరకు బస్సు ఎందుకు ఆపలేదనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. ఏది ఏమైనా బైకర్ మద్యం సేవించి >>2



### నేడే మద్యం షాపులకు

## డ్రా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు26:** తెలంగాణలో కొత్త మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించగా భారీగా స్పందన వచ్చింది. 2025-27 సంవత్సరానికి డ్రా (లాటరీ) పద్ధతిలో సోమవారం ఉదయం 11 గంటలకు మద్యం షాపుల లైసన్స్ దారుల ఎంపిక జిల్లాల వారీగా 34 కేంద్రాలలో కలెక్టర్ల >>2

వికసిత భారత్ 2047 లక్ష్యాలు ప్రపంచ మానవాళి భవిష్యత్తుకు పునాదులు

ఆసియాన్ సదస్సులో మోడీ.. వర్చువల్‌గా హాజరైన ప్రధాని

## ఈ శతాబ్దం మనదే



**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** భారత్, ఆసియాన్ కేవలం భౌగోళికంగా మాత్రమే కాకుండా, సంస్కృతి, విలువల పరంగా కూడా దగ్గరగా ఉన్నాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలు మాత్రమే కాక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాలు కూడా బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆసియాన్ కుటుంబంలో మరోసారి చేరడం ఆనందంగా ఉందని చెప్పారు. అలాగే, ఆసియాన్‌లో కొత్త సభ్య దేశంగా చేరిన తిమోర్‌లెస్టేకు స్వాగతం పలికారు. తాజాగా విజయవంతంగా సదస్సు నిర్వహించినందుకు అన్వర్ ఇబ్రహీంకు అభినందనలు తెలియజేశారు. ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... ఆసియాన్ భారతదేశ "యాక్ట్ ఈస్ట్ పాలసీ"లో కీలక స్తంభమని, ఆసియాన్ సెంట్రాలిటీని, ఇండో పసిఫిక్ దృష్టికోణాన్ని భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని స్పష్టమైంది. ఈ ఏడాది ఆసియాన్ సదస్సు థీమ్ ఇంక్లూజివిటీ అండ్ సస్టైనబిలిటీగా ఉండడం మన ఉమ్మడి కృషిని ప్రతిబింబిస్తున్నదని, డిజిటల్ ఇన్‌క్లూజన్, ఫుడ్ సెక్యూరిటీ, సరఫరా గొలుసు స్థిరత్వం వంటి రంగాల్లో సహకారం మరింత బలపడుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో 2026 ను భారత్- ఆసియాన్ సముద్ర సహకార సంవత్సరంగా ప్రకటించారు.



కౌలాలంపూర్‌లో ఎయిర్‌పోర్టులో కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న ట్రంప్-2లో



జమ్మూలో ఆదివారం విలీన దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులు

## గుర్తించని బస్సు డ్రైవర్

>> రోడ్డు డివైడర్ కు ఢీకొట్టాడు. రోడ్డుపై పడి ఉన్న బైకును గుర్తించిన బస్సులు పక్క నుంచి వెళ్లాయి. గుర్తించని డ్రైవర్ లక్ష్మయ్య బైక్ పైనుంచి వెళ్లడమే ప్రమాదానికి కారణం. అంతేగాక బైక్ పై నుంచి బస్సు ఎక్కిందని తెలిసిన వెంటనే 100 మీటర్ల లోపే బస్సును ఆపి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని నిపుణులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ ప్రమాదంలో బైకర్ తప్పు కొంత ఉన్నప్పటికీ బైకును గుర్తించలేనంత గుర్తించకపోవడం డ్రైవర్ తప్పు. బైక్ ఢీకొట్టిన విషయం తెలిసి కూడా బస్సును ఆపకపోవడం మరో తప్పని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. బస్సు దగ్ధం పై రమేష్ అనే ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు అందులో ఏ1 ముద్దాయిగా డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య ను పేర్కొనగా, ఎ2 ముద్దాయిగా వి కావేరి ట్రావెల్స్ యాజమాన్యంను పేర్కొన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యము ట్రావెల్స్ యాజమాన్యం తప్పుల కారణంగా ప్రమాదం జరిగినట్లు అభియోగాలు నమోదు చేశారు. బైక్ యాక్సిడెంట్ పై మరో కేసును నమోదు చేశారు. శివశంకర్ మద్యం తాగి బైకును నిర్లక్ష్యంగా నడపడంతో బైక్ రోడ్డు డివైడర్ ను ఢీకొని ప్రమాదం జరిగినట్లు కేసులో పేర్కొన్నారు. ఇందులో బైకర్ మిత్రుడు ఎర్రి స్వామి ఫిర్యాదారుడుగా చూపించారు. పోలీసు విచారణ కొనసాగుతోంది.

## మద్యం సేవించి నడిపిన బైకర్

>> క్రమంలో శివశంకర్, ఎర్రి స్వామి మద్యం షాపులో మద్యం కొనుగోలు చేసిన వీడియోలను కూడా విడుదల చేశారు. బైకర్ శివశంకర్ ప్రమాదానికి ముందు రోజు మద్యం కొనుగోలు చేస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సీసీ కెమెరా ఫుటేజ్ ప్రకారం.. గురువారం సాయంత్రం 7 గంటలకు ఒకసారి, మళ్లీ రాత్రి 8.25 గంటలకు శివశంకర్ పెద్దటేకూరు గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ వైన్స్ వద్ద మద్యం కొనుగోలు చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సీసీటీవీ ఫుటేజ్ ఇప్పుడు కావేరి బస్సు ప్రమాదం దర్యాప్తునకు మరో ఆధారంగా మారింది. అదే క్రమంలో వైద్యులు నిర్వహించిన శవ పరీక్షల్లో సైతం అతను మద్యం సేవించినట్లు స్పష్టమైంది. ఈ క్రమంలో ఎర్రి స్వామిని విచారించిన పోలీసులు శివశంకర్ పై ఫిర్యాదు తీసుకున్నారు. తీవ్ర మద్యం మత్తులో బైక్ నడిపి రోడ్డు డివైడర్ ను ఢీ కొట్టాడని ఎర్రి స్వామి ఫిర్యాదులో వివరించాడు. ఆ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

**బస్సు ప్రమాద మృతదేహాల అప్పగింత**

ఇటీవల చిన్నటేకూరులో జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను సంబంధిత బాధిత కుటుంబాలకు అందజేసి, వారి స్వగృహాలకు అంబులెన్స్ల ద్వారా పంపినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. డిఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాక, గుర్తింపు నిర్ధారణ అనంతరం బాధిత కుటుంబాలకు మృతదేహాలు అందజేయడం జరిగిందని ఆమె వివరించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు 10 మృతదేహాలను 7 కుటుంబాలకు అందజేశామని, మిగిలిన మృతదేహాలను కూడా ఈరోజు సాయంత్రం 3 గంటల నుండి 8 గంటల మధ్యలో సంబంధిత కుటుంబ సభ్యులు రాగానే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రేపు మిగిలిన బాధిత కుటుంబాలు రానున్నాయని, వారికి కూడా మృతదేహాలు అందజేయడానికి ఏర్పాట్లు పూర్తిగా ఉన్నాయని తెలిపారు. మరణించిన వారిలో ఒక గుర్తు తెలియని మృతదేహం కూడా ఉన్నదని, పోలీసు శాఖ సహకారంతో ఆ మృతదేహాన్ని త్రిమూర్తులు అనే వ్యక్తిగా గుర్తించగలిగామని కలెక్టర్ తెలిపారు. ఆ వ్యక్తి కుటుంబ సభ్యుల డిఎన్ఏ శాంపిల్ ఈ ఉదయం సేకరించామని, రేపు ఫలితం అందిన వెంటనే ఆ మృతదేహాన్ని కూడా వారికి అందజేయనున్నామని తెలిపారు.

బీహార్ రాష్ట్రానికి చెందిన 48 సంవత్సరాల అమృత్ కుమార్ కుటుంబ సభ్యులు కర్నూలులోనే దహన సంస్కారాలు నిర్వహించినట్లు, అందుకోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డా.ఏ.సిరి వివరించారు. బాధిత కుటుంబాలకు ఎక్స్గ్రేషియా (ఆర్థిక సాయం) చెల్లింపుల కోసం సంబంధిత కుటుంబాల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి, నివేదికను ప్రభుత్వానికి పంపించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## మరో 21 మంది మావోలు లొంగుబాటు

>> మంది పార్టీ సభ్యులు ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. బస్తర్‌రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీ సుందర్‌రాజ్ మాట్లాడుతూ మావోయిస్టులు తాము అనుసరిస్తున్న మార్గం వ్యర్థమని భావించి వారి జీవితాలను పునర్నిర్మించుకునేందుకు జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని ఎంచుకున్నారన్నారు. ఆయుధాలను విడిచిపెట్టిన 21 మందిలో 13 మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారన్నారు. వారంతా సాయుధ పోరాటాన్ని వీడి శాంతి, పురోగతి మార్గంలో వెళ్లాలనుకుంటున్నారని పోలీస్ అధికారి పేర్కొన్నారు.

లొంగుబాటు సమయంలో మావోయిస్టులు 18 ఆయుధాలను అప్పగించారు. ఇందులో మూడు ఒకే 47 రైఫిల్స్, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, రెండు ఇన్సాస్ రైఫిల్స్, ఆరు 303 రైఫిల్స్, రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, ఓ బీజీఎల్ (బారెల్ గ్రెనేడ్ లాంచర్) ఉన్నాయి. చట్టప్రకారం పునరావసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. లొంగుబాటు, పునరావాసానికి సంబంధించిన వివరాలన్నీ త్వరలోనే వివరిస్తామని ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల పెద్ద సంఖ్యలో మావోయిస్టులు అడవి మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. అక్టోబర్ మూడో వారంలో దాదాపు 238 మంది మావోయిస్టులు లొంగిపోచారు. 17న బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయం జగదల్‌పూర్‌లో అధికారుల ముందు లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడితో సహా దాదాపు 210 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. రూ.9.18 కోట్ల రివార్డును ప్రకటించారు. లొంగిపోయిన సీనియర్ నేతల్లో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్ అలియాస్ సతీశ్, భాస్కర్ అలియాస్ రాజ్‌మన్ మాండవి, రాణిత, రాజు సలాం, ధన్ను వెట్టి, అలియాస్ సంతు, నలుగురు సభ్యులు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ప్రాంతీయ కమిటీ సభ్యుడు రతన్ ఎలామ్ ఉన్నారు.

## కాలేజీల నిరవధిక బంద్!

>>ఇవ్వకపోవడంతో కాలేజీలను నడిపే పరిస్థితుల్లో లేమన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల్లో భాగంగా టోకెన్లు జారీ చేసిన రూ.1200 కోట్లలో ఇప్పటి వరకు కేవలం రూ.300 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నవంబర్ 1 లోపు మిగిలిన రూ. 900 కోట్లను విడుదల చేయాలని.. అలా చేయకపోతే నవంబర్ 3 నుంచి రాష్ట్రంలో నిరవధిక బంద్‌ను చేపట్టనున్నట్టు తెలిపారు. మిగిలిన బకాయిలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 9 వేల కోట్ల బకాయిల మీద ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ వైఖరికి అనుగుణంగా మా నిరసన కార్యక్రమాలు ఉంటాయని, నవంబర్ 10 లోపల 2 లక్షల మందితో సమావేశం ఏర్పాటు చేస్తామని.. ఆ తర్వాత 10 లక్షల మంది విద్యార్థులతో భారీసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తాము ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల గురించి అడిగినప్పుడే ప్రభుత్వ ఎంక్వైరీలు చేయిస్తోందని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌బకాయిల విషయంలో మంత్రులు తమకు సహకరించడం లేదన్నారు. 2024-25 విద్యా సంవత్సరం వరకు ఉన్న అన్ని పెండింగ్ బకాయిలను 2026 మార్చి 31 నాటికి పూర్తి చెల్లింపు జరిగేలా చూడాలన్నారు. అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26 బకాయిలను సైతం 2026 జూన్ 30 లోపు పూర్తిగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటితోపాటు ఏఐసిటీఈ కొత్తగా ఆమోదించబడిన కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను త్వరగా విడుదల చేయాలన్నారు. కొత్త కోర్సుల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయాలని, తద్వారా సంస్థలు కనీసం వచ్చే విద్యా సంవత్సరానికి ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు.

## రాడార్‌లో ఉన్నాం

>> సంజయ్ చిల్లరగా మాట్లాడారని మహేష్‌కుమార్ విమర్శించారు. ఒక్కో నియోజక అభివృద్ధి జరుగుతోందని అన్నారు. వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం మా సంస్కృతి కాదు. మాగంటి కుటుంబ విషయాలు మీడియాలో చూశాకే తెలుసని అన్నారు. జూబ్లీహిల్స్ లో 10 ఏళ్లు వాళ్లే గెలిచారు మరి ఓట్ చోరీ ఎవ్వరు చేశారని ప్రశ్నించారు. ఓట్ చోరీ పై తొలుత పిర్యాదు చేసింది రేవంత్ రెడ్డి అని అన్నారు. అధికారులు మంత్రులు ఎవరైనా జవాబుదారీ తనంగా ఉండాలని అన్నారు. కెసిఆర్‌ను ఉద్యమ నాయకుడిగా గౌరవిస్తామని, కెసిఆర్ పరిపాలన మాత్రం గాడి తప్పి, రాష్ట్రం దివాళా తీసిందని అన్నారు. కవిత వాస్తవాలు మాట్లాడాలి, గత పదేళ్ల పాలనలో కవిత భాగస్వామిగా ఉందరి అన్నారు.

## వారం - వర్జ్యం

**27-10-2025, సోమవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**కార్తీకమాసం, దక్షిణాయణం**
**శరద్ ఋతువు, శుక్లపక్షం**
పంచమి ఉ.6.05
మూల మ.1.25
వర్జ్యం : రా.11.56-1.41
దు.మ.12.15-1.01, 2) మ.2.35-3.21
శుభసమయం : ఉ.5.30-6.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

- **మేషం** : దూరపు బంధువులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.
- **వృషభం**: నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.
- **మిథునం**:ముఖ్యమైన వ్యవహారాలలో నిదానం అవసరం. సన్నిహితుల కలయిక.
- **కర్కాటకం**:వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించడం చెప్పదగినది.
- **సింహం**:స్పెక్యులేషన్ లాభించదు. సంతానపరంగా సంతృప్తిని పొందుతారు.
- **కన్య** : కుటుంబ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.
- **తుల** :ఉద్యోగులు అదనపు బాధ్యతలు మోయాల్సి ఉంటుంది. శుభవార్తలు.
- **వృశ్చికం**:ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటా బయటా అనుకూలం.
- **ధనుస్సు**: ఆకస్మిక ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.
- **మకరం**: జీవిత భాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.
- **కుంభం**: పాత బాకీలు వసూలవుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు.
- **మీనం** : సంతానం గురించి అధికంగా ఆలోచిస్తారు. ప్రముఖులతో పరిచయాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేడే మద్యం షాపులకు డ్రా

>> చేతుల మీదుగా జరుగుతుందని ఎక్సయిజ్ కమిషనర్ హరికిరణ్ ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. హైకోర్టు నుంచి అనుమతి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అసౌకర్యాలకు కలగకుండా డ్రా ఏర్పాట్లను చేయాలని అధికారులకు కమిషనర్ అదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. 2025-27 కాలపరిమితితో నిర్వహించే మద్య షాపులు డిసెంబర్ 1వ తేది నుంచి ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈసారి మద్యం దుకాణాలకు దరఖాస్తుల ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2854.11 కోట్లు ఆదాయం వచ్చింది. గత నెల 26 నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిన్నటితో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాల కోసం 95,137 దరఖాస్తులు వచ్చినట్లు అబ్కారీ శాఖ వెల్లడించింది. ఒక్కో దరఖాస్తుకు రుసుం కింద రూ. 3లక్షలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేసింది. 2023లో దరఖాస్తుల రుసుం రూ.2 లక్షలు ఉండగా.. లక్షా 32 వేలకు పైగా దరఖాస్తులు వచ్చి రూ.2,640 కోట్లు ఆదాయం వచ్చింది. తాజాగా దరఖాస్తు రుసుం రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గినా.. గతం కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 29,420 దరఖాస్తులు రాగా, అదిలాబాద్ డివిజన్ పరిధిలో అతి తక్కువగా 4154 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా శంషాబాద్‌లో 100 మద్యం షాపులకు 8,536 దరఖాస్తులు, సరూర్‌నగర్‌లో 134 మద్యం షాపులకు 7,845 దరఖాస్తులు వచ్చాయి. మేడ్చల్‌లో 114 మద్యం షాపులకు 6,063 దరఖాస్తులు మల్కాజిగిరిలో 88 మద్యం షాపులకు 5,168 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా కుమురంభీంలో 32 మద్యం షాపులకు 680 దరఖాస్తులు వచ్చాయి. అదిలాబాద్‌లో 40 మద్యం షాపులకు 771 దరఖాస్తులు, కోమురమ్ భీం అసిఫాబాద్‌లో 32 షాపులకు 680, మంచిర్యాలలో 73 షాపులకు 1712, నిర్మల్‌లో 47 షాపులకు 3002, హైదరాబాదులో 82 షాపులకు 3201, సికింద్రాబాద్‌లో 97 షాపులకు 3022, జగిత్యాలలో 71 షాపులకు 1966, కరీంనగర్‌లో 94 షాపులకు 2730, పెద్దపల్లి 77 షాపులకు 1507, రాజన్న సిరిసిల్లలో 48 షాపులకు 1381, ఖమ్మంలో 122 షాపులకు 4430, కొత్తగూడెం 88 షాపులకు 3922, జోగులాంబ గద్వాలలో 36 షాపులకు 774, మహబూబ్‌నగర్‌లో 90 షాపులకు 2487 దరఖాస్తులు వచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో 67 షాపులకు 1518, వనపర్తిలో 37 షాపులకు 757, మెదక్‌లో 49 షాపులకు 1920, సంగారెడ్డి 101 షాపులకు 4432, సిద్దిపేట్‌లో 93 షాపులకు 2782, నల్లగొండ 155 షాపులకు 4906, సూర్యపేట్‌లో 99 షాపులకు 2771, యాదాద్రి భువనగరిలో 82 షాపులకు 2776, కామారెడ్డి 49 షాపులకు 1502, నిజామాబాద్ 102 షాపులకు 2786, మల్కాజిగిరిలో 88 షాపులకు 5168, మేడ్చల్‌లో 114 షాపులకు 6063, సరూర్‌నగర్‌లో 134 షాపులకు 7845, శంషాబాద్‌లో 100 షాపులకు 8536 వికారాబాద్ 59 షాపులకు 1808, జనగామాలో 47 షాపులకు 1697, భూపాలపల్లి 60 షాపులకు 1863, మహబూబాబాద్‌లో 59 షాపులకు 1800, వరంగల్ రూరల్‌లో 63 షాపులకు 1958, వరంగల్ అర్బన్‌లో 65 షాపులకు 3175 దరఖాస్తులు వచ్చాయి.

**విక్రయాలు 10 రెట్లు దాటితే 10శాతం పన్ను**

మద్యం దుకాణం టర్నోవర్ వార్షిక లైసెన్స్ రుసుముకు 10 రెట్లు దాటితే విక్రయాలపై 10 శాతం షాప్ టర్నోవర్ ట్యాక్స్‌ను వసూలు చేస్తారు. స్పెషల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఏటా రూ.5 లక్షలుగా నిర్ణయించారు. జీహెచ్ఎంసీకి అవతల ఐదు కి.మీ. పరిధిలోని దుకాణాలకు జీహెచ్ఎంసీలోని దుకాణాల లైసెన్స్ రుసుమే ఉంటుంది. ఇదే నియమం తెలంగాణలోని మిగిలిన కార్పొరేషన్లకు వర్తించనుంది. మున్సిపాలిటీ లేదా సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఈ పరిధిని రెండు కి.మీ.గా నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రమంతటా దుకాణాలను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచేందుకు అనుమతి ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం రాత్రి 11 గంటల వరకు అమ్మకాలు సాగించే వెసులుబాటు కల్పించారు. రూ.5లక్షలను అదనంగా చెల్లించి వాక్ఇన్ స్టోర్ తరహాలో మద్యం దుకాణాన్ని నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు. 2,620 దుకాణాల్లో గౌడ సామాజికవర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

## 'జూబ్లీ' తర్వాతే డిసిసిలు!

>> పాటు స్థానికంగా సమస్యలు పేరుకు పోతున్నాయి. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా కొనసాగుతోంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ముందుకెళ్లే విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినందున, ఎన్నికల నిర్వహణకు సర్కార్ తర్జన భర్జన పడుతోంది. ఇదే సమయంలో డిసిసి అధ్యక్షుల నియామకం చేయాల్సి ఉన్నందున 42శాతం రిజర్వేషన్ల మేరకు బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని కాంగ్రెస్ పార్టీలో కొందరు కోరుతున్నట్లు సమాచారం. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. రాష్ట్రంలోని 12,769 పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. గతేడాది జనవరి 31న సర్పంచిల పదవీకాలం ముగిసింది. రాష్ట్రంలోని 539 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీలకు 2019 మే నెలలో ఎన్నికలు జరిగాయి. గతేడాది జులై 3న మండల పరిషత్, జులై 4న జిల్లా పరిషత్‌ల పాలక మండళ్ల పదవీకాలం ముగిసింది. రాష్ట్రంలోని పది కార్పొరేషన్లు, 118 మున్సిపాల్టీలకు 2020లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 26న వాటి పదవీకాలం కూడా ముగిసింది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలు నిర్వహించలేక పోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధం, మంచినీరు వంటి సమస్యలు పేరుకుపోతున్నాయి.

మరోవైపు కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా నిలిచిపోయాయి. ఎన్నికలు జరగకపోవడంతో గత ఆర్థిక సంవత్సరం రావాల్సిన రూ.1514 కోట్లను కేంద్రం నిలిపివేసింది. గ్రామ పంచాయతీల ఎన్నికలకు నిర్వహణకు హైకోర్టు విధించిన గడువు గత నెల 30కే ముగిసింది. సరిగ్గా ఒక రోజు ముందు నోటిఫికేషన్ ఇచ్చిన రాష్ట్ర ఎన్నికల సంఘం, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో నిలిపివేసింది. నోటిఫికేషన్‌ను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై ఈ నెల 17న విచారణ జరిపిన హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో రెండు వారాల్లో చెప్పాలని ప్రభుత్వాన్ని, ఎస్ఈసీని ఆదేశించి నవంబరు 3కు వాయిదా వేసింది. ఆ రోజున విచారణ పరిణామాలను పరిశీలించి నవంబరు 7న స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించాలని కేబినెట్ రెండు రోజుల క్రితం నిర్ణయించింది.



న్యూఢిల్లీలో ఆదివారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో సిఎం రేవంత్

## రేపటి నుంచి జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో సిఎం రేవంత్ ప్రచారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభ, నాలుగు రోడ్డు షోలకు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నెల 28వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహణకు కాంగ్రెస్ హై కమాండ్ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 30, 31వ తేదీల్లో ముఖ్యమంత్రి రోడ్డు షో నిర్వహించనున్నారు. నవంబర్ 4, 5వ తేదీల్లో మరో విడత రోడ్డు షోలో పాల్గొననున్నారు.

**ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి నివాసానికి సిఎం రేవంత్‌రెడ్డి**

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడి నివాసానికి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి వెళ్లారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రామ్మోహన్‌కుమారుడు శివన్ ఎర్రన్నాయుడు బారసాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివన్ ఎర్రన్నాయుడిని రేవంత్ ఆశీర్వదించారు. అనంతరం అక్కడే ఉన్న పలువురు ఏపీ నాయకులతో కరచాలనం చేస్తూ ముచ్చటించారు. అనంతరం ఆయన సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## నవంబరు 1 నుంచి దేశమంతా 'సర్'

>> పూర్తవుతుంది. అన్నిరాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణలపై సన్నద్ధతను కేంద్ర సంఘం ఇటీవలే సమీక్షచేసింది. దేశవ్యాప్తంగా ఓటర్ల సవరణ జరుగుతుందని, రెండురోజుల సమావేశంలో ఎన్నికల సంఘం సమగ్ర సమీక్షలుచేసింది. సమీక్షలోనే వివిధ రాష్ట్రాలు కేంద్రపాలితప్రాంతాల సిఇఒలు లేవనెత్తిన అభ్యంతరాలు, సందేహాలనునివృత్తిచేసింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఎలాంటి లోపాలు, అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఇసి రాష్ట్రాల సిఇఒలు ఇతర ఎన్నికల అధికారులకు సూచించిన సంగతి తెలిసిందే.

## అకాల వర్షాలకు అన్నదాతల ఆర్తనాదాలు

### తడిసి ముద్దయిన మొక్కజొన్న, పత్తి పంట

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. అకాల వర్షాల వల్ల భారీగా పంట నష్టం వాటిల్లుతుంది. చేతికి వచ్చిన పంటలను ఆరబట్టి యత్నంలో వాటిని కాపాడుకోవడానికి రైతులు పారీలు కప్పే ప్రయత్నం చేసిన భారీ వర్షం పడడంతో నీరు క్రిందికి వెళ్లి పూర్తిగా పాడైపోతున్నాయి. మొక్కజొన్న, సోయాబీన్ ఆరబెట్టిన చోటే వర్షార్పనం అవుతున్నాయి. వర్షానికి తడిసి ముద్ద కావడం జరిగింది. రైతులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటుంన్నారు. పత్తి పంట అయితే మరీ దారుణంగా మారింది. పత్తి పంట ఒకప్పుడు అన్నదాతల పాలిట బంగారు కాసులు తెచ్చిపెట్టింది. కానీ ఇప్పటి పరిస్థితులు మాత్రం రైతులను నిండా ముంచుతున్నాయి. పెట్టుబడులు పెరిగాయి దిగుబడులు తరిగాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల కొన్ని భూముల్లో ఏపుగా పెరిగాయి, కొన్ని భూములలో పూర్తిగా నీరుగారిపోయాయి. పెరిగిన వాటిలో కాయలు పూత అంతంత మాత్రంగాని ఉంది. ఉన్నవాటిలో చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షాలకు పత్తి పంట తడిసి ముద్దవుతున్నాయి. వర్షాల వల్ల పంట నాణ్యత క్షీణించడం, కాయలు తడిసి నల్లబడి దీనివల్ల మార్కెట్‌లో వాటి విలువ తగ్గిపోతుంది. మొత్తానికి రైతుల కంట నీరే మిగిలింది.

## 2 లక్షల మంది 'ఔట్‌సోర్సింగ్' జీతాలు నిలిపివేత

>>4,93,820 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో 2,74,844 మంది ఉద్యోగుల వివరాలు మాత్రమే ప్రభుత్వం వద్ద ఉన్నాయి. మిగతా 2,18,976 మంది వివరాలు లేవు. దీంతో ఈ నెల 17న అన్ని శాఖలకు ఆర్థిక శాఖ సర్క్యులర్ పంపింది. ప్రతి ఉద్యోగి ఆధార్ నంబరు, బ్యాంకు అకౌంట్ వివరాలను ఐఎఫ్ఎమ్ఎస్ పోర్టల్లో అక్టోబర్ 25వ తేదీలోపు నమోదు చేయాలని ఆదేశించింది. లేదంటే వచ్చేనెల నుంచి వారికి జీతాలు చెల్లించబోమని స్పష్టం చేసింది. కానీ, శనివారం రాత్రి వరకు సుమారు లక్ష మంది ఎంప్లాయీస్ వివరాలు మాత్రమే నమోదైనట్టు అధికారులు గుర్తించారు. మిగతా లక్షమంది వివరాలు మాత్రం నమోదు చేయలేదు. దీంతో వారంతా నకిలీలే అనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతున్నది. ఆధార్ లింక్ లేకపోవడంతోనే కొందరు అధికారులు ఇన్నాళ్లూ ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. రికార్డుల్లో తమకు ఇష్టం ఉన్న వ్యక్తుల పేర్లు రాసుకుని జీతాలు చెల్లించగా, కొందరైతే ఒకే వ్యక్తి పేరుతో నాలుగైదు శాఖల్లో వేతనాలు డ్రా చేశారని ఆరోపణలున్నాయి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి వివరాలను సమగ్ర ఆర్థిక నిర్వహణ సమాచార వ్యవస్థ (ఐఎఫ్ఎంఐఎస్)లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేస్తే మాత్రమే జీతాలు విడుదల చేయాలని ఆర్థికశాఖ గత నెలలోనే మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ బాధ్యత ఆయా ఆఫీసుల్లో జీతాల డ్రాయింగ్ అధికారులదేనని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్చరించింది. కానీ సరైన స్పందన లేకపోవడంతో వివరాలు ఇవ్వని వారికి ఈ నెల శాలరీ ఆపేయాలని తాజాగా ఉత్తర్వులిచ్చింది.

తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగుల్లో శాశ్వత(పర్మనెంట్) కేటగిరిలో 5.21 లక్షల మంది, తాత్కాలిక కేటగిరిలో 4.93 లక్షల మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి ఉద్యోగి తమ ఆధార్, మొబైల్ నంబర్ తదితర వివరాలు కచ్చితంగా ఇవ్వాలని చెప్పినప్పటికీ కొన్నిశాఖలు మాత్రం నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. వాటిలో ఒక్కరి వివరాలు కూడా నిర్దేశిత తేదీలోగా ప్రభుత్వానికి సమర్పించలేదు. ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర వివరాలు లేకపోవడంవల్ల కొన్నిచోట్ల అక్రమంగా శాలరీలు డ్రా చేస్తున్నట్లుగా తెలుస్తోంది. మరికొందరు అనధికారికంగా సుదీర్ఘ సెలవులో(లాంగ్ లీవ్) వెళ్లినా జీతాలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారాలు బయటపడతాయనే భయంతోనే చాలామంది వివరాలివ్వడంలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేరు, సెల్‌ఫోన్ నంబర్, ఆధార్ నంబర్‌తో పోల్చి చూస్తే అసలు ఏ ఉద్యోగి ఏ ప్రభుత్వ శాఖలో ఉన్నారనే స్పష్టమైన వివరాలు అందుతాయని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చెప్పారు. ఉద్యోగుల సమగ్ర వివరాలు ప్రభుత్వానికి చాలా అవసరమని ఆయన వివరించారు. ప్రతి నెలా 10వ తేదీలోగా ఐఎఫ్ఎంఐఎస్‌లో ప్రతి ఉద్యోగికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని చెప్పినా చేయడం లేదని ఆయన తెలిపారు.

## ఎయిర్‌పోర్టులో మలేసియా కళాకారులతో ట్రంప్ డాన్స్!

**కౌలాలంపూర్, అక్టోబరు 26:** వయసు పైబడుతున్నా తనలో ఉత్సాహానికి లోటులేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరూపించారు. దాదాపు 23 గంటల విమాన ప్రయాణం తరువాత ఎయిర్‌పోర్టులో దిగగానే ఆయన తన దైన శైలిలో స్టెప్పులేశారు. ఇందుకు సంబంధించి వీడియోలు ప్రస్తుతం తెగ వైరల్ అవుతున్నాయి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐదు రోజులపాటు ఆసియా దేశాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తాజాగా మలేషియాకు వెళ్లారు. కౌలాలంపూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రంప్‌కు ఘన స్వాగతం లభించింది. ఆయనను ఆహ్వానించేందుకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీమ్ స్వయంగా ఎయిర్‌పోర్టుకు వచ్చారు. మరోవైపు మలేషియా కళాకారులు తమ సంప్రదాయ నృత్యంతో ట్రంప్‌కు స్వాగతం పలికారు. దీంతో, ట్రంప్ కూడా వారితో కలిసి స్టెప్పులేశారు. బీట్‌కు తగ్గట్టుగా ఉత్సాహంతో చేతులు కదుపుతూ తనదైన శైలిలో డ్యాన్స్ చేశారు. ఆయనతో కలిసి మలేషియా ప్రధాని కూడా డ్యాన్స్ చేశారు. దీంతో, అక్కడున్న వారందరి ముఖాల్లో నవ్వులు విరిశాయి ఇక ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్లు పెద్దఎత్తున స్పందిస్తున్నారు. ట్రంప్ మరోసారి తన మార్కు స్టెప్పులతో ఆకట్టుకున్నారని అన్నారు. ట్రంప్ ఉత్సాహానికి వయసుతో నిమిత్తం లేదని మరికొందరు చెప్పుకొచ్చారు. ఇక ఆసియా టూర్‌లో భాగంగా ట్రంప్ మలేషియాతోపాటు జపాన్, దక్షిణ కొరియాల్లోనూ పర్యటిస్తారు. మలేషియాలో ఆసియాన్‌దేశాల కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఆ తరువాత జపాన్ పర్యటనలో భాగంగా అక్కడి ప్రధానితోనూ భేటీలో పాల్గొంటారు. దక్షిణ కొరియాలో అపెక్ కూటమి దేశాధినేతల సమావేశంలో భాగంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో కూడా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఉత్తర కొరియా అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# కాల్పుల ఘటనపై కొనసాగుతున్న పోలీసు విచారణ

## డిసిపి కాల్పుల్లో గాయపడిన స్నాచర్ పరిస్థితి విషమం
## సోమాజిగూడ యశోదలో చికిత్స పొందుతున్న
## డిసిపి, కానిస్టేబుల్‌కు డిజిపి శివధర్‌రెడ్డి పరామర్శ

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** నగరంలో సంచలనం రేపిన స్నాచర్లపై దక్షిణ, తూర్పు మండల డిసిపి చైతన్యకుమార్ జరిపిన కాల్పుల ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనపై డిసిపి చైతన్య చేసిన ఫిర్యాదు మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసి దీనిపై విచారణ చేబట్టారు. తాను ఏ పరిస్థితుల్లో కాల్పులు జరపాల్సి వచ్చిందనే విషయాన్ని డిసిపి చైతన్య కుమార్ తన ఫిర్యాదులో వెల్లడించారు. కోఠి వద్ద ఓ వ్యక్తి వద్ద నుంచి మొబైల్ ఫోన్‌ను లాక్కొని ఆటోలో పారిపోతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకునేందుకు తన గన్‌మెన్ మూర్తి ప్రయత్నించగా నిందితుల్లో ఒకడైన ఒమర్ అన్సారి గన్‌మెన్‌ను నెట్టివేయడంతో పాటు కత్తితో దాడిచేసేందుకు ప్రయత్నించాడని, ఈ క్రమంలోనే తాను మూడురౌండ్లు కాల్పులు జరిపానని డిసిపి చైతన్య కుమార్ తన ఫిర్యాదులో వివరించారు. ఈ కాల్పుల్లో ఒమర్ అన్సారికి రెండు చోట్ల బుల్లెట్ గా యాలవడంతో అతను పడిపోగా స్థానికుల సహకారంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. ఇదే సమయంలో మిగతా ఇద్దరు నిందితులు ఆటోలో పారిపో యారు. కాగా నిందితులతో జరిగిన తోపులాటలో డిసిపి చైతన్య కుమార్‌తోపాటు ఆయన గన్‌మెన్ మూర్తి గాయపడడంతో వారిని సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా డిసిపి చైతన్య కుమార్ కాల్పుల్లో గాయపడ్డ నేరగాడు ఒమర్ అన్సారీకి కేర్ బంజారాలో వైద్యం అందిస్తున్నారు. ఇతని పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే వుంది. కాగా యశోధ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిసిపి చైతన్యకుమార్ ఆయన గన్‌మెన్ మూర్తిని డిజిపి శివధర్ రెడ్డి ఆదివారం నాడు పరామర్శించారు. ఆసుపత్రిలో వారికి అందిస్తున్న వైద్య సేవలను, వారి ఆరోగ్యం గురించి డిజిపి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. డిజిపి వెంట సిటీ కొత్వాల్ సజ్జన్నార్‌తో పాటు దక్షిణ మండల డిసిపి స్నేహ మెహ్రా తదితరులున్నారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ నేరగాళ్లలో జరిగిన తోపులాటలో గాయపడ్డ డిసి పి చైతన్య కుమాన్ ఆయన గన్‌మెన్ మూర్తి ఆరోగ్యం నిలకడగా వుందని, వారిద్దరు సోమవారం డిశ్చార్జి అవుతారని తెలిపారు. నేరగాళ్లను పట్టుకునే ందుకు డిసిపి చైతన్యకుమాన్ ఆయన గన్‌మెన్ మూర్తి ఎంతో సాహసం చేశారని డిజిపి తెలిపారు. ఈ క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో డిసిపి చైతన్యకుమార్ కాల్పులు జరపగా నేరగాడు ఒమర్ అన్సారికి గాయాలు తగిలాయని, అతడిపై అనేక కేసులు న్నాయని, రెండుసార్లు పిడి చట్టం కింద జైలుకు వెళ్లాడని, పారిపోయిన ఇతని ఇద్దరు అనుచ రులకు కూడా నేర చరిత్ర వుందని, వారి కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఒమర్ అన్సారితో పాటు వున్న ఇద్దరు నేరగాళ్లను పట్టుకునేందుకు సుల్తాన్‌బజార్ పోలీసులు ముమ్మ రంగా గాలింపు చర్యలు చేబట్టారు. వారి అనుచరులను అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. ఒకటి రెండు రోజుల్లో వీరిని పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.



ఆదివారం డిజిపి శివధర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దక్షిణ, తూర్పు మండల డిసిపి చైతన్యకుమార్‌ను పరామర్శిస్తున్న దృశ్యం, చిత్రంలో సిపి సజ్జనార్ తదితరులు



ఆదివారం మాదాపూర్ విఠల్‌రావునగర్‌లో అగ్రసేన్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించిన రాజ్యసభ మాజీసభ్యుడు, 'వార్త' సిఎండి గిరీష్‌కుమార్ సంఘీ తదితరులు

# మెరుగైన సేవల్లో అగ్రసేన్ బ్యాంక్ మేటి

## బ్యాంక్ కొత్త శాఖను మాదాపూర్‌లో
## ప్రారంభించిన 'వార్త' సిఎండి గిరీష్‌కుమార్ సంఘీ

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), అక్టోబరు 26, ప్రభాతవార్త:** అగ్రసేన్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ తన 11వ నూతన బ్రాంచ్‌ను హైటెక్ సిటీ పరిధిలోని మాదాపూర్ విఠల్‌రావునగర్‌లో ప్రారంభించింది. రాజ్యసభ మాజీసభ్యుడు, 'వార్త' సిఎండి గిరీష్‌కుమార్ సంఘీ ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై అగ్రసేన్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. బ్యాంకు ఆవరణలో ఏరా ్పటుచేసిన స్ట్రాంగ్‌రూమ్, సేఫ్ డిపా జిట్ లాకర్ సౌకర్యాన్ని తెలంగాణ సీనియర్ న్యాయవాది పి.రఘురాం ప్రారంభించారు. బ్యాంకులోని ఇతర బ్యాంకింగ్ సౌకర్యాలను పారిశ్రామికవేత్త చంద్రకాంత్ అగర్వాల్, సీనియర్ న్యాయవాది దుష్యంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరీష్‌కుమార్ సంఘీ మాట్లాడుతూ నేటి సమాజంలో బ్యాంకింగ్ సేవలకు డిమాండ్ పెరిగిందన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో అగ్రసేన్ బ్యాంకు గొప్పపేరు సంపాదించిందని, హైటెక్‌సిటీ పరిధిలోని ఖాతాదారులకు సైతం ఉత్తమ సేవలు అందిస్తుం దనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అగ్రసేన్ బ్యాంకు రాష్ట్రవ్యాప్తంగా తమ సేవలను విస్తరించేందుకు ప్రయత్నిస్తుండడం శుభపరిణామమని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన టెక్నాలజీని అగ్రసేన్ బ్యాంకు అందిపుచ్చుకోవాలని, తద్వారా ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని సూచించారు. బ్యాంకింగ్ సేవలకు పెరిగిన డిమాండ్‌ను తీర్చడంలో అగ్రసేన్ బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా ముందున్నారని అన్నారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య ప్రజలు సైతం బ్యాంకింగ్ సేవల మీద ఆధారపడుతున్నారని, ప్రజల అవసరాలకు అనుగుణంగా బ్యాంకు సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎన్.రామారావు, సూర్యకాంత్ ఆడెప్పు, సురేష్ అగర్వాల్, హజారిలాల్ కేడియా, ఎంఎల్ అగర్వాల్, శాంతనుచౌదరిలతోపాటు సీనియర్ వైస్‌చైర్మన్, సిఎ నవీన్‌కుమార్ అగర్వాల్, వైస్‌చైర్మన్ సురేష్‌కుమార్ అగర్వాల్, బిఒఎం చైర్మన్ నారాయణ్‌దత్, డైరెక్టర్లు మోహన్ అగర్వాల్, గోపాల్‌చంద్ అగర్వాల్, రాజేష్‌కుమార్ అగర్వాల్, అంజూ కేడియా, బజరంగ్ ప్రసాద్‌గుప్తా, సిఎ పంకజ్‌కుమార్ అగర్వాల్, బిఒఎం సభ్యులు మహావీర్ పిట్టీ, జనరల్ మేనేజర్ సివి.రావు, డిజిఎం ఆనంద్ అగర్వాల్, ప్రసాద్ గోలెగాంకర్, గోపాల్ తివారీ, నితేష్ గుప్తా తదితరులతోపాటు బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాల్పుల ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలి

## మజ్లిస్ పార్టీ డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** నగరంలోని సుల్తాన్‌బజార్‌లో శనివారం సాయంత్రం జరిగిన కాల్పులపై స్వతంత్ర విచారణ జరపాలని మజ్లిస్ పార్టీ డిమాండ్ చేసింది. కోఠి వద్ద ఓ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోతున్న ముగ్గురు నేరగాళ్లను పట్టుకునే క్రమంలో జరిగిన పెనుగులాటలో దక్షిణ, తూర్పు మండల డిసిపి చైతన్య కుమార్, ఆయన గన్‌మెన్ మూర్తి కిందపడిపోగా స్నాచర్లలో ఒకడైన ఒమర్ అన్సారి అనే నేరగాడు చైతన్య కుమార్ ఆయన గన్‌మెన్ మూర్తిపై కత్తితో దాడి చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో డిసిపి చైతన్య కుమార్ తన గన్‌మెన్ మూర్తి వద్ద గల తుపాకితో నేరగాడిపై కాల్పులు జరపడం తెలిసిందే. ఈ కాల్పుల్లో అన్సారికి రెండు బుల్లెట్లు తగిలాయి. వెంటనే అతన్ని కేర్ బంజారాకు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనలో దక్షిణ, తూర్పు మండల డిసిపి చైతన్య కుమార్, ఆయన గన్‌మెన్ మూర్తి స్వల్పంగా గాయపడ్డారు. వీరిద్దరికి సోమాజిగూడ యశోదలో వైద్యం అందిస్తున్నారు. కాగా ఈ ఘటనపై మజ్లిస్ పార్టీ ఆదివారం స్పందించింది. ఈ ఘటనలో మొదటి నుంచి ఏం జరిగిందనే దానిపై స్వతంత్రంగా విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాగా కాల్పుల్లో గాయపడ్డ అన్సారిని బహదూర్‌పురా ఎంఎల్ఎ మహమ్మద్ మొబిన్‌తో పాటు పార్టీకి చెందిన నాయకులు స్థానిక కార్పొరేటర్ ఆదివారం పరామర్శించారు.

# దిగజారిన టిజి, ఎపి విద్యుత్ డిస్కమ్స్ రేటింగ్

## మసకబారిన రాష్ట్ర పంపిణీ సంస్థల పనితీరు

## బిల్లింగ్ సామర్థ్యంలో తగ్గుదల నమోదు



**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** వార్షిక రేటింగ్‌లో గుజరాత్ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డిస్కంలు వెనుకబడి ఉన్నాయి. దేశ వ్యాప్తంగా 2023-24 వార్షిక సంవత్సరానికి సంబంధించి డిస్కంల రేటింగ్‌ను కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఇటీవలే విడుదల చేసింది. 2024-25 రేటింగ్స్‌ను 2026లో విడుదల చేయనుంది. తాజా డిస్కమ్‌ల రేటింగ్ ప్రకారం దేశంలోని 42 రాష్ట్రాల డిస్కంలు, 10 ప్రైవేటు డిస్కంలు, 11 రాష్ట్రాల విద్యుత్ శాఖలకు సంబంధించి పనితీరును పరిశీలించిన కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పంపిణీ సంస్థలు దిగజారినట్లు తేల్చింది. ప్రధానంగా ఈ హబ్‌గా ఎదుగుతున్న హైదరాబాద్ పరిధిలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పనితీరు మసగబారుతోందనేది రేటింగ్‌లో వెల్లడవుతోంది. ఈ 13వ వార్షిక ఇంటిగ్రేటెడ్ రేటింగ్‌లో మొత్తంగా 63 డిస్కంల్లో 21 సంస్థలు వాటి రేటింగ్‌ను మెరుగుపరచుకున్నాయి. మరో 29 డిస్కంలు అప్పటి వరకూ ఉన్న వాటి రేటింగ్‌ను నిలుపుకొన్నాయి. అయితే 13 పంపిణీ సంస్థల గ్రేడ్ పడిపోయింది. ఇక గుజరాత్ డిస్కంలు ఎ+ స్థానాన్ని నిలుపుకొన్నాయి. ఇలా ఈ అగ్రశ్రేణి రేటింగ్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 11 డిస్కంలు ఉన్నాయి. ఇందులో గుజరాత్ నుండి 4 డిస్కంలు, ఒడిశా నుండి 3, హర్యానా నుండి 2, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని ఒక్కొక్క డిస్కం ఉన్నాయి. తెలంగాణకు సంబంధించి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎస్పీడీసీఎల్) ఇప్పటి వరకూ సి గ్రేడ్‌లో ఉండగా, అది ఈ రేటింగ్‌లో సి-కు పడిపోయింది. ఈ సంస్థ 53,325 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను విక్రయించి తద్వారా 4,466 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని ఆర్జించింది. అయితే సేకరణ సామర్థ్యం 83.82 శాతం నుండి 88.18 శాతానికి పెరగడంతో సాంకేతిక, వాణిజ్య నష్టాలు (ఎటి అండ్ సి) 22.19 నుండి 20 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో బిల్లింగ్ సామర్థ్యం 92.83 శాతం నుండి 90.73 శాతానికి తగ్గింది. ఎన్పీడీసీఎల్ కూడా సి కేటగిరి నుండి సి- కు తగ్గింది. ఆ కంపెనీ 21,063 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను విక్రయించి 2,317 కోట్ల రూపాయలను సంపాదించింది. ఎటి అండ్ సి నష్టాలు కూడా 22.19 నుండి 20 శాతానికి తగ్గాయి. బిల్లింగ్ సామర్థ్యం 92.83 నుండి 90.73 శాతానికి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ 2024లో ఎ నుండి బి కి తగ్గింది. 27,347 మిలియన్ యూనిట్ల విద్యుత్ విక్రయించగా, సేకరణ సామర్థ్యం 100 నుండి 95.46 శాతానికి తగ్గడం వల్ల సాంకేతిక, వాణిజ్య నష్టాలు 5.94 నుండి 10.41 శాతానికి భారీగా పెరిగాయి. బిల్లింగ్ సామర్థ్యం కూడా 94.06 నుండి 93.85 శాతానికి పడిపోయింది. ఇక సెంట్రల్ పవర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌కు బి ఉండే గ్రేడ్ సి కి పడిపోయింది. సాంకేతిక, వాణిజ్య నష్టాలు 10.33 నుండి 11.37 శాతానికి పెరగ్గా, బిల్లింగ్ సామర్థ్యం 91.98 నుండి 92 శాతానికి మెరుగుపడింది. బి- ఉండే సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సి కి తగ్గిపోయింది. సేకరణ సామర్థ్యం 100 నుండి 93.6 శాతానికి తగ్గడం వల్ల సాంకేతిక, వాణ్యి నష్టాలు 8.08 నుండి 13.95 శాతానికి భారీగా పెరిగింది.

# ఆధునిక టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించుకోవాలి

## యాప్స్ వాడకంపై అవగాహన ఉండాలి
## డిఇఒ, డైట్ ప్రిన్సిపాళ్లకు వివిధ యాప్స్‌పై అవగాహన సదస్సులో పాఠశాల విద్య డైరెక్టర్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఆధునికంగా వస్తున్న టెక్నాలజీని పాఠశాల విద్య శాఖలోనూ ఉపయోగించుకోవల్సిన అవసరం ఉందని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ అన్నారు. ప్రధానంగా జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈవో) తోపాటు డైట్ ప్రిన్సి పాల్స్ దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాఠశాల విద్య శాఖ అధ్వర్యంలో వినియోగించబడుతున్న వివిధ యాప్స్, డిజిటల్ ఇంటర్వెన్షన్‌పై అవగాహన పెంపొందించడానికి డీఈవోలు, డైట్‌ప్రిన్సిపాల్స్‌కి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సులో డైరక్టర్ నవీన్ నికోలస్ పాఠశాల విద్యాశాఖ ద్వారా వినియో గించబడుతున్న వివిధ యాప్స్, డిజిటల్ ఇంటర్వెన్షన్ పై అవగాహనను కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్, ఐఎస్ఎంఎస్, యుడైస్ ప్లస్, విఎస్‌కె, ఎఫ్ఆర్ఎస్ వంటి వివిధ యాప్స్‌పై సంబంధిత అడిషనల్ డైరెక్టర్స్, జాయింట్ డైరెక్టర్స్ కలిసి సమగ్రంగా వాటి నిర్వహణ తీరును తెలియపరచడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానంలో పూర్తిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినందుకు అన్ని జిల్లాల అధికారులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ అభినందించారు. అతి తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేయడంతో పాటు రోజువారీగా క్రమక్రమంగా హాజరు శాతంలో కూడా మెరుగైన ప్రగతిని సాధిస్తున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అత్యుత్తమ హాజరు శాతాన్ని నమోదు చేసిన వారిని జిల్లా, మండల, పాఠశాల స్థాయిల్లో గుర్తించి శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. అత్యధిక సగటు హాజరు శాతం నమోదు చేసిన ఖమ్మం జిల్లా విద్యాధికారి డాక్టర్ పి. శ్రీజ ఐఏఎస్‌ని, అత్యధిక సగటు హాజరు శాతం నమోదు చేసిన ఖమ్మం జిల్లాలోని చింతకాని మండల విద్యాధికారి ఎస్. రామారావుని, అత్యధిక సగటు హాజరు శాతం నమోదు చేసిన పాఠశాలు నిజాంబాద్ జిల్లాలోని భీంగల్ మండలంలోని బెజ్జోర జడ్‌పిహెచ్ఎసన ప్రధానోపాధ్యాయులు ఎండి. హాఫీజుద్దీన్‌ని, ఖమ్మం జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని గణేశ్వరం ఎంపియుపిఎసన ప్రధానోపాధ్యాయులు కె. విజయశ్రీని, నిర్మల్ జిల్లాలోని మామడ మండలంలోని సంతోష్‌నగర్ ఎంపి పిఎస్ ప్రధానోపాధ్యాయులు డి. రాజేంద్రని, అత్యధిక స్వీయ హాజరు శాతం నమోదు చేసిన ఉపాధ్యాయులుగా ములుగు జిల్లా జడ్‌పిహెచ్ఎస్ జంగాలపల్లిలో పనిచేస్తున్న రసమల్ల కృష్ణమూర్తిని, నారాయణ పేట జిల్లా కోస్గి మండలంలోని జడ్‌పిహెచ్ఎసన మీర్జాపూర్‌లో పనిచేస్తున్న జి భీమయ్యని, పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండలంలోని జడ్‌పిహెచ్ఎస్ పోతక్ పల్లిలో పనిచేస్తున్న ఎన్. శ్రీనివాస్‌ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్లు రాధా రెడ్డి, లింగయ్య, రమణ కుమార్, శ్రీనివాస్ చారి, ఎస్‌సీఈఆర్‌టి డైరెక్టర్ జి. రమేష్, జాయింట్ డైరెక్టర్స్ పి. రాజీవ్, వెంకట నరసమ్మ, మదన్మోహన్ పాల్గొన్నారు.

# శ్రీవారి పరకామణి ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ వేయాలి

## రవికుమార్‌పై కేసు రీరిజిస్టర్ చేయాలి
## కన్నీరు పెట్టుకున్న టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 26, ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానం పరకా మణిలో డాలర్ల చోరీ వ్యవహారంపై విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేయాలని టిటిడి మాజీ ఇఒ, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం కోరారు.



సమావేశంలో పాల్గొన్న జస్టిస్ నర్సింహారెడ్డి, ఎల్వీ సుబ్రమణ్యం, రంగరాజన్, భానుప్రకాశ్‌రెడ్డి, తాళ్లపాక రఘువన్, రంజనాకుమార్, తనికెళ్ల సత్య రవికుమార్

పరకామణిలో చోరీ సంఘటన, తదితర అంశాలపై పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డి, సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ, చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానఅర్చకుడు రంగరాజన్, సీనియర్ న్యాయవాది, తాళ్లపాక అన్నమాచార్య వంశస్థుడు తాళ్లపాక కె.రఘువన్, సీనియర్ న్యాయవాది, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామ చందర్‌రావు, విహెచ్‌పి భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, టిడిపి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, మాజీ విజిలెన్స్ కమిషనర్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ రంజనాకుమార్ తదితరులతో కలిసి హైదరాబాద్‌లోని తాజ్‌డెక్కన్ లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

పరకామణిలోకి సేవకులు శరీరంపై ఏ వస్తువు లేకుండా వెళ్తారని, ఏదైనా ఉంటే అది హుండీలో వేస్తారన్నారు. 2012 నుంచి పరకామణి లెక్కింపులో కొన్ని మార్పులు తెచ్చా రని, విధుల్లో ఉండే సిబ్బంది అందుబాటులో లేకపోవడం వంటి సమస్యల కారణంగా భక్తులకు లెక్కింపు అవకాశం కల్పించడం ప్రారంభించారన్నారు. 2023 ఏప్రిల్ 29న పెద్ద జియ్యంగార్ కార్యాలయానికి చెందిన రవికుమార్ అనే క్లర్క్ పరకామణి విధులుకు హాజర య్యారన్నారు.

రవికుమార్ 900 డాలర్లను తస్కరించినట్లు గుర్తించిన సతీష్‌కుమార్ అనే విజిలెన్స్ అధికారి ఫిర్యాదు చేశారన్నారు. ఇంతటి వ్యవహారం లోక్‌అదాలత్‌లో రాజీ కుదరడం, రవికుమార్ తనకున్న ఏడు ఆస్తులను టీటీడీకి దానం చేస్తున్నట్లు ప్రకటించడం, ఈ అంశాన్ని టిటిడి ముందుగా పత్రికల్లో ప్రచురించకపోవడం తదితర అంశాలన్ని అనుమానస్పదంగా ఉన్నాయ న్నారు. పోలీసుల ఒత్తిడితో తాను రాజీకి అంగీకరించినట్లు సతీష్‌కుమార్ చెబుతుండటంతో పాటు, స్వామివారి ఆస్తులు కాపాడే ప్రక్రియ సరిగా జరగలేదన్నారు.

రూ. 100 కోట్లు ఉన్న వ్యక్తి టిటిడిలో క్లర్క్‌గా పనిచేయడమేంటి? అని పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డి ప్రశ్నించారు. ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు చోటుచేసు కోకుండా పాలకవర్గం జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**అదనపు సెక్షన్లతో కేసు రీరిజిస్టర్ చేయాలి: జెడి లక్ష్మీనారాయణ**

పరకామణి చోరీ వ్యవహారంలో మళ్లీ విచారణ చేపట్టాలని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారా యణ కోరారు. రవికుమార్, అతని భార్య టిటిడికి రూ. 14 కోట్ల ఆస్తులు దానంగా ఇచ్చారని, అవి ఎక్కడి నుంచి వచ్చాయనే అంశంపై ఎక్కడ విచారణ జరగలేదన్నారు. ఈ వ్యవహారంపై మొత్తం ప్రక్రియను పున సమీక్షించాలని ఆయన కోరారు.

**అన్యాయంపైనే పోరాటం: భానుప్రకాశ్‌రెడ్డి**

టిటిడి పరకామణిలో చోటుచేసుకున్న డాలర్ల చోరీ తదనంతర పరిణామాలపై న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశాన్ని అడ్డు కోవడానికి చాలామంది ప్రయత్నించారని. చాలా బెదిరింపు తరహా సందేశాలు వచ్చాయి. నాపై ఎంతో ఒత్తిడి తీసుకొస్తున్నారని భానుప్రకాశ్‌రెడ్డి ఉద్వేగానికిలోనై కన్నీటి పర్యంత మయ్యారు. ఈ సంఘటన తనను ఎంతో కలచివేసిందని చిలు కూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్ అన్నారు. బాధ్యులను శిక్షించాలన్నారు. తనికెళ్ల సత్య రవికుమార్ మాట్లాడుతూ పరకామణాలో జరిగింది దొంగతనం కాదని, సామిద్రోహమన్నారు.





# దేశంలో 22 నకిలీ యూనివర్సిటీలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** దేశంలో మొత్తం 22 నకిలీ ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయని 'యూని వర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) హెచ్చరించింది. ఢిల్లీలోని కోట్లా ముబారక్‌పూర్‌లోగల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూజీసీ మరోసారి హెచ్చరికలు చేసింది. ఆ యూనివర్సిటీ అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీచేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఏ చట్టాలకు లోబడి ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది. యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది. వీటిల్లో 9 దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నాయి.
వాటిలో ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీలోని విద్యార్థులను మాయచేసి ఈ విశ్వవిద్యాలయాలు ఆకర్షిస్తున్నాయి. తమ సంస్థలకు పేర్లుపెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ వంటి పదాలు వాడుతున్నారు.

ఇక యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ లాంటి పదాలను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఏదైనా సంస్థలో చేరే సమయంలో దాని పేరు సెక్షన్ 2 (ఎఫ్) లేదా 3 కింద యూజీసీ గుర్తించిన జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి. ఇక ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్ఎంసీ వంటి కౌన్సిల్స్ నుంచి ఆయా సంస్థల్లో ఏ కోర్సుల నిర్వహణకు అనుమతులు లభించాయో సరిచూసుకోవాలి.

# భారత్ నుంచి చైనాకు నేరుగా విమానసర్వీసుల పునరుద్ధరణ



**కోల్‌కతా, అక్టోబరు 26:** భారత్ నుంచి చైనాకు నేరుగా విమానసర్వీసులు పునరుద్ధరి స్తున్నారు. నాలుగేళ్లనుంచి సర్వీసులను సస్పెండ్‌చేసినతర్వాత మొట్టమొదటిసారిగా ఆదివారం రాత్రి పది గంటలకు కోల్‌కత్తానుంచి చైనాలోని గ్వాంగ్‌ఝౌ నగరానికి విమాన సర్వీసు బయలుదేరుతోంది. అలాగే షాంఘై, న్యూఢిల్లీకి నేరుగా విమాన సర్వీసు వచ్చేనెల 9నుంచి ప్రారంభిస్తారు. వారానికి మూడు సార్లు ఈసర్వీసు నడుస్తుందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యుజింగ్‌చెన్ వెల్లడిం చారు. రెండుదేశాల మధ్య నిరంతర సర్వీసులు 2020వరకూ నడిచాయి. కొవిడ్-19 కారణంగా ఈ సర్వీసులు రద్దయ్యాయి. అలాగే తూర్పుప్రాంతంలోని లడక్ సరిహద్దు వివాదంతో కూడా ఈ సర్వీసులు నిలిచిపోయాయి. దౌత్యపరమైన చర్చలతో ప్రైవేటు క్యారియర్ ఇండిగో తన సేవలను చైనాకు విస్తరించనున్నట్లు వెల్లడించింది. ప్రతినిత్యం కోల్‌కత్తా నుంచి గ్వాంగ్‌ఝౌనగరానికి నాన్‌స్టాప్ విమానసర్వీసులు 26వతేదీ నుంచి ప్రారంభిస్తామని తెలిపింది. నేతాజీ సుభా ష్‌చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆదివారంరాత్రి పది గంట లకు మొదటి సర్వీసు ప్రారంభమవుతుందని ఇండిగో ప్రకటించింది.

# జలాశయాలకు గంగాహారతి

## నిండుకుండలా నీరుచేరడం శుభపరిణామం: టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,అక్టోబరు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో జలాశయాలకు నీరు రావడం, నిండుకుండల్లా తలపించడం శుభపరిణామమని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. డ్యామ్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ,నీటి అవసరాలను సక్రమంగా నిర్వహిస్తున్న ఇం జనీరింగ్ విభాగాన్ని ఆయన అభినందించారు. ఇటీవల కురిసిన వరదలతో తిరుమలలోని ఐదు జలాశయాలకు భారీగా నీరుచేయడం, గోగర్భమ్ డ్యామ్, ఆకాశగంగ, పాపవినాశనంలు పూర్తిగా నిండిపోయాయి. ఆదివారం ఉదయం పాపవి నాశనమ్ జలాశయంలో గంగమ్మ తల్లికి గంగాహారతి ఇచ్చారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు నివేదించి పూజలుచేశారు. అనంతరం గంగమ్మ తల్లికి నమస్కరించుకుని భక్తుల తాగునీటి అవ సరాలకు ఎప్పుడూ ఢోకాలేకుండా చూడాలని వేడుకున్నారు. కుమారధార, పసుపుధార తీర్థాలు కొంత మేర నిండాల్సి ఉందని తెలిపారు. భక్తులకు అవసరాల కోసం తిరుమలకు 50లక్షల గ్యాలన్ల నీరు కావాలని, కల్యాణి డ్యామ్ నుండి 25లక్షల గ్యాలన్లు వస్తుంద న్నారు. జలాశయాలన్నీ నిండటంతో 250 రోజులు నీటి అవసరాలకు సరిపడే నీటీనిల్వలు తిరుమలలో ఉన్నాయన్నారు. గంగమ్మతల్లి చల్లని దీవెనలతో గంగా హారతి ఇవ్వడం జరిగిందన్నారు. గడచిన 11నెల ల్లో టిటిడి ట్రస్ట్‌లకు 918కోట్లు రూపాయలు విరాళాలు వచ్చాయని చైర్మన్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, ఇఇలు సుబ్రమణ్యం, శ్రీనివాస రావు, సుధాకర్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోక నాథం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒ అల్లం సురేంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

వార్త

మనిషి తన ధనాన్ని బుర్రగా మార్చుకుంటే దొంగలెవరూ తస్కరించలేరు. జ్ఞానంపై పెట్టిన పెట్టుబడి ఎల్లప్పుడూ మంచి వడ్డీనే ఇస్తుంది.

-పాస్కల్

# పిచ్చుకపై బ్రహ్మాస్త్రం !

ఇంత క్రితమే ఎనిమిది యుద్ధాల్ని ఆపినట్లు ప్రకటించుకున్న ట్రంప్ మహాశయుడుతాజాగా తానే మరో యుద్ధానికి సకలసన్నాహాలు చేస్తున్నారు. ఒక అగ్రదేశం ఓ చిన్న దేశం మీద చేసే సమరాన్ని యుద్ధకాంక్ష అంటారో, ప్రతీకార జ్వాల అనాలో, లేదా వెనిజులాను మందలించడానికే అనుకోవాలో ఈ యుద్ధ పర్యవసానం చెబుతుంది. వెనిజులాలో మాదక ద్రవ్యాల దందా జరుగుతున్నందునే ఆదేశానికి గట్టిగా బుద్ధి చెప్పాలనుకున్నట్లు ట్రంప్ కొద్ది రోజుల క్రితమే బహిరంగంగానే హెచ్చరించారు. ఆయన మెదడులో ఇలాంటి ఆలోచన వచ్చిందంటే అదితక్షణమే అమలు చేయాలనుకుంటారు. ఇప్పుడదే జరిగింది. ప్రపంచంలో ఏ దేశాన్నైనా సుంకాల విధింపు హెచ్చరికలతో గడగడలాడించే ట్రంప్ దేనికీ వెనుకాడడం లేదు. అవతలిది మిత్ర దేశమా? శత్రు దేశమా అని ఆలోచించే పనిలేదు. అమాంతం విరుచుకుపడడమే. అనుకున్నదే తడవుగా ఆయన కరేబియన్ సముద్రంలోకి విమాన వాహన నౌకను పంపారు. అమెరికా తమ దేశంపై యుద్ధాన్ని ప్రకటించి ఆందోళన సృష్టిస్తోందని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ నెత్తీనోరు మొత్తుకుంటున్నాడు. అయినా ఆ దేశంలో ఉన్న మాదక ద్రవ్య స్మగ్లర్లను మట్టుబెట్టకుండా వెనుకడుగు వేయబోమని పెంటగాన్ నుంచి హెచ్చరిక వెళ్లింది. ఇప్పుడా రెండు దేశాలమధ్య తీవ్రస్థాయి ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఈ విషయమై మదురో టెలివిజన్‌లో ప్రసంగిస్తూ అగ్రరాజ్యాం సృష్టించే యుద్ధాన్ని తాను నివారించగలనని బీరాలు పలికాడు. తమ దేశంలో నిజంగానే మాదకద్రవ్య స్మగ్లర్లు ఉంటే వారిని నిర్మూలించేందుకు ప్రయత్నించాలే తప్ప అమెరికాతో తలపడడం దుస్సాహసమే అవుతుంది. దీనికితోడు తాను వెనిజులాపై యుద్ధ ప్రకటన చేయడానికి అమెరికన్ కాంగ్రెస్ అనుమతి అవసరం లేదంటూ ట్రంప్ స్వయంగా చేసిన ప్రకటనను బట్టి అమెరికాను ఎట్టి పరిస్థితుల్లోనూ వెనిజులాపై సమరం తప్పదని అర్థమైపోయింది. ఈ పరిస్థితిలో మరో యుద్ధమో, శాంతిఒప్పందమో ఈ ప్రపంచం ఎదురుచూడనున్నది. లాటిన్ అమెరికాలో 'నార్కో టెర్రరిస్టులపై పోరు పేరుతో ఈ యేడాది మొదట్లోనే ఈ సైనిక ఆపరేషన్‌ను ప్రారంభించారు. అప్పట్నించి వెనిజులాను లక్ష్యంచేసుకుని కరేబియన్ ప్రాంతంలో ఒకవిమాన వాహన నౌక, ఎనిమిది యుద్ధనౌకలు, పలు ఎఫ్ 35 స్టెల్ ఫైటర్ జెట్‌లను మోహరించారు. తాజాగా వెనిజులా తీరానికి సమీపంలో ఉన్న ట్రైనిడాడ్, టొబాగోతో కలిసి అమెరికా విస్తృత నౌకాదళ విన్యాసాలు నిర్వహిస్తోంది. అంతేకాదు చిన్న పామునైనా పెద్దకర్రతో ఎదుర్కోవాలన్న ధోరణిలో అమెరికా ఈ ఆదివారంనుంచి 30వ తేదీ వరకు యుఎస్ఎస్ గ్రేవ్లీ ఆన్ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో నిలిపి ఉంచి అమెరికా మెరైన్ల చేత ఆప్రాంత దళాలకు శిక్షణనివ్వనుంది. సైనిక బలగాల రీత్యా వెనిజులా అంత బలమైనది కాదు. ఆ దేశమే సామాజిక ఆర్థిక పతనం అంచున విలవిల్లాడుతోం ది. అక్కడి నుంచి గత కొన్నేళ్లుగా 7.3 మిలియన్‌లకు పైగా ప్రజలు సామూహిక వలసలు వెళ్లిపోయారు. అదే దేశంలో జీవన ప్రమాణాల పతనం కూడా జరిగిందన్న ఆరోపణలున్నాయి. అధిక ద్రవ్యోల్బణ రేటుతో బలహీనపడింది. వ్యవస్థీకృత నేరాలకు వెనిజులా పెట్టింది పేరు. ఆ దేశాన్ని సరైనదారిలో ఆదేశ పాలకులు నడిపించలేకపోతున్నారన్నది అక్షర సత్యం. ఈ నేపథ్యంలో యు.ఎస్ ఈ దేశం మీదెన్నో ఆంక్షలు పెట్టింది. కానీ అమెరికాతో వెనిజులా కలిసి రాలేదు. మాదకద్రవ్య స్మగ్లర్లను ఏరివేస్తే వెనిజులకు అమెరికా నుంచి అవసరమైన ఆర్థిక భరోసా లభించి ఉండేదికానీ అధ్యక్షుడు మదురో ఆ దిశగా ఆలోచించడంలేదు. వెనిజులా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలున్న దేశం. గతంలో అమెరికా కూడా ఈ చమురుపైనే ఆధారపడి ఉండేది. కానీ ఇప్పుడు కాదు హ్యూగో ఛావెజ్ అధ్యక్షునిగా ఉన్నప్పటినుంచే అమెరికాకు వెనిజులాకు పొత్తు పొసగలేదు. వెనిజులా సోషలిస్టు దేశంగా పేరుబడింది. అమెరికా పెట్టుబడిదారీ దేశం. అంతేకాదు మదురో ప్రభుత్వాన్ని అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘనలపై అమెరికా విమర్శించడంలో వారి మధ్య దూరం మరింతగా పెరిగింది. అలావారివి కలవని దారులయ్యాయి. దీనికితోడు ఈ మధ్య జరిగిన పరిణామాల్లో వెనిజులా అధ్యక్షుడు తనకు వ్యతిరేకంగా ప్రజల్లోంచి ఉద్యమాన్ని తెచ్చిన విపక్షనేత మరియా కోరినా మచాడోకి నోబెల్ బహుమతి ఇవ్వడం కూడా మదురోకి రుచించలేదు. ఆమెను ఆ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అవతరించిన ఉద్యమకారిణిగానే భావిస్తారు. దాదాపు ఆమె అజ్ఞాతంలో ఉంది. అయితే 'నోబెల్' కోసం పోటీపడిన డొనాల్డ్‌ట్రంప్ చివరకు తనమద్దతుదారుకే ఆ ప్రైజ్ దక్కిందని సరిపెట్టుకున్నారు. కాగా మదురో మాత్రం వెనిజులా సరిహద్దుల్ని మూసివేసి పొరుగు దేశాలను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. ఇదంతా మరియా కొరినా మచాడోకి 'నోబెల్'ప్రకటించినందుకే నైజీరియాకు అన్నిరకాలసౌహార్ద్ర సంబంధాలను ఆపేశారు. తన పాలనలో పూర్తిస్థాయి అణచివేతకే మదురో పాల్పడ్డారు. పైగా పెంటగాన్‌కి ఎదురు తిరిగిన కారణంగానే యుద్ధ వాతా వరణం నెలకొంది. అమెరికా మీద తలపడగలమన్న అహంకారంతో మదురో ప్రవర్తించడం వెనిజులా దేశానికి ఏమాత్రం మంచిదికాదు. ఇలా రాగద్వేషాల మధ్య తన సొంత దేశ ప్రజల సంరక్షణను సౌభాగ్యాన్ని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నందున అమెరికా కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తిలేదు. మరో యుద్ధాన్ని చూస్తామేమో!

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు. ఎమర్సన్

సంకల్ప బలం ఉన్నవారు అన్నిటినీ తనకు అనుకూలంగా మలచుకోగలరు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



### తెలుగుభాష కోసం కృషి చేయాలి

**తెలుగుభాష** మన సంస్కృతికి, మన అస్తిత్వానికి మూలాధారం. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్"గా ప్రసిద్ధి చెందిన ఈ మధుర భాష ద్రావిడ భాషలలో ప్రాచీనమైనది, సాహిత్య సంపదలో సమృద్ధమైనది. అయితే నేటి వేగవంతమైన కాలంలో తెలుగు భాష తన ప్రాధాన్యతను కోల్పోతూ ఉంది. ఇది కేవలం ఒక భాష క్షీణత మాత్రమే కాదు మనసాంస్కృతికవారసత్వానికి ప్రమాదసూచకం. తెలుగు ప్రాధాన్యత తగ్గడానికి ప్రధాన కారణం విద్యారంగంలో ఆంగ్ల మాధ్యమం ఆధిపత్యం. పిల్లలకు ఆంగ్ల మాధ్యమ విద్యనే విజయానికి మార్గమని భావించడం వల్ల తెలుగు మాధ్యమం వెనుకబడింది. తెలుగు పునరుజ్జీవనానికి ప్రజలు, ప్రభుత్వం, విద్యాసంస్థలు కలిసి కృషి చేయాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్డు ప్రమాదాలను నివారించాలి

**తెలుగు**రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయాణికుల రక్షణకై చొరవ తీసుకుని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను నిరంతరము పర్యవేక్షిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాహనాలపై చర్యలు తీసుకుని ఫిట్నెస్ లేని వాహనాలు రోడ్లపైకి రాకుండా చూడాలి. హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తుండగా జరిగిన బస్సు ప్రమాదం మన అందరిని కలిచివేసింది. ప్రభుత్వాలు మరోసారి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపటాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### ఇంటర్ స్థాయిలో అంతర్గత మార్కుల విధానం

**ఇంటర్మీడియట్** స్థాయిలో అన్ని విషయాలకు అంతర్గత మార్కులు ప్రవేశపెట్టే నిర్ణయం విద్యా వ్యవస్థలోఒక ప్రగతిశీలమైన సంస్కరణగా పరిగణించవచ్చు. ఇప్పటి వరకు విద్యార్థుల ప్రతిభను పూర్తిగా తుది పరీక్షల ఆధారంగా మాత్రమే అంచనా వేసే పద్ధతి ఉండేది. ఫలితంగా విద్యార్థులు మార్కులకోసం చివరి క్షణంలో మెకానికల్‌గా చదివే అలవాటు పెంచుకున్నారు. కొత్తవిధానం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, ప్రాజెక్ట్‌లు, అసైన్‌మెంట్‌లు, తరగతిప్రవర్తన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని నిరంతర మూల్యాంకనం చేసే అవకాశం లభిస్తుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### దేశానికి యువ నాయకత్వం అవసరం

**డెబ్బైఐదేళ్లు** నిండిన వెంటనే పదవుల నుంచి తప్పుకోవటం బిజెపి అమలు చేస్తున్న నియమం. ఈ నియమాన్ని పాటించి గతంలో కొంత మంది సీనియర్ మంత్రులు పదవుల నుంచి తప్పుకున్నారు. తప్పుకోవటం ఇష్టం లేనివారిని బలవంతంగా తప్పించారు. ఈ విధంగా డెబ్బైఐదేళ్ల యవసు కారణం చూపి ఎంతో మందిని ఇంటికి పరిమితం చేసారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల విషయంలో ఖచ్చితంగా నిక్కచ్చిగా నియమాన్ని పాటించిన వారు మోడీ విషయం వచ్చేసరికి తమకు అలాంటి నియమం ఏదీ లేదని అంటున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

### ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

**అమెరికాలోనున్న** 50 రాష్ట్రాలలో అక్కడి ప్రజలు లక్షల సంఖ్యలో వీధులలోకి వచ్చి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను విమర్శిస్తూ తమ నిరసనను తెలియజేయడం బహుశ అమెరికా చరిత్రలో ఇంతకు ముందెప్పుడు జరిగి ఉండదేమో. దాదాపు ఏడెనిమిది యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పానని తనకు తానే ప్రశంసలు చేసుకుంటున్న ఆ పెద్దమనిషి తన దేశంలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న అలజడులను నివారించకలేకపోవడం ఆశ్చర్యకరం. ఇజ్రాయెల్ గాజా, ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. రష్యా నుండి భారత్‌కు వచ్చే చమురు దిగుమతులను ఆపేశానన్నాడు. దీనిని భారత్ ధృవీకరించలేదు. ఇదొక అబద్ధం. ఇలా రాసుకుంటూపోతే చాలా ఉన్నాయి.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### ట్రావెల్స్ వేగానికి కళ్లెం వేయాలి

**కర్నూల్** జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన చాలా బాధాకరమైనది. 19మంది ప్రయాణికులు అన్యాయంగా ప్రాణాలను కోల్పోయారు. దారుణమైన ఈ సంఘటన అందరిని ఆవేదనకు గురిచేసింది. మన కుటుంబ సభ్యులకు జరిగినంతగా మనసు కృంగిపోతోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సి నబాధ్యత ప్రభుత్వంపై, ప్రజలపైన ఉంది. రాత్రి సమయాల్లో తిరిగే బస్సుల స్పీడ్ ఎక్కువగా అడ్డూ అదుపులేకుండా ఉంటోంది. అంతేకాకుండా బస్సులమధ్య పోటీ వేగంవిషయంలో ఉంటుండడంమరింత ఆందోళనకరం. ప్రైవేట్ ట్రావెల్స్ వేగ నియంత్రణ చేయాల్సి న అవసరం ఉంది.

-డా. తుమ్మలూరు సురేశ్ బాబు, కడప

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ విదేశాంగ విధానంలో స్పష్టత రావాలి!

**భారత్ తన ప్రాభవాన్ని నిలుపుకోటానికి నైతికంగా విధానపరంగా ముందుండటానికి గల పరిస్థితులు అర్థమయ్యేలా స్పష్టం చేసినప్పుడే భారత విదేశాంగ విధానానికి ఒక అర్థమూ, ప్రయోజనమూ ఉంటుంది. రష్యా చమురు దిగుమతులను కప్పిపెట్టలేం. అదే విధంగా అంతర్జాతీయ విధానాలలో అవలంబిస్తున్న వైఖరిని దాచుకోలేం. ప్రతి సమస్యలనూ హేతుబద్ధతతో విడదీసి తగ్గ రీతిలో భారత్ స్పందన ఉంటుందని తేటతెల్లం చేయాలి. స్పష్టపర్చాలి. అప్పుడే భారత్ పోరాటం ఉగ్రవాదుల మీద, తాలిబన్లను నైతిక విలువలకు కట్టుబడి ఉండే విధంగా మనప్రోత్సాహం మన పాత స్నేహ దేశం రష్యాను వదులుకోలేం అని, చైనా దగ్గరి తనాన్ని సమయానుకూలంగా గుర్తించగలమని అంతర్జాతీయ వ్యవహారాల్లో మన శైలి మనకే సొంతమని గ్లోబల్ వ్యవస్థ గుర్తిస్తుంది. అగ్రరాజ్యాల సరసన నిలబెడ్తుంది.**



రావులపాటి సీతారాంరావు

ప్రసిడెంట్ ట్రంప్ వేస్తున్న రాజకీయ పిల్లి మొగ్గలను బాహాటంగా ప్రపంచ నాయకులు ఎత్తి చూపాలని చాలా మంది పేరు గాంచిన జర్నలిస్టులు, ఎనలిస్టులు భావిస్తున్నారు. సహజంగానే వారు సెన్సేనల్ విషయాలను ఎత్తిచూపుతారు. అయితే ఒక ప్రపంచ నాయకుడు చరిత్రలో ఇంత వరకూ ముఖ్యమైన రాజకీయ, దౌత్య ప్రకటనలను మార్చి మార్చి చెప్పలేదనేదే వారు సంఘటితంగా చెబుతున్న మాట. భారత్‌కు సంబంధించినంత వరకు విదేశాంగ విధానం, చమురు దిగుమతల విషయంలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా భారత్ ఇక రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకోదని ప్రకటించిన విషయం నమ్మాల్నో, వద్దో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం నిర్దిష్టంగా అవునని, కాదని ఏదీ అనకపోవడంతో సందిగ్ధత నెలకొన్నది. పైగా ట్రంప్ మొహమాటం లేకుండా ప్రధాని మోడీ 'రష్యా నుంచి మేము ఆయిల్ కొనమనిహామీ ఇచ్చారని' చెప్పినా స్పష్టమైన ఖండనలేదు. ట్రంప్ అంతటితో ఊరుకోకుండా ఇక చైనా కూడా రష్యా నుంచి కొనకుండా ఒప్పుకొనే కార్యక్రమం చేయాలని అని అది కూడా తన భుజాలపై వేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ తనే ఆపు చేసానని, కాల్పుల విరమణ తన ప్రభుత్వం గంటల తరబడి అర్ధరాత్రి చర్చలు చేయటం వల్లనే అని కూడాఅన్నారు. ఈ విషయాన్ని మాత్రం మన విదేశాంగ శాఖ దాదాపు ఖండించినంత పని చేసి ప్రపంచానికి ట్రంప్ వాస్తవాలు చెప్పటం లేదన్న సంకేతం ఇవ్వగలిగింది. అయితే రష్యా దగ్గర భారత చమురు కొనటం కానీ కొనకపోవటం కానీ స్పష్టపర్చకపోవడం వల్ల అనేక సందేహాలకు దారితీస్తున్నది. ఆపరేషన్ సిందూర్ తర్వాత 'సీజ్‌ఫైర్' విషయంలో కానీ రష్యా నుంచి చమురు దిగుమతి విషయంలో కానీ ట్రంప్ చేసిన ప్రకటనలను నిర్ద్వంద్వంగా త్రోసి పుచ్చకపోవడంతో భారత్ ఇరుకున పడ్డట్లు అయింది. భారత్ విదేశాంగ విధానం సున్నిత దశలో ఉంది. ట్రేడ్ అగ్రిమెంట్ల విషయంలో అమెరికాతో ఒప్పందం కుదురుతుందన్న ఆశలో అమెరికాను బాహాటంగా ఖండించలేని పరిస్థితి. ఆసియా ఖండంలో చైనాతో సంబంధాలు మెరుగుపడుతున్న దశలో అమెరికాకు దగ్గరగా ఉన్నట్లు ఇచ్చే ఏ సంకేతం ప్రస్తుత పరిస్థితులలో మేలు చేకూర్చదు. భారత ద్వైదీ భావంలో ఉన్నట్లు ప్రపంచ దేశాల్లో అనుమానం బలపడకముందే దౌత్యపరంగా భారత్‌ను సరిగ్గా అర్థం చేసుకొనే పరిస్థితిని, దానికి తగ్గట్లు బలమైన చర్యలు తీసుకోక తప్పదు. ఇటువంటి పరిస్థితులలోనే విదేశాంగ నిపుణులు సమయోచితమైన సలహాలతో భారత్‌కు నష్టంకలగకుండా గట్టెక్కించాలి. ఆసియాలో బాలెన్సు ఆఫ్ పవర్‌ను కాదనలేని పరిస్థితిలో భారత్ ఉందని ప్రపంచ దేశాలకు స్పష్టపర్చక తప్పదు. ప్రతి దేశమూ ఇలాంటి పరిస్థితులు ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొన్న చరిత్ర ఉంది. ఎప్పటికేది అవసరమో అప్పుడు ఆ అవసరానికి అనుగుణంగా ఏ దేశమైనా స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించక తప్పదు. అది దేశానికి సంబంధించిన ధర్మం కూడా. భారత్ సున్నిత పరిస్థితిని అర్థం చేసుకొనేట్లు



విదేశాంగ శాఖ చర్యలు చేపట్టే మిత్ర దేశాలు భారత్ విధానాలను కాదనవు. అమెరికా, చైనాల విషయంలో భారత్ విధానాలకు అనుగుణంగా మిత్ర దేశాలను న్యూట్రలైజ్ చేయక తప్పదు. డొనాల్డ్ ట్రంప్ ఎంత కాదన్నా, తన దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నంలో ఇతర దేశాలకు తిక్క వ్యవహారం అనిపించినా, షాకింగ్ నిర్ణయాలతో దేశంలోని కొందరి గాఢాభిమానాన్ని పొందగల్గుతున్నారు. ఎవరైనా వారి దేశం బాగోగుల కోసం పాటుపడుతున్నప్పుడు ఆ నాయకుడిలోని ఇతర లోపాలను పెద్దగా తప్పుపట్టరు. అలజడులతో, ఘర్షణలతో సతమతమవుతున్న ఇజ్రాయెల్ పాలస్తీన్‌ల మధ్య గాజా ప్రాంతం నిప్పులకొలిమిగా మారింది. చర్చల పేరుతో ట్రంప్ ఆ కుంపటిని ఆర్పే ప్రయత్నం చేస్తున్న వైఖరికి, యు.యస్‌లో రిపబ్లిక్, డెమోక్రటిక్ సభ్యులతోసహా విమర్శించడానికి వెనుకాడక తప్పని పరిస్థితిని కలిగించడం ఇతర దేశాలు కూడా ఆసక్తిగా తిలకిస్తున్నాయి. భారత్ విదేశాంగ శాఖ ఇలాంటి ట్రంప్ తెగింపు చర్యలకు జవాబుగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవటం కష్టమే. భారతదేశంలో ట్రంప్ విధానాలూ, ప్రవర్తన నవ్వు కలిగిస్తున్నా, అంతటి శక్తివంతమైన దేశాధ్యక్షుడి చర్యలను తిప్పికొట్టలేని పరిస్థితి. రష్యా చమురు విధానాలను, భారత్ దిగుమతుల వ్యవహారాన్ని ఒక్కమాటతో పరిష్కరించేదిశగా, విదేశాంగ శాఖ కనుగొనటం కష్టమే. అదే విధంగా టారిఫ్ విషయాలల్లో రోజుకోమాటతో చైనాతో ఒక విధంగా, భారత్‌తో మరో విధంగా కావాలని వ్యవహరించటం కూడా ఇబ్బందికరంగానే మారింది. పైగా భారత్ చైనాతో స్నేహసంబంధాలను మెరుగుపర్చుకుంటున్న దశలో తొందరపడి చైనాను ఈ రకమైన ట్రంప్ విధానాన్ని తప్పుపట్టి, దూరం చేసుకోలేం. వెనుక గొయ్యి, ముందు నుయ్యి ఉన్న పరిస్థితిని ప్రధాని మోడీ గమనించి నిశ్శబ్ద నిర్ణయాలతో స్పష్టత ఇచ్చే ప్రయత్నం వైపు మొగ్గుచూపొచ్చు. ప్రపంచ దేశాలు, భారత్, పాకిస్థాన్ ఉగ్రవాదుల చర్యలను తిప్పికొట్టిన విధానాన్ని హర్షిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని గుర్తించి భారత్‌ను అగ్రదేశ స్థాయిలో ఉంచడానికి తలూపే పరిస్థితికి వస్తున్నాయి. ఇజ్రాయిల్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూనే ఇస్లామిక్ దేశాలను దూరం చేసుకోటానికి భారత్ సిద్ధంగా లేదు అన్న వ్యవహార శైలిని విదేశాంగ శాఖ ప్రదర్శిస్తున్నది. పాకిస్థాన్ వెనుక ఉండి, నిన్న మొన్నటి దాకా అన్నిరకాల సహాయ సహకారాలు అందించిన చైనా వైఖరిలో మార్పు, రష్యా, ఉక్రెయిన్ గొడవలను పక్కన పెట్టి భారత్‌కు దగ్గరగా వచ్చేందుకు ప్రదర్శిస్తున్న ఆసక్తి, భారత్‌ను ఇంత కష్టదశలోనూ ఒక మెట్టుపైకి ఎగబ్రాకేట్లు చేసింది. చైనా, రష్యా భారత్ కూటమి ప్రారంభ ఆరంభ దశలో ఉండటంతో అమెరికా వ్యవహారశైలిలో మార్పు తప్పని పరిస్థితి. భారత్ తన ప్రాభవాన్ని నిలుపుకోటానికి నైతికంగా విధానపరంగా ముందుండటానికి గల పరిస్థితులు అర్థమయ్యేలా స్పష్టం చేసినప్పుడే భారత విదేశాంగ విధానానికి ఒక అర్థమూ, ప్రయోజనమూ ఉంటుంది. రష్యా చమురు దిగుమతులను కప్పిపెట్టలేం. అదే విధంగా అంతర్జాతీయ విధానాలలో అవలంబిస్తున్న వైఖరిని దాచుకోలేం. ప్రతి సమస్యలనూ హేతుబద్ధతతో విడదీసి తగ్గ రీతిలో భారత్ స్పందన ఉంటుందని తేటతెల్లం చేయాలి. స్పష్టపర్చాలి. అప్పుడే భారత్ పోరాటం ఉగ్రవాదుల మీద, తాలిబన్లను నైతిక విలువలను కట్టుబడి ఉండే విధంగా మనప్రోత్సాహం మన పాత స్నేహదేశం రష్యాను వదులుకోలేం అని, చైనా దగ్గరి తనాన్ని సమయానుకూలంగా గుర్తించగలమని అంతర్జాతీయ వ్యవహారాల్లో మన శైలి మనకే సొంతమని గ్లోబల్ వ్యవస్థ గుర్తిస్తుంది. అగ్రరాజ్యాల సరసన నిలబెడ్తుంది. ●

# కాంట్రాక్టు కార్మికులను పట్టించుకునేదెవరు?

ఆళవందార్ వేణు మాధవ్

ఒక డేటా ప్రకారం 2023-24లో భారతదేశ వ్యవస్థీకృత తయారీ రంగంలోని మొత్తం ఉద్యోగులలో కాంట్రాక్ట్ కార్మికులు 42శాతం ఉన్నారు. 1999-2000లో, వ్యవస్థీకృత తయారీ రంగంలో మొత్తం ఉపాధిలో కాంట్రాక్ట్ కార్మికులు 20శాతం కంటే కొంచెం ఎక్కువగా ఉండేవారు. కాంట్రాక్ట్ లేబర్ అంటే ఉద్యోగ భద్రత లేకుండా కాంట్రాక్టర్ ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన కార్మికులను నియమించుకోవడమే. ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో కాంట్రాక్ట్ కార్మికుల వినియోగం పెరిగింది. వాహనాల ఉత్పత్తి, నిర్మాణం, మైనింగ్, టెలికమ్యూనికేషన్స్, ఇంధనం, విద్యుత్, నీటి సరఫరా, రిటైల్ సేవలు, ఐ.టి, బిపిఓలు, ఆరోగ్య సేవలు, విద్య మొదలైన సేవలలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరుగుతోంది. అనేక బహుళజాతి కంపెనీలలో 50 శాతం కంటే ఎక్కువ మంది కార్మికులు కాంట్రాక్టుపై పని చేస్తున్నారు. వారు వివిధ కాంట్రాక్టర్ ఏజెన్సీల ద్వారా నియమించబడ్డారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా లేదా ఫిక్సెడ్ టర్మ్ ఒప్పందాలపై కాంట్రాక్టుపై కార్మికులను నియమించబడతారు. కాంట్రాక్ట్ కార్మికుల వినియోగాన్ని నియంత్రించే లక్ష్యంతో కాంట్రాక్ట్ లేబర్ (నియంత్రణ, రద్దు) చట్టం 1970 ఆమోదించబడింది. కోర్ కార్యకలాపాలలో భాగం కాని పనికి, శాశ్వత స్వభావం లేని పనికి మాత్రమే ఉంటుందని చట్టం స్పష్టంగా పేర్కొంది. అయితే, వాస్తవికత ఏమిటంటే ఈ చట్టం బహిరంగంగా ఉల్లంఘించబడుతుంది. కాంట్రాక్ట్ కార్మికులను కోర్ కార్యకలాపాలలో శాశ్వత పనికోసం నియమి



స్తారు. ఐటీ రంగంలో ఉద్యోగులను ప్రాజెక్ట్ మేనేజర్లుగా ప్రకటించడం ద్వారా వారికి కార్మికులుగా వారి హక్కులను నిరాకరిస్తున్నారు. 2010 నుండి, కేంద్రం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగవ తరగతి ఉద్యోగాలకు సంబంధించిన అన్ని నియామకాలను నిలిపివేసాయి. సాంప్రదాయకంగా నాలుగవ తరగతి ఉద్యోగులు చేసే హౌస్ కీపింగ్, నిర్వహణ, శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్ట్ కార్మికులను నియమించడం ద్వారా నిర్వహిస్తున్నారు. ఆరోగ్య, పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్వాడీ, మిడ్‌డే మీల్ కార్మికులు వంటి అనేక ప్రభుత్వ పథకాలలో పనిచేసే కార్మికులు, జాతీయ గ్రామీణ ఆరోగ్యమిషన్ కార్మికులు, విద్యా సంస్థలలో శాశ్వత పనులు చేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఈ కార్మికులందరూ రెగ్యులర్ ఉద్యోగులుగా లభించే అన్ని హక్కులు కోల్పోతున్నారు. కాంట్రాక్ట్ కార్మి కులకు శాశ్వత కార్మికులకంటే తక్కువ వేతనం లభిస్తుంది. వారికి ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, సెలవు బోనస్ అందవు. ప్రమాదంలో మరణిస్తే, మరణించిన కార్మికుడి కుటుంబానికి ఎటువంటి పరిహారం లభించదు. కార్మికుడు అదేపని చేయలేని విధంగా గాయాలు అయితే, కార్మికులకు ఎటువంటి పరిహారం లేదా ప్రత్యామ్నాయ జీవనోపాధి లభించదు. కాంట్రాక్టర్లు నియమించినకార్మికులను తరచుగా అధికారికంగా నమోదు చేయరు, లేదా ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ఎలాంటి పే స్లిప్ ఇవ్వరు. కాబట్టి ప్రమాదం జరిగిన సమయంలో తాను కాంట్రాక్టర్ చేత నియమించబడ్డానని నిరూపించుకోవడం కార్మికుడికి చాలా కష్టంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పెద్ద పరిశ్రమలు, గనులు, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, బహుళజాతి కంపెనీలు వాటిలో గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులను ఉపయోగిస్తున్నారు. ●

# లాభాల వేటలో భద్రత మరచిన ప్రైవేటు ట్రావెల్స్!



మన్నారం నాగరాజు

ఈ రోజుల్లో రవాణా రంగం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రజల ప్రయాణ అవసరాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ప్రైవేట్‌ట్రావెల్స్ బస్సులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. ఆకర్షణీయమైన డిజైన్లు, లగ్జరీ సౌకర్యాలు, తళతళలాడే లైటింగ్‌తో ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చిన ఈ బస్సులు ప్రజలకు నచ్చుతున్నాయి. కానీ ఈ మెరుపుల వెనుక దాగి ఉన్నప్రమాదం మాత్రం భయంకరంగా మారింది. ప్రైవేట్ బస్సు నిర్వాహకులు ఆదాయంపైనే దృష్టిపెట్టి ప్రయాణికుల భద్రతను పక్కనబెట్టారు. ఈ నిర్లక్ష్యం కారణంగా అనేక విలువైన ప్రాణాలు కోల్పోయే ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రైవేట్ బస్సుల నిర్వాహకుల ప్రధాన ఉద్దేశ్యం లాభం సంపాదించడమే. బస్సులు నిండుగా నడవడం, రన్నింగ్ ఖర్చులు తగ్గించడం, ఫిట్‌నెస్ పరీక్షలు మినహాయించడం వంటి మార్గాల ద్వారా ఆదాయం పెంచుకోవడమే వారిప్రాధాన్యతగా మారింది. ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేయాల్సిన ఎమర్జెన్సీ సిస్టమ్‌లు, ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు లాంటి అంశాలపై ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ అవి కేవలం పుస్తకాల్లోనే మిగిలిపోతున్నాయి. అధికారులు కూడా ప్రమాదం జరిగినప్పుడే మెలుకువ చెంది హడావిడి చర్యలు తీసుకుంటున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో సాంకేతిక సదుపాయాలు చాలా తక్కువ. ఎమర్జెన్సీ అలారం వ్యవస్థలు లేకపోవడం, మంటలు చెలరేగినప్పుడు ఆర్పే పరికరాలు పనిచేయకపోవడం, బయటపడే తలుపులు జామ్ అవ్వడం వంటి సమస్యలు తరచుగా కనిపిస్తున్నాయి. అధికారుల నివేదికల ప్రకారం, ఎక్కువ శాతం బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు సరిగా ఉండవు. బస్సు మొత్తాన్ని అద్దాలతో మూసేస్తారు. ఒకసారి మంటలుచెలరేగితే ప్రయాణికులు బయటపడే అవకాశం ఉండదు. ఫైర్ రిటార్డెంట్ మెటీరియల్ బదులు సాధారణ ప్లాస్టిక్, ఫోమ్ వాడడం వల్ల మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. బస్సులో ప్రయాణికుల భద్రత కోసం అలార్మ్ వ్యవస్థలు, ఎమర్జెన్సీ బటన్‌లు, సెన్సార్‌లు ఉండాలి. కానీ చాలా బస్సుల్లో ఇవి లేవు. ఫలితంగా ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్ లేదా క్లీనర్ మినహా ఎవరూ పరిస్థితిని తెలుసుకోలేరు. ప్రతిబస్సులో ఫస్ట్‌ఇయిడ్ బాక్స్ ఉండడం చట్టపరమైన నిబంధన. కానీ ఆచరణలో మాత్రం చాలా బస్సుల్లో అది లభించదు. కొన్ని బస్సుల్లో ఉన్నా, వాటిలో అవసరమైన మందులు లేకపోవడం సాధారణమే. దీనివల్ల చిన్న ప్రమాదాలకైనా తక్షణచికిత్స లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటి డ్రైవర్ నిర్లక్ష్యం. ఎక్కువ దూరం నిరంతర డ్రైవింగ్ చేయడం, నిద్రలేమితో రాత్రి డ్రైవ్ చేయడం, సమయానికి చేరు



కోవాలనే ఒత్తిడి ఇవన్నీ ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్‌లో డ్రైవర్ ట్రైనింగ్ వ్యవస్థ సరిగా ఉండకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి ఆరోపణలు కూడా వస్తున్నాయి. బస్సుల వేగం 100-120 కిమీ వరకు పెరగడం వల్ల ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం ఎక్కువగానే జరుగుతోంది. ఇటీవలి కాలంలో స్లీపర్ బస్సులే ఎక్కువగా ఉన్నాయి. కానీ వీటి నిర్మాణంలోనే అనేక లోపాలు ఉన్నాయి. బస్సులో సన్నని గ్యాలరీలు, కర్టెన్లతో మూసిన కిటికీలు, ఒక్క తలుపు మాత్రమే ఉండడం వంటి సమస్యలు ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం పెంచుతున్నాయి. ఒకవేళ బస్సు ఒరిగిపోతే లేదా మంటలు చెలరేగితే ప్రయాణికులు బయటపడే అవకాశం చాలా తక్కువ. బస్సు ఎత్తు ఎక్కువగా ఉండడం వల్ల రెస్క్యూ ఆపరేషన్లు కూడా కష్టతరం అవుతున్నాయి. సాధారణంగా ఒక్కో స్లీపర్ బస్సులో 36 నుండి 40 బెర్తులు ఉంటాయి. వీటిని కలుపుతూ ఉన్న గ్యాలరీలు చాలా సన్నగా ఉండడంవల్ల ప్రయాణికులు సులభంగా కదలలేరు. ఈ కారణంగా ప్రమాదం సమయంలో గ్యాలరీలు అడ్డుపడుతాయి. ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ బస్సులపై నియమితంగా తనిఖీలు చేయాల్సి ఉన్నా, వారు చాలా అరుదుగామాత్రమే చర్యలుతీసుకుంటున్నారు. పండుగల సీజన్‌లో మాత్రమే ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించడం సరిపోదు. సాధారణ రోజుల్లో తనిఖీలు జరగకపోవడంతో నిర్వాహకుల నిర్లక్ష్యం బయటపడదు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌లు లేకపోయినా బస్సులు నడుస్తున్నాయి. బ్రేక్ సిస్టమ్, టైర్లు, ఇంజిన్ స్థితి వంటి అంశాలను క్రమం తప్పకుండా పరీక్షించకపోవడం మరో ప్రధాన లోపం. ఒక్కో బస్సులో గరిష్ఠంగా 45-50 మందిని మాత్రమే అనుమతిస్తారు. కానీ కొంత మంది నిర్వాహకులు 60 మందికి పైగా ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. దీంతో బస్సు బరువు పెరిగి నియంత్రణ తప్పే ప్రమాదం ఉంటుంది. ఇంకా బస్సు తలకిందులు కావడం, ఇంధన ట్యాంక్ నుంచి లీకేజీ జరిగి మంటలు చెలరేగడం వంటి ప్రమాదాలు కూడా జరగొచ్చు. 2013లో మహబూబ్‌నగర్ జిల్లా పాలెం వద్ద జరిగిన ఒక ట్రావెల్స్ బస్సు ప్రమాదం దేశాన్ని కుదిపేసింది. ఆ ప్రమాదంలో 45మంది ప్రయాణికులు దగ్ధమయ్యారు. తాజాగా కర్నూలు వద్ద వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో 20 మంది ప్రాణాలు కోల్పోవడం ప్రజల ఆవేదనను మరలా తాకింది. ఇరువురి ఘటనల్లోనూ మంటలు చెలరేగి బయటపడేమార్గం లేక ప్రయాణికులు సజీవదహనమయ్యారు. ఇదినిర్వాహకుల నిర్లక్ష్యానికి, అధికారుల వైఫల్యానికి నిదర్శనం. ప్రతి ప్రమాదం తర్వాతే అధికారులు మెలకువ చెంది హడావిడి చర్యలు తీసుకుంటారు. కొన్ని రోజులు మీడియా దృష్టిలో ఉండగానే మళ్లీ అన్నీమామూలుగా మారిపోతాయి. భద్రతా ప్రమాణాలు పాటించకపోతే లైసెన్స్ రద్దుచేయాలి. జరిమానాలు విధించాలి, బస్సుల సాంకేతిక సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలి. కానీ ఇవి ఆచరణలో కనిపించడం లేదు. భారతదేశంలో బస్సుల ఫిట్‌నెస్, ఫైర్‌సేఫ్టీ, డ్రైవర్ లైసెన్స్ వంటి అంశాలకు చట్టపరమైన నియమాలున్నప్పటికీ వాటి అమలు బలహీనంగా ఉంది. ప్రతి ప్రైవేట్ ట్రావెల్స్ వార్షిక సేఫ్టీ ఆడిట్ చేయించుకోవాలి. ప్రతిబస్సులో ట్రాకింగ్, ఫైర్ సెన్సార్‌లు, ఎమర్జెన్సీ బటన్‌లుండాలి. రవాణాశాఖ ప్రత్యేక సాంకేతిక బృందాలతో నెలకు కనీసం ఒకసారి తనిఖీలు చేయాలి. భద్రతా బాధ్యత పూర్తిగా నిర్వాహకులదేకాదు, ప్రయాణికులకూ కొంత బాధ్యతఉంది. బస్సులో ఎక్కడ ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉందో తెలుసుకోవాలి, సేఫ్టీ సూచ నలను గమనించాలి. తక్కువ ధరకు, అప్రూవల్ లేని బస్సు లను ఎంచుకోవడం ప్రమాదానికి దారితీస్తుంది. అందువల్ల ప్రయాణికులు కూడా భద్రతాపరమైన అవగాహనతో నిర్ణ యాలు తీసుకోవాలి. భద్రతా ప్రమాణాల లేమి వల్ల ప్రైవేట్ బస్సులు ప్రాణాల ముప్పుగా మారుతున్నాయి. లగ్జరీ పేరు తో రూపొందిన ఈ బస్సులు ఎన్ని మెరుపులు కలిగిఉన్నా, భద్రత లేకపోతే అవి మరణ వాహనాలుగా మారిపోతాయి. ●

# జిఎస్‌టి మార్పులతో అందరిలో సంతోషం

## అత్యంత క్రూరంగా నిజాం పాలన
## 127వ మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ
## ఎఐ సాయంతో 11భాషల్లో ప్రసంగం

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** దసరా, దీపావళి పండుగల వేళ జిఎస్‌టి శ్లాబుల తీసుకొచ్చిన మార్పులు అన్ని వర్గాల్లో తీసుకువచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. అలాగే ఈ సీజన్‌లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయన్నారు. వంట నూనె వినియోగాన్ని 10శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని ప్రధాని వెల్లడించారు. మన్‌కీ బాత్ 127వఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికి సేవలు అందిస్తోందని తెలిపారు. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి ఫుల్ మీల్స్ తినొచ్చు. మీరు కిలో వ్యర్థాలు ఇస్తే లంచ్ లేదా డిన్నర్ ఏర్పాటు చేస్తారు. అదే అరకిలో ఇస్తే అల్పాహారం ఇస్తారు. ఈ కేఫ్‌ను అంబికాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోందని ప్రధాని అభినందించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుపుకుంటున్న ఛాత్‌పూజ మహోత్సవం గురించి, మావోయిస్టుల గురించి కూడా ప్రధాని మోడీ మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్, నక్సలిజం నిర్మూలన కోసం తీసుకున్న చర్యల కారణంగా ఈ ఏడాది పండుగలు మరింత ఉత్సాహంగా మారాయని మోడీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రతి భారతీయుడిలో గర్వాన్ని నింపిందన్నారు. ఈసారి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు కనిపించాయని వివరించారు.

**31న రన్ ఫర్ యూనిటీలో పాల్గొనండి:** అదేవిధంగా, సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని ప్రధాని మోడీ గుర్తు చేసుకున్నారు. అక్టోబర్ 31న జరగనున్న "రన్ ఫర్ యూనిటీ (ఐక్యతా పరుగు) కార్యక్రమంలో ప్రతి పౌరుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సర్దార్ పటేల్ భారతదేశాన్ని ఏకం చేసిన నేతగా, పరిశుభ్రత, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచారని మోదీ అభివర్ణించారు. ప్రధానమంత్రి భారత జాతీయ గీతం వందేమాతరం" గురించి ప్రస్తావిస్తూ, 2025 నవంబర్ 7న ఈ గీతం 150వ వార్షికోత్సవం జరగనున్నదని తెలిపారు. ఈ అద్భుతమైన గీతాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీని ఆయన స్మరించారు. "వందేమాతరం మన దేశ ఆత్మను ప్రతిబింబించే గీతం, అది ప్రతి భారతీయుడిలో దేశభక్తి జ్వాలను రగిలిస్తుంది," అని మోడీ అన్నారు.

**11 భాషల్లో మోడీ ప్రసంగం:** ఈసారి మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ సందేశాన్ని ఎఐ టెక్నాలజీ సహాయంతో 11 భారతీయ భాషలలోకి అనువదించారు. అంటే మోడీ ప్రసంగం 11 భాషల్లో వినిపించింది అన్నమాట. ఈ భాషల్లో ప్రసంగం ఎఐ సహాయంతో మలయాళం, తెలుగు, కన్నడ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ, తమిళం, మరాఠీ, అస్సామీ, ఒరియాతో సహా మొత్తం 11 భాషలలో మోడీ ప్రసంగం ఒకేసారి వినిపించింది. దీని వలన దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు వారి మాతృభాషలో ప్రధాని సందేశాన్ని వినగలిగారు. పాఠ్యాంశాలను 11భాషల్లోకి అనువదించడానికి ఎఐని ఉపయోగించడాన్ని ప్రధాని ప్రశంసించారు. భవిష్యత్తులో ఎఐ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలలో ప్రపంచాన్ని నడిపించగల సామర్థ్యం ఆధునిక భారతదేశానికి ఉందని ఈ చర్య ద్వారా ప్రభుత్వం ప్రదర్శించింది.

### కుమురం భీం వీరత్వం తెలుసుకోండి

నిజాం పాలనపై తెలంగాణ పోరాట వీరుడు కుమురం భీం చేసిన పోరాటాన్ని ప్రధాని మోడీ కొనియాడారు. భారత్‌ను దోచుకోవడానికి బ్రిటిష్‌పాలకులు అన్ని దోపిడీ మార్గాలను వాడారు. ఆ సమయంలో దేశభక్తి గల హైదరాబాద్ ప్రజల ప్రతిస్పందన వీరోచితంగాఉంది. బ్రిటిష్ వారు నిజాం పాలనను బలపరిచారు. నిజాం పాలన అత్యంత క్రూరంగా ఉండేది. పేదలు, గిరిజనులపై నాడు జరిగిన వేధింపులు వర్ణనా తీతం. ప్రజల భూములను స్వాధీనం చేసుకున్నారు. భారీగా పన్నులు విధించారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తే వారి చేతులను నరికివేశారు. అలాంటి కష్టకాలంలో 20 ఏళ్ల కుర్రాడు ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. అతడి పేరు చెప్పబోయే ముందు, ఆ కుర్రాడి వీరత్వం గురించి తెలుసుకోండి. నిజాంపై ఒక్కమాట మాట్లాడటం కూడా నేరమే భావించేకాలంలో ఆ కుర్రాడు నిజాంఅధికారి సిద్ధిఖీని బహిరంగంగానే సవాల్ చేశాడు. అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో ఆ యువకుడు సిద్ధిఖీని మట్టుబెట్టాడు. అరెస్టును కూడా తప్పించుకున్నాడు. అక్కడినుంచి అతడు అసోంకు చేరుకున్నాడు. ఆయువ వీరుడి పేరు కుమురంభీం అని ప్రధాని మోడీ వివరించారు. కేవలం40యేళ్లే బతికినా, ప్రజలపై చెరగని ముద్ర వేశారనిచెప్పారు. నిజాంకు చాలా కాలంపాటు సవాలుగా నిలిచారని తెలిపారు. 1940లో నిజాం సైనికులు ఆయన్ను హత్య చేశారన్నారు. ఆయన గురించి తెలుసుకునేందుకు యువత వీలైనంత ప్రయత్నించాలని కోరుతున్నానని ప్రధాని మోడీ వెల్లడించారు. మరో ప్రముఖ గిరిజన నాయుకుడు భగవాన్ బిర్సా ముండా గురించి ప్రధాని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం, గిరిజన సమాజ హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం గురించి కొనియాడారు.





# చర్చలు కొలిక్కిరాకుంటే అఫ్ఘాన్‌తో యుద్ధమే

**కరాచి, అక్టోబరు 26:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు అత్యంత ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య రెండో విడత శాంతి చర్చలు శనివారం ఇస్తాంబుల్‌లో ప్రారంభమయ్యాయి. అయితే, ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే మరోవైపు పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చలు విఫలమైతే ఆఫ్ఘనిస్థాన్‌తో బహిరంగ యుద్ధానికి దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. టర్కీ, ఖతార్ దేశాల సంయుక్త మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. అక్టోబర్ 18,19 తేదీల్లో దోహాలో తొలి విడత చర్చలు జరిగాయి. తాజా చర్చల్లో ఆఫ్ఘనిస్థాన్ తరఫున ఉప అంతర్గత వ్యవహారాల మంత్రి రహమతుల్లా ముజీబ్, అనస్‌హక్కానీ పాల్గొంటుండగా, పాకిస్థాన్ నుంచి ఇద్దరు భద్రతాధికారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈచర్చల ఫలితం వెలువడే అవకాశంఉందని పాక్ రక్షణమంత్రి సియాల్‌కోట్‌లో తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన డైలీ టైమ్స్ కథనం ప్రకారం, చర్చలు విఫలమైతే ఆఫ్ఘనిస్థాన్‌తో బహిరంగ యుద్ధం తప్పదని, అయితే రెండు పక్షాలు శాంతినే కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ దేశంపై దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఉగ్రవాద సంస్థను తమ భూభాగం నుంచి పూర్తిగా ఏరివేయాలని ఆఫ్ఘనిస్థాన్‌కు పాకిస్థాన్ గట్టిగా తేల్చిచెబుతోంది. ఈ విషయంలో ఆఫ్ఘన్ నుంచి కచ్చితమైన, ధ్రువీకరించదగిన హామీని పాక్ కోరుతున్నట్లు అక్కడి ఖిడాన్‌ఖి పత్రిక పేర్కొంది. అలాగే, చర్చల పురోగతిని పర్యవేక్షించేందుకు టర్కీ, ఖతార్‌లతో కూడిన తృతీయ పక్ష పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఇస్లామాబాద్ ప్రతిపాదిస్తోంది. గత కొద్దివారా లుగా డ్యారాండ్ లైన్ వద్ద ఇరు దేశాల సైనికుల మధ్య పలుమార్లు ఘర్షణలు జరగడంతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగాయి. దీనికి తోడు, ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ ఇటీవల ఢిల్లీలో పర్యటించడం పాకిస్థాన్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ నేపథ్యంలోనే, కునార్ నదిపై వీలైనంత త్వరగా డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని తాలిబన్ సుప్రీంలీడర్ హిబతుల్లా అఖుంద్జాదా ఆదేశించడం ఇస్లామాబాద్‌కు కొత్త తలనొప్పిగా మారింది. పాకిస్థాన్‌లో చిత్రాల్‌నదిగా, ఆఫ్ఘనిస్తాన్‌లో కునార్‌నదిగా పిలిచే ఈనదిపై డ్యామ్‌లు నిర్మిస్తే నీటి ప్రవాహంపై ప్రభావం పడుతుందని పాకిస్థాన్ ఆందోళన చెందుతోంది.

## అమెరికా కొత్త యుద్ధాన్ని సృష్టిస్తోంది: వెనుజులా అధ్యక్షుడు మదురో



**కేరకాస్, అక్టోబరు 26:** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా విషయంలో వెనుజులాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో కరీబియన్ సముద్రజలాల్లో డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలు, జలాంతర్గాములపై అగ్రరాజ్యం దాడులు ముమ్మరం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద వాహకనౌక 'యుఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'ను వెనుజులా సమీపానికి తీసుకెళ్లడం ద్వారా ఆ దేశంపై ఒత్తిడి తీవ్రతరం చేసింది. ఈ పరిణామాలను వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురో తీవ్రంగా ఖండించారు. అమెరికా ప్రభుత్వం తనపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. 'ట్రంప్ యంత్రాంగం కొత్త,శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది. మాదకద్రవ్యాల విషయంలో అతిశయోక్తులతో కూడిన, అసభ్యకరమైన, నేరపూరితమైన, తప్పుడు కథనాలను అల్లుతోంది. మా దేశం కొకైన్ పత్రాలను ఉత్పత్తి చేయదు' అని మదురో జాతీయ మీడియాలో ప్రసంగించారు. వెనుజులాకు చెందిన వ్యవస్థీకృత నేరాల ముఠా 'ట్రెన్ ది అరాగ్వా'కు మదురో నాయకుడని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు.

# కరూర్ బాధిత కుటుంబాలను నేడు కలవనున్న విజయ్

**చెన్నై, అక్టోబరు 26:** ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగం పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన విషయం అందరికీ తెలిసిందే . ఈ ఘటనలో మొత్తంగా 41 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. విజయ్ బాధిత కుటుంబాలను కలిసేందుకు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. కానీ కేసులు, అనుమతి నిరాకరణ వల్ల జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలోనే మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి, పరామర్శించడానికి ఆయన ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఓ రిసార్ట్‌లో 50 గదులు బుక్ చేసి మరీ బాధిత కుటుంబాలక కోసం ప్రత్యేక బస్సులను పెట్టారు. వాటిల్లోనే వీరంతా రిసార్ట్ రానుండగా విజయ్ వారందరినీ పరామర్శించనున్నారు. విజయ్ సోమవారం చెన్నై శివార్లలోని ఒక రిసార్ట్‌లో బాధిత కుటుంబాలను కలవనున్నారు. ఈ సమావేశం కోసం టీవీకే పార్టీ ఏకంగా 50 గదులను బుక్ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏర్పాటు ద్వారా బాధిత కుటుంబాల ప్రతినిధులను ఒక్కొక్కరినీ విడివిడిగా కలిసి, వారి బాధను పంచుకుని, వ్యక్తిగతంగా సానుభూతి తెలియజేయాలని విజయ్ భావిస్తున్నారు. వాస్తవానికి ఆయన నేరుగా కరూర్ వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించాలనుకున్నారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా, అలాగే శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆయన పర్యటనకు అనుమతి నిరాకరించింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులందరినీ చెన్నైకి తీసుకు వచ్చి పరామర్శించేందుకు ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నట్లు పార్టీ స్పష్టం చేసింది. మేము సమావేశ స్థలానికి చేరుకోవడానికి టీవీకే పార్టీ వారు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. మా కుటుంబాల నుంచి చాలా మంది సభ్యులు ఈ పరామర్శ కార్యక్రమానికి వెళ్తున్నామని బాధిత కుటుంబానికి చెందిన ఒక సభ్యుడు తెలిపారు.

# సతారా డాక్టర్ కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ అరెస్ట్



**సతారా, అక్టోబరు 26:** మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మహిళా డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ గోపాల్ బదానేను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీడ్ జిల్లాకు చెందిన ఒక మహిళా డాక్టర్ సతారాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఫల్టాన్ పట్టణంలోని ఒక హోటల్ గదిలో ఆమె ఉరివేసుకుని విగతజీవిగా కనిపించారు. తన అరచేతిపై రాసుకున్న సూసైడ్ నోట్‌లో ఎస్ఐ గోపాల్ బదానే తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని, ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధించాడని ఆమె ఆరోపించారు. దీంతో పోలీసులు అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపణ కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మొదట ప్రశాంత్ బంకర్‌ను పుణెలో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత కొన్ని గంటలకే ఎస్సై బదానే ఫల్టాన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. బంకర్‌ను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం నాలుగు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. ఈ ఆరోపణల నేపథ్యంలో ఎస్సై బడానేను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రశాంత్ బంకర్, మృతురాలు నివాసం ఉంటున్న ఇంటి యజమాని కుమారుడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు. వేధింపుల గురించి ఆమె గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని బంధువులు ఆరోపించారు. పోస్ట్‌మార్టం డ్యూటీలో ఉన్నప్పుడు మెడికల్ రిపోర్టులు మార్చాలంటూ కొందరు రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చేవని కూడా వారు తెలిపారు. ఈ కేసు ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. గతంలో ఓ సందర్భంలో బీజేపీ మాజీ ఎంపీ రంజిత్‌సింగ్ నాయక్ నింబాల్కర్ ఆమెపై ఒత్తిడి తెచ్చారని శివసేన (యూబీటీ) నేత అంబదాస్ దన్వే ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను నింబాల్కర్ ఖండించారు. ఈ కేసులోకి కావాలనే తన పేరును లాగుతున్నారని ఆయన స్పష్టం చేశారు. మృతురాలు ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి, ఎండీ చేయాలని కలలు కన్నారని ఆమె బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంబీబీఎస్ కోసం తీసుకున్న రూ.3 లక్షల అప్పు కూడా ఇంకా తీర్చలేదని వారు తెలిపారు.

# పాక్‌పై ట్రంప్ మళ్లీ పొగడ్తలు


**కౌలాలంపూర్, అక్టోబరు 26:** ఆసియాన్ సదస్సు కోసం కౌలాలంపూర్ చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మలేసియాలో ఘనస్వాగతం లభించింది. స్వాగతం సందర్భంగా ట్రంప్ రెడ్ కార్పెట్‌పై అనూహ్యంగా డ్యాన్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ట్రంప్‌తోపాటు మలేసియా అధ్యక్షుడు అన్వర్ ఇబ్రహీం కాలు కదిపారు. ఆదివారం రోజు థాయ్‌లాండ్ – కాంబోడియా దేశాలు శాంతి ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, పాక్ ఆర్మీ చీఫ్, ప్రధానమంత్రిపై ప్రశంసల జల్లు కురిపించారు. అలాగే, గత 8 నెలల్లో తాను ఆపిన 8 యుద్ధాల్లో థాయ్‌లాండ్– కాంబోడియా యుద్ధం కూడా ఒకటని ట్రంప్ చెప్పారు. సగటున ప్రతినెలా ఒక యుద్ధాన్ని తాను ఆపానన్నారు. పాక్–అఫ్ఘానిస్థాన్ సైనిక ఘర్షణ ఒక్కటే మిగిలిందని, త్వరలోనే దాన్ని కూడా ఆపుతానని అమెరికా ప్రెసిడెంట్ స్పష్టం చేశారు. థాయ్‌లాండ్–కాంబోడియా యుద్ధాన్ని ఆపినందుకు గర్వంగా ఉందని, శాంతిఒప్పందంకుదిరినందున ఆ రెండుదేశాలు ఇకపై స్నేహపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు.

# మధ్యప్రదేశ్‌లో అక్రమ ఆయుధాల ఫ్యాక్టరీ



**భోపాల్, అక్టోబరు 26:** ఫామ్‌హౌస్‌లో గుట్టుగా ఆయుధాలు తయారు చేస్తున్నారు. గన్స్‌తో దొరికిన ఒక వ్యక్తి నుంచి సేకరించిన సమాచారంతో అక్రమ ఆయుధ ఫ్యాక్టరీపై రైడ్ చేశారు. పలు పిస్టల్స్‌తోపాటు తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 21న అమల్హరి గ్రామ కూడలి సమీపంలో ఒక వ్యక్తి అక్రమంగా పిస్టల్స్ అమ్మేందుకు వేచి ఉన్నట్లు బరోహి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్‌కు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని అతడ్ని అరెస్ట్ చేశారు. 32బోర్ పిస్టల్ ఒకటి, మూడు 315బోర్ పిస్టల్స్, మూడు లైవ్ కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆ వ్యక్తిని పోలీసులు ప్రశ్నించారు. దీంతో రూపవైలోని ఒక ఫామ్‌హౌస్‌ను నెలకు రూ.20,000 చొప్పున అద్దెకు తీసుకుని అక్రమంగా ఆయుధాలు తయారు చేస్తున్నట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో పోలీసులు రైడ్ చేశారు. 12 దేశీయ పిస్టల్స్, మూడు లైవ్ కార్ట్రిడ్జ్‌లు, ఆయుధ తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిపుణులైన సిబ్బందిని నియమించుకుని వారికి నెలకు రూ.50,000 చొప్పున చెల్లిస్తూ ఈ తుపాకీ ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఇది తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు. పిస్టల్స్‌ను అసెంబుల్ చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అయితే సెప్టెంబర్ 19 నుంచి ఈ ఫామ్‌హౌస్‌లో అక్రమంగా ఆయుధాలు తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు 22 పిస్టళ్లను తయారు చేశారు. ఇందులో ఏడు పిస్టల్స్‌ను అమ్మారు. వీటిని కొనుగోలు చేసిన ముగ్గురు వ్యక్తులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మరికొందరి సమాచారం సేకరించారు. ప్రధాన నిందితుడైన పేరుమోసిన నేరస్తుడు పరారీలో ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అతడ్ని పట్టుకోవడం కోసం రూ. 10,000 రివార్డు ప్రకటించారు.

## సంక్షిప్తంగా..



### అణుశక్తి క్షిపణిని పరీక్షించిన రష్యా

**మాస్కో, అక్టోబరు 26:** రష్యా అమ్ములపొదిలో సరికొత్త అస్త్రం వచ్చి చేరనుంది. అణుశక్తితో నడిచే 'బూరెవెస్ట్‌నిక్' క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు దేశాధినేత పుతిన్ ప్రకటించారు. అపరిమితమైన పరిధి కలిగిన ఈ క్షిపణి మోహరింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సాయుధ దళాలను ఆదేశించారు. రష్యా సైన్యం ఇటీవల 'అణు' విన్యాసాలు నిర్వహించింది. పుతిన్ వాటిని స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలోనే రష్యా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ఇతర సైనిక కమాండర్లతో ఆయన ఓ సమావేశంలో మాట్లాడారు. పరీక్షల సమయంలో 'బూరెవెస్ట్‌నిక్' క్రూయిజ్ క్షిపణి 15 గంటలపాటు గాల్లోనే ఉందని, 14 వేల కిలోమీటర్లు ప్రయాణించిందని తెలిపారు. అంతకుముందు సైనిక ఉన్నతాధికారులతో పుతిన్ భేటీ అయ్యారు. రష్యా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ వాలెరీ గెరాసిమోవ్ నేతృత్వంలోని కమాండర్లతో సంభాషించారు.

### పారిస్‌లో ప్రియురాలితో జస్టిన్ ట్రూడో



**ఒట్టావా, అక్టోబరు 26:** కెనడా మాజీప్రధాని జస్టిన్ ట్రూడో, అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో డేటింగ్ లో ఉన్నారంటూ వార్తలు వస్తున్నవేళ తాజా వారిద్దరూ కలిసి ఓపార్టీలో పాల్గొన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పారిస్‌లోని థియేటర్ నుంచి శనివారం రాత్రి ట్రూడో కేటీపెర్రీ చేతిలో చేయి వేసుకొని బయటకు వస్తున్న దృశ్యాలు కనిపించాయి. అక్కడ జరిగిన ఓ మ్యూజికల్ షోకు వీరు హాజరైనట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. కేటీ పెర్రీ 45వ పుట్టినరోజు సందర్భంగా వీరు అక్కడికి వెళ్లినట్లు సమాచారం. ఈ యేడాది జూలైలో ట్రూడో–పెర్రీలు మాంట్రియల్‌లోని ఓ రెస్టారెంట్‌లో తొలిసారి కనిపించారు. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం మొదలైంది. ట్రూడో–కేటీలు దీనిపై ఇప్పటివరకూ స్పందించలేదు. కొద్దిరోజుల క్రితం ఓఖరీదైన నౌకపై వీరు అత్యంత సన్నిహితంగా విహరించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


### బిష్ణోయ్ గ్యాంగ్ అనుచరుడిని భారత్‌కు రప్పించిన సిబిఐ

**న్యూఢిల్లీ,అక్టోబరు 26:** వ్యవస్థీకృత నేరాలపై భారత ఏజెన్సీలు ఉక్కుపాదం మోపాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న కీలక గ్యాంగ్‌స్టర్ లఖ్వీందర్ కుమార్‌ను అమెరికా నుంచి భారత్‌కు దర్యాప్తు అధికారులు రప్పించారు. ఢిల్లీ విమానాశ్రయంలో అడుగుపెట్టిన వెంటనే హర్యానా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. లఖ్వీందర్‌పై హర్యానాలో హత్యాయత్నం, బెదిరించి డబ్బులు వసూలు చేయడం, అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం వంటి పలు తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసుల నేపథ్యంలో అతడు విదేశాలకు పారిపోయాడు. దీంతో హర్యానా పోలీసులు చేసిన విజ్ఞప్తి మేరకు, సీబీఐ ఇంటర్‌పోల్ ద్వారా 2024 అక్టోబర్ 26న అతడిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. సీబీఐ, విదేశాంగ శాఖ, హోం మంత్రిత్వ శాఖల సమన్వయంతో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరిపి లఖ్వీందర్‌ను భారత్‌కు బహిష్కరించేలా చర్యలు తీసుకున్నాయి.



### అంకెల్లోనే బిలియనీర్.. క్షణకాలంలోనే మాయం

**భోపాల్, అక్టోబరు 26:** మధ్యప్రదేశ్‌కు చెందిన నోటరీ, ప్రైవేటు స్కూలు యజమాని వినోద్ డోంగ్లే తలరాత రాత్రికి రాత్రే మారిపోయింది. ఆయన డీమ్యాట్ ఖాతాలోని ఓ కంపెనీ షేర్ల విలువ రూ.2,817 కోట్లకు చేరినట్లు చూపించింది. అయితే, ఈ ఆనందం కాసేపటికే ఆవిరైపోయింది. అప్పటి వరకు ఒక్కో షేరు రూ.2.14 కోట్లు చొప్పున 1,312 షేర్ల విలువ రూ.2,817 కోట్లుగా చూపించగా కాసేపటికే ఆ అంకెలన్నీ మాయమై పాత విలువనే చూపించాయి. ఒక్కో షేరు 63 పైసల చొప్పున రూ.826.56 పైసలుగా చూపించింది. హర్సిల్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ షేర్ల విషయంలో వినోద్ డోంగ్లేకు ఈ విచిత్ర అనుభవం ఎదురైంది. కాసేపే అయినా అంకెల్లో తను బిలియనీర్‌ను అయ్యానని వినోద్ డోంగ్లే సంతోషం వ్యక్తం చేశారు.




### ఎప్పటికైనా అమెరికా అధ్యక్షురాలినవుతా: కమలా హ్యారిస్

**వాషింగ్టన్, అక్టోబరు 26:** అమెరికా అధ్యక్ష పదవిపై మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లేకపోలేదని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా అధ్యక్షురాలిగా ఒక మహిళ వైట్‌హౌస్‌లో ఉండడం ఖాయమని, బహుశా అది నేనే కావచ్చు అన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమలా హారిస్ మాట్లాడుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ట్రంప్ ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరిస్తారని హెచ్చరించానని, ఇప్పుడు అదినిరూపితమైందని ఆమె అన్నారు. నా మనవరాళ్లు వారి జీవితంలో ఖచ్చితంగా ఓ మహిళా అధ్యక్షురాలిని చూస్తారని ఆమె పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే విషయంపై ఇంకా నిర్ణయంతీసుకోలేదని, రాజకీయాల్లో భవిష్యత్తు ఉందని ఇప్పటికీ నమ్ముతున్నానని హారిస్ పేర్కొన్నారు.

## మణిపూర్‌లో విజృంభిస్తున్న డెంగ్యూ




**మణిపూర్, అక్టోబరు 26:** మణి పూర్‌లో డెంగ్యూ విజృంభిస్తున్నది. అక్టోబర్ 25నాటికి ఆ రాష్ట్రవ్యాప్తంగా 3,334 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 2,323 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇంఫాల్‌తూర్పులో మొత్తం 608 కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో గత 24 గంటల్లో 69 కొత్త కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ తెలిపింది. ఇంఫాల్ వెస్ట్‌లో కొత్తగా 38 కేసులు, ఇంఫాల్ తూర్పులో 21 కొత్త కేసులను గుర్తించినట్లు పేర్కొంది. కాగా, మణిపూర్‌లోని అన్ని జిల్లాల్లో డెంగ్యూ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్‌లో 96, తౌబాల్‌లో 74, సేనాపతిలో 61, కాక్చింగ్ జిల్లాలో 45 డెంగ్యూ కేసులు నమోదై నట్లు చెప్పారు. ఉఖ్రుల్,చందేల్, తమెంగ్‌లాంగ్, టెంగ్నౌపాల్, కామ్‌జోంగ్, నోనీ, కాంగ్‌పోక్‌పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో 50 కంటే తక్కువ కేసులు ఉన్నాయన్నారు. మరోవైపు జిరిబామ్, ఫెర్జావల్‌లో ఎలాంటి డెంగ్యూకేసులు నమోదు కాలేదని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లాలో డెంగ్యూవల్ల ఒకరు మరణించినట్లు వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు వివరించారు.



## ఐర్లాండ్‌ప్రధానిగా వామపక్ష స్వతంత్ర నేత కేథరీన్ కన్నోలి

**ఐర్లాండ్, అక్టోబరు 26:** ఐర్లాండ్ అధ్యక్ష ఎన్నికలలో వామపక్షవాద స్వతంత్రనేత కేథరీన్ కన్నోలి ఏకపక్షంగా ఘన విజయం సాధించారు. ఆమెకు సిన్ ఫెయిన్‌తోపాటు వామపక్ష పార్టీలన్నీ మద్దతిచ్చాయి. దాంతో ఆమె ప్రత్యర్థి, సెంటర్ రైట్ పార్టీ అయిన ఫైన్ గాయెల్ అభ్యర్థి హీథర్ హంఫ్రేస్ ఘోర పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికల్లో కేథరీన్‌కు మొదటి ప్రాధాన్య ఓట్లలోనే ఏకంగా 63 శాతం ఓట్లు దక్కాయి. హంఫ్రేస్ కేవలం 29 శాతం ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. కాగా బారిస్టరు అయిన కన్నోలి.. 2016 నుంచి చట్టసభ సభ్యురాలిగా ఉన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆమె బహిరంగంగా వ్యతిరేకించారు. ఇజ్రాయెల్‌ను టెర్రరిస్టు దేశంగా అభివర్ణించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధనేపథ్యంలో ఐరోపా కూటమి సైనికీకరణనూ తప్పుబట్టారు. ప్రస్తుతం ఐర్లాండ్ అధ్యక్షులుగా మైఖేల్ డి హిగ్గిన్స్ ఉన్నారు.

## యమునా మురికినీటితో సిఎం రేఖాగుప్తా నివాసానికి ఆప్ నేతలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది కాలుష్యంపై రాజకీయ వివాదం కొనసాగుతున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ యూనిట్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ యమునా నది నుంచి మురికి నీటిని ఒక బాటిల్‌లో సేకరించారు. ఆప్ నేతలతో కలిసి సీఎం రేఖ గుప్తా నివాసానికి చేరుకున్నారు. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ యమునా నదిని శుభ్రం చేసిందని భావిస్తే ఆ బాటిల్ లోని నీటిని సీఎం రేఖ గుప్తా తాగాలని సౌరభ్ భరద్వాజ్ సవాల్ చేశారు. ఛత్ పూజకు ముందు అబద్ధాలను బీజేపీ వ్యాప్తి చేస్తున్నదని ఆయన ఆరోపించారు. కాగా, బీజేపీ ప్రభుత్వం నెలల తరబడి శుద్ధి చేసిన తర్వాత యమునా నది నీరు ఆచారాలకు అనుకూలంగా ఉన్నదని ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి అనిల్ గుప్తా తెలిపారు. ఆచమనం చేసిన ఆయన ఆ నీటిని తాగారు. ఈ వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆప్ ఢిల్లీ యూనిట్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. 'బీజేపీ అబద్ధాల కారణంగా యమునా నదిని సీఎం శుభ్రం చేశారని లక్షలాది మంది పూర్వాంచల్ మహిళలు, చిన్న పిల్లలు భావిస్తారు. ఛత్ పూజ సందర్భంగా ఆ నీటిని తాగుతారు. ఆ తర్వాత ప్రాణాంతక అనారోగ్యానికి గురవుతారు' అని అన్నారు.



## తలసీమా రోగులకు హెచ్ఐవి పాజిటివ్!

**రాంచీ, అక్టోబరు 26:** జార్ఖండ్‌లోని చాయ్‌బసాలో దారుణం వెలుగు చూసింది. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులకు హెచ్ఐవీ పాజిటివ్ నిర్ధారణ కావడం కలకలం సృష్టిస్తోంది. స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో రక్తం ఎక్కించుకున్న తర్వాత తలసీమియా వ్యాధితో బాధపడుతున్న తమ ఏడేండ్ల కుమారుడికి హెచ్ఐవీ సోకిందని బాధిత కుటుంబం వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జార్ఖండ్ ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ నిమిత్తం ఉన్నతస్థాయి వైద్య బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ వైద్య బృందం విచారణ జరపగా, మరో నాలుగు కేసులు వెలుగులోకి వచ్చాయి. వైద్య బృందానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ దినేష్ కుమార్ సదర్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసీమియా రోగికి కలుషిత రక్తం ఎక్కించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ క్రమంలో బ్లడ్ బ్యాంకును పరిశీలించాం. బ్లడ్ బ్యాంకులో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించామని, దానిపై విచారణ చేస్తున్నామన్నారు. లోపాలను సరి చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించామని డాక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

# 31 కస్టమ్స్ సుంకాల నోటిఫికేషన్లు విలీనం

**న్యూఢిల్లీ, అక్టోబరు 26:** కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డ్ (సీబీఐసీ) 31కస్టమ్స్ డ్యూటీ నోటిఫికేషన్లను ఏకైక ఏకీకృత నోటిఫికేషన్‌గా విలీనంచేసింది. ఇది వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. సరళీకరణ, పారదర్శకత, వ్యాపారం చేయడం సులభతరంగా మార్చడంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుత సుంకాల మినహాయింపులు, ప్రయోజనాలన్నీ ఈకొత్త నోటిఫికేషన్‌లో ఉన్నాయి. అదే సమయంలో ఇవన్నీ మరింత నిర్మాణాత్మకంగా, సరళంగా ఉన్నాయి. కస్టమ్స్ విధానాలను హేతుబద్ధం చేయడం లో, వీటిని పాటిం చడంలో వ్యాపారులు, కస్టమ్స్ అధికారులపై భారాన్ని తగ్గించడంలో ఈ చర్య మైలురాయి వంటిది.

# యువకులు, మహిళలారా కాంగ్రెస్‌ను నిలదీయండి



## మన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 26, ప్రభాతవార్త:** మహిళా రుణాలను అడ్డు కుంటున్న, నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న కాంగ్రెస్‌ను యువత, మహిళలు నిలదీయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని వెంకటగిరి ఆఫీసర్స్ కాలనీలో ప్రధాని 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనసులోని మాటలను, ఆలోచనలను దేశ ప్రజలతో మన్ కీ బాత్ ద్వారా పంచుకుంటున్న ఏకైక నాయకుడు దేశ ప్రధాని మోడీ ఒక్కరేనన్నారు. దేశ గొప్పతనం, సంస్కృతి, త్యాగాల గురించి ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని వివరిస్తున్నారన్నారు. 11 యేళ్లుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశ ప్రగతిని ముందుకు తీసుకెళ్తున్న వ్యక్తి అని అన్నారు. 140 కోట్ల మంది భారతీయులను ఏకం చేసిన వ్యక్తి అని, కొవిడ్ సమయంలోనే ఇది నిరూపితమైందన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అనేక వాగ్దానాలు ఇచ్చిందని, కేసీఆర్ డబుల్ బెడ్ రూం పేరుతో మోసం చేశారని, పొదుపు సంఘాలకు డబ్బులు ఇవ్వలేదన్నారు. నాటి బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో కబ్జాలు, అక్రమాలు, రౌడీయిజం, నేరాలు పెరిగాయన్నారు. ప్రజలను, నాయకులను, విలేకరులను వేధించారన్నారు. పొంగుతున్న రోడ్లు, తాగునీరు లేని బస్తీలు ఈ నియోజక వర్గంలో కనిపిస్తున్నాయన్నారు.

కేసీఆర్ ఫాంహౌజ్‌లో పడుకొని ఓట్లు అడుగుతున్నారని, ఇక్కడ గల్లీల్లో, చెత్త కుప్పల్లో తిరుగుతూ ఓట్లు అడగాలని, ప్రజలు పడుతున్న బాధలు తెలుస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అయిదు లక్షల రూపాయల రుణాలు ఇస్తామని విద్యార్థులకు మోసం చేసిందని, దళిత కుటుంబానికి రూ. 12లక్షలను ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన లక్ష కోట్లు ఏమయ్యాయి అంటూ ప్రశ్నించారు. వీటిపై ప్రజలు ఆయా నాయకులను నిలదీయాలన్నారు. మజ్లిస్ కబందహస్తాల నుంచి నగరాన్ని కాపాడుకోవాలని, ఇందుకోసం బీజేపీని గెలిపించాలని కోరారు. రేవంత్‌రెడ్డి హామీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

## 'గోవులు విశ్వానికే తల్లి' సూక్తిని నిజం చేసుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ అక్టోబర్ 26, ప్రభాతవార్త:** గోవులు విశ్వానికే తల్లి అనే సూక్తిని నిజం చేసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని కేయంఐటి లోగో సేవ తెలంగాణ విభా గం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి తెలంగాణ ప్రాంత గో విజ్ఞాన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కాలు ప్రధాన చేసి ప్రసంగించారు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన నాకు గోమాత పట్ల ప్రత్యేకమైన గౌరవం, వాటి రక్షణ పట్ల అవగాహన ఉంది. అలాగే, గోవుల వల్ల సమాజానికి చేకూరే అపారమైన లాభాలు నాకు పూర్తిగా తెలుసు. గోవులు కేవలం పాలను మాత్రమే కాకుండా, వాటి శ్వాస, ఉచ్ఛ్వాసల మధ్య గడిపే సమయం మనిషిలోని సగం ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. ఎప్పుడూ అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉండే ఆయన, తన నివాసంలో గోవులను పెంచుకుంటూ, వాటితో గడిపే సమయం వల్ల మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దూరం చేసుకుంటున్నానని చెప్పారు. ఇది గోవుల ప్రాముఖ్యతకు ఒక మంచి ఉదాహరణ. అని అన్నారు. దురదృష్టవశాత్తు, వ్యవసాయ క్షేత్రాలు, తగ్గిపోవడం వలన గోవుల స్వేచ్ఛకు గండి పడిందనీ, . ఒకప్పుడు పచ్చిక బయళ్లలో స్వేచ్ఛగా తిరిగే అవి, ఇప్పుడు ఇరుకు స్థలంలో కట్టిపడేయబడుతున్నాయన్నారు. .గోవుల రక్షణ కేవలం గో పరిరక్షకుల బాధ్యత మాత్రమే కాదు, మొత్తం సమాజానిదే నని అన్నారు. గోవుల వ్యర్థాలతో వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారాన్ని పెంచుతున్నాయనీ అన్నారు. రోజు గో సేవ విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అద్భుతమైన కార్యక్రమంలో, తల్లిదండ్రులను, వారి పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది అని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా పాల్గొన్నారు.

## నైవేలీ లిగ్నైట్ సిఎండి ప్రసన్నకు అబ్దుల్‌కలాం పురస్కారం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌సిఎల్) ఇండియా లిమిటెడ్ సిఎండి మోటుపల్లి ప్రసన్నకుమార్ డాక్టర్ అబ్దుల్ కలాం జీవిత సాఫల్య పుస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఆదివారం జరిగిన అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో భాగంగా ప్రసన్నకుమార్‌కు ఈ పురస్కారం ప్రదానం చేశారు. ప్రసన్న కుమార్ దార్శనిక నాయకత్వం, ఆదర్శప్రాయమైన సేవ, ఆవిష్కరణ, జాతీయ వృద్ధికి అచంచలమైన నిబద్ధతను గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.విలువలు, చురుకైన నాయకత్వంలో ఎన్‌సిఎల్ పునరుత్పాదక ఇంధన విస్తరణ, స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక పరివర్తనపై బలమైన దృష్టితో ఇంధన, మైనింగ్ రంగాలలో అద్భుతమైన పురోగతిని సాధించింది. విక్సిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా, పర్యావరణ అనుకూలమైన సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహిస్తూ ఆయన చొరవలు భారతదేశ ఇంధన భద్రతను గణనీయంగా బలోపేతం చేశాయి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం జాతీయ పురోగతి, పారిశ్రా మిక ఆవిష్కరణలు పర్యావరణ నాయకత్వానికి అపారమైన కృషి చేశారన్నారు.

# అన్నదాతకు తుఫాన్ గండం

### ఆరుగాలం శ్రమ వర్షార్పణం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తుఫానుగా మారడంతో అన్నదాత గుండెల్లో గుబులు రేపుతోంది. తెలంగాణ వ్యాప్తంగా ఒక కోటి 63వేల ఎకరాలలో సాగుచేసిన ఆహార పంటలు, వాణిజ్య, చేతికి అందుతున్న తరుణంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి.పసుపు,కూరగాయలు, పండ్లు వంటి తోటలకు కూడా సుదీర్ఘవర్షంతో చీడపీడలు సోకిరైతుకు అనిశ్చితికి గురిచేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ జిల్లాలో సాంప్రదాయ పంటలు 1,29,62,000లో సాగు చేసిన వరి, పత్తి, సోయా, మొక్కజొన్న, కందులు, పెసర, మినుములు, తదితర పంటల కోతలు పూర్తి కావడంతో కేంద్రాల్లో విక్రయించుకునేందుకు పొలాల్లో, రోడ్లపై ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. పంట ఉత్పత్తుల విక్రయాల్లో తేమతోనే ధర నిర్ధారణ చేస్తారు. తేమను తగ్గించేందుకు రైతులు పంటను ఆరబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటే. మరోవైపు మబ్బులతో కూడిన వాతావరణం రైతుల గుండెల్లో గుబులురేపుతోంది. కొంత మంది రైతులు సోయాను కోసి, నూర్పిడికి కుప్పలు వేసి ఉంచారు. పంట ఇంటికి రాక ముందే వర్షాలు కురుస్తుండటంతో టార్పాలిన్ కవర్లు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. తెలంగాణలో వరి 67.30లక్షల ఎకరాలలో, 45.94 లక్షలలో పత్తి పంటను సాగు చేశారు.కోటి యాభైలక్షల వరిధాన్యం దిగుబడిఅవుతుందని అంచనావేశారు. మూడు దశల్లో పత్తిని ఏరి మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తారు. 36,75,774 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి అవుతుందని అంచనా వేసినా ప్రతికూల వాతావరణంతో దిగుబడి పూర్తిగా తగ్గి కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. సెప్టెంబరు నుంచి నిరంతరం వర్షం కురుస్తుండటంతో పత్తి కాయలు నేలరాలిపోతున్నాయి. కొన్ని కుళ్లిపోతున్నాయి. ఏరని పత్తి మొక్కలపైనే తడిసి పసుపురంగులోకి మారుతోంది.పత్తి కాయలు విచ్చుకోకుండా అలాగే ముద్ద అవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్,కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో పత్తిలో తేమ 27శాతం ఉంటున్నది. కాటన్‌కార్పొరేషన్ ఇండియా పత్తిలో తేమ 12 శాతం లోపు ఉంటేనే కొనుగోలు చేస్తుంది. పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు 8100 ఉన్నప్పటికి తేమ,డిస్‌కలర్,స్టేపుల్ లెంథ్ 31ఎం.ఎం వంటి ప్రమాణాలకు తూగకపోవడంతో ఐదు నుంచి ఆరువేల రూపాయలు కూడా ధర వచ్చే పరిస్థితి లేదు. మొక్కజొన్న రాష్ట్రంలో ఆరులక్షల44వేల ఎకరాలలో సాగుచేశారు. 12లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు కానీ అయితే వర్షం కారణంగా మొక్కజొన్నలో సగటు నాణ్యతాప్రమాణాల ప్రకారం 14శాతంలోపే తేమ ఉండాలి కానీ ఇందులో కూడా 21శాతం మేరకు తేమ ఉండటంతో కనీసమద్దతు ధర 2400 రావడంలేదు. నాలుగులక్షల90వేల ఎకరాలలో సాగుచేసిన కందులు, 61వేల ఎకరాలలో సాగుచేసిన పెసరపంట,28వేల ఎకరాలలో సాగైన మినుములు,పదివేల ఎకరాలలో సాగుచేసిన వేరుశనగ , 36వేల ఎకరాలలో పండించిన జొన్నలు పంటల పై పూర్తిగా ఆశ వదులు కొన్నారు. మరో వైపు సోయా 3,62 372 ఎకరాలలో సాగు చేశారు. నిజామాబాద్ నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలో కొనుగోళ్లను ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులు మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో అన్ని పంట దినుసులలో 20 నుంచి 27 శాతం తేమ ఉంటున్నది. తెలంగాణలో అన్ని పంటలు మొలకలు వస్తున్నాయి.

# వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

## మలేరియా, డెంగ్యూల నుంచి జాగ్రత్తగా ఉండాలి

### ప్రజలకు వైద్య, ఆరోగ్య శాఖ సూచన

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాబోయే మూడు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రత తగ్గడం, తేమ ఎక్కువగా ఉండనుంది. ఈ నేపథ్యంలో కాలానుగుణ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ పలు సూచనలు చేసింది. ముఖ్యంగా వెక్టర్, నీరు, గాలి ద్వారా సంక్రమించే వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని. వాటినుండి రక్షణ కోసం, ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండటానికి మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యాలను ఎదుర్కోవడానికి దోమల ముప్పును ఎదుర్కోవాలని సూచించారు. కిటికీలకు దోమతెరలను ఏర్పాటు చేసుకొని భద్రంగా ఉండాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరక్టర్ డాక్టర్ వి రవీందర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ముందుజాగ్రత్తగా దోమల నివారణ మందులను వాడాలని సూచించారు.

నీరు నిలిచిపోకుండా నిరోధించడానికి గృహ కాలువలను వాడాలన్నారు. దోమల వృద్ధిని నివారించడానికి గృహ సెప్టిక్ ట్యాంకులను మెష్‌తో కప్పాలని, ఇంటి చుట్టూ నిలిచిన నీటిని తొలగించడానికి ప్రతి వారం "శుక్రవారం డ్రై డే" పాటించాలన్నారు. నీటి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించాలని.. తీవ్రమైన గ్యాస్ట్రోఎంటెరిటిస్, కామెర్లు, టైఫాయిడ్ రాకుండా ఫిల్టర్ చేసిన, మరిగించిన నీటిని త్రాగాలని సూచించారు. ముఖ్యంగా బయట ఆహారాన్ని తినకుండా ఉండాలన్నారు. గాలి ద్వారా వచ్చే వైరల్ జ్వరాలు, ఇన్ఫ్లుఎంజా, అనారోగ్యంతో ఉన్న వారితో కరచాలనం చేయవద్దన్నారు. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఉండటానికి తరచుగా హ్యాండ్ శానిటైజర్లను వాడాలన్నారు. తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతి రుమాలు వాడాలని, ఎవరికైనా ఫ్లూ లాంటి లక్షణాలైన జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, సంబంధిత శరీర నొప్పులతో కూడిన దగ్గు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలన సూచించారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయాలని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా, అన్ని ప్రజారోగ్య కేంద్రాలలో ప్రత్యేక పడకలు, ఐవి ఫ్లూయిడ్లు, అవసరమైన మందులను అందించడం ద్వారా ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసిందని డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు.

# 111 ఆదివాసీ జంటలకు ఒకే వేదికపై పెళ్లిళ్లు

## నల్లమల ఆదివాసీలను మరోసారి కలుస్తా

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ



నూతన వధువరులకు వివాహ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబరు 26, ప్రభాతవార్త:** అడవులను నమ్ముకొని జనజీవనానికి దూరంగా జీవిస్తున్న ఆదివాసీలను ఒక్క చోటుకు చేర్చి సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ ఒకే వేదికపై 111 మందికి సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వనవాసి కళ్యాణ పరిషత్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో చెంచు గిరిజన యువతి యువకులకు 111 జంటలకు సామూహిక వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హైకోర్టు జడ్జ్ టీ మాధవి దేవి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆదివాసి కళ్యాణ ఆశ్రమం అఖిల భారత కార్యకారిణి ఇండోర్‌కు చెందిన రేఖ నాగర్, ప్రాంత అధ్యక్షులు కాట్రాజు వెంకటయ్య, శ్రీశ్రీశ్రీ అంబత్రాయ క్షేత్ర పీఠాధిపతి అదిత్య పర శ్రీ స్వామిలు సామూహిక వివాహాలు చేసుకున్న దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అడవి బిడ్డల వివాహానికి హాజరు కావడం ఆనందంగా ఉందని ఈ ప్రాంత చెంచు గిరిజనులను మరొకసారి కలుసుకుంటానని గవర్నర్ అన్నారు. సమాజంలో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి సామాజిక రుగ్మతలను దూరం చేసే కార్యక్రమాలకు సాక్ష్యత్తు భగవంతుడే అండగా ఉంటారని గవర్నర్ అన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు దేవుడి అండ దండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ వేదికపై సామూహిక వివాహాలు జరుపుకున్న జంటలు సుఖ సంతోషాలతో పిల్లపాపలతో కలికాలం కలిసుండాలని గవర్నర్ ఆశీర్వదించారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ ప్రకారం ఆదివాసీల వివాహాలు జరిపించడం అభినందనీయమని నిర్వాహకులను ఆయన అభినందించారు. చెంచు గిరిజనుల సామాజిక వివాహ మహోత్సవాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై ఆశీర్వదించడం అభినందనీయం అన్నారు. హైకోర్టు జడ్జ్ టి.మాధవి దేవి మాట్లాడుతూ సామూహిక వివాహాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు ఇద్దరు కుమారులేనని, ఆడపిల్లలు లేరని వివాహం చేసుకున్న ఆదివాసి బిడ్డలు తన కూతుర్లు లాంటి వారని హైకోర్టు జడ్జ్ టి.మాధవి దేవి అన్నారు. తాను ఇదే నల్లమల కోడలినని పదర మండలం ఉడిమిళ్ళ గ్రామానికి చెందిన తంగిరాల హనుమంత రెడ్డి కుటుంబం అన్నారు. నిరుపేదలైన చెంచు గిరిజనులకు తన అండదండలు ఎప్పటికీ ఉంటాయని, ఏ ఆపద వచ్చిన తాను అండగా ఉంటానన్నారు. అంతకుముందు నారాయణపేట జిల్లా అంబత్రేయ క్షేత్రానికి చెందిన ఆదిత్య పరాశర స్వామి ఆశీర్వచన ప్రసంగం గావించారు. సామూహిక వివాహాలకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సామూహిక వివాహాలు చేసుకున్న నూతన వధువరులకు వివాహ సర్టిఫికెట్లను గవర్నర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కళ్యాణ పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఉడతనూరి లింగయ్య, తెలంగాణ ఆదివాసి మహిళ ప్రముఖ గుర్రం శంఖులత, ఆర్ఎస్ఎస్ బాధ్యులు ఏమి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రాజు, భాస్కరాచారి, వీరితో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# పత్తి రైతుకు కూలీల కొరత

### బ్రోకర్ల సాయంతో ఇతర రాష్ట్రాల నుండి రాక

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం పత్తి, వరి తదితర వివిధ పంటల కోతలు, తీతలు జోరందుకోవడంతో కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా పత్తి సేకరణకు కూలీలు దొరకడం లేదు. ఒక పక్క వరి కోతలు మరోపక్క పత్తి ఏరడం ఏకకాలంలో మొదలయ్యాయి. దీంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు రైతులను వర్షం భయం వెంటాడుతోంది. పత్తి తడిసి దెబ్బతినక ముందే ఏరేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో కూలీలు కొరత ఏర్పడి పొరుగు రాష్ట్రాలకు రైతులు వెళుతున్నారు. కూలీల డిమాండ్ దృష్ట్యా ఖర్చులన్ని భరించి కూలీలను తీసుకొస్తున్నారు. బ్రోకర్ల సాయంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యాణా, ఢిల్లీ ప్రాంత కూలీలు ప్రత్యేక వాహనాల్లో జిల్లాకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. ఇందుకు బ్రోకర్‌కు కమీషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో జట్టుకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు బ్రోకర్ తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల కుటుంబాలకు వాహనం కిరాయి రైతే భరించాల్సి వస్తోంది. దూరాన్ని బట్టి రూ.10 వేల నుండి రూ.15 వేలు వాహనానికి కిరాయి ఉంది. ఇక ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వారికి ముందస్తు ట్రైన్ టికెట్లు బుక్ చేస్తున్నారు. పిల్లాపాపలతో ఇక్కడికి చేరుకున్న కూలీలకు బస ఏర్పాటు చేయాల్సి వస్తోంది. వారికి గుడారాల ఏర్పాటు, వంట చెరుకులు, కరెంటు, నీటిసౌకర్యాన్ని రైతులే కల్పిస్తున్నారు.

### డెవలప్‌మెంట్‌పై కాకుండా సెంటిమెంటుతో

# ఓట్ల కోసం పాకులాట

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** డెవలప్మెంట్ మీద హరీశ్‌రావు మాట్లాడకుండా సెంటిమెంట్ మీద ఓట్లు సంపాదించుకోవాలని చూస్తున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో ఆదివారం మాట్లా డుతూ ఎవరి గూబ గుయ్యి అంటదో హరీశ్‌రావుకు తొందరలోనే తెలుస్తుందని అన్నారు. లక్ష ఇల్లు ఎక్కడ కట్టారు? ఎవరికిచ్చారు? హరీశ్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారాన్ని చేతిలో పెట్టుకొని ఇష్టానుసారంగా నాళాలను చెరువులని కబ్జాలు చేశారని దుయ్యబట్టారు. చిన్న వాన పడితే హైదరాబాద్ లో తిరగలేని పరిస్థితి దాని కారణం ఎవరని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చాయి అని హరీష్ రావు పనికిరాని మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఉపఎన్నిక అంటే హరీశ్‌రావుని ట్రబుల్ షూటర్ అని డబ్బా కొట్టేవాళ్ళు హుజురాబాద్ ఉప ఎన్నికలలో ఎందుకు గెలవలేదో తెలుపాలని ప్రశ్నించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఎంత డబ్బు పెట్టిరో ప్రజలందరికీ తెలుసని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ లో కూడా అదే చేద్దాం అనుకున్నారు మీ నాటకాలు నడవవు అని అన్నారు. నవీన్ యాదవ్ పేరు రాగానే బిఆర్ఎస్ ఇంకా గెలవదని తెలిసిపోయిందని ఎవరు డబ్బులతో గెలవాలని చూస్తున్నారో 11న ప్రజల నిర్ణయిస్తారని అన్నారు.

# హరీశ్‌రావు.. మీ అవినీతి ప్రజలు మరిచిపోలేదు

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** హరీష్ రావు మీ అవినీతి రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదని, మా మంత్రులగురించి మాట్లాడే హక్కు మీకెక్కడిదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ లక్షల కోట్ల తెలంగాణ ధనాన్ని ముంచిన మీరు మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. మీ శాఖలోనే ఎంత అవినీతి ఉందో ప్రజలకు తెలుసని ఆయన అన్నారు. భూముల్ని ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టింది మీరు జూబ్లీహిల్స్ లో మీరు ఎన్ని ఇల్లు కట్టారు? అని నిలదీశారు. లేనిపోని ఆరోపణ చేస్తే ప్రజలు మిమ్మల్ని పట్టించుకోరనిహితవు చెప్పారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో మీ డబ్బా మీరే కొట్టుకోవడం తప్ప మీ గురించి ఎవరైనా మాట్లాడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ బయటకి వచ్చి తన కూతురిని ఎందుకు పంపించారో ఒక స్టేట్మెంట్ ఇవ్వమనండి అని సవాల్ చేశారు. ఓటమిపాలై కిందపడినా కూడా పై చేయి మాదే అనుకొని భ్రమ పడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# తెలంగాణ ఉద్యమ తరహాలో రిజర్వేషన్ల ఉద్యమం

### తక్షణమే రాజ్యాంగ సవరణ చేయాలి

### బిసి జెఎసి సమావేశంలో నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ రిజర్వేషన్లకై బీసీలంతా ఏకమై ఉద్యమిస్తామని బీసీ జేఏసీ నేతలు స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జేఏసీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్‌ఛైర్మన్ వి.జి.ఆర్ నారగోని, కోఛైర్మన్ దాసు సురేష్‌లు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ జేఏసీ ఏర్పడిందని, రిజర్వేషన్లకై ఈనెల 18న జేఏసీ చేపట్టిన రాష్ట్ర బంద్ విజయవంతం అయిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేసే పోరాటంలో ప్రాణాలు పోయినా రిజర్వేషన్లు సాధించే వరకు వదిలిపెట్టమని, భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, రాజకీ యంగా బీసీలను చైతన్యం



బిసి జెఎసి సమావేశంలో అభివాదం చేస్తున్న వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితర నేతలు

చేస్తామని, రిజర్వేషన్ వ్యతిరేక శక్తులను బొంద పెడతామని హెచ్చరించారు. ఉద్యమాన్ని గల్లి నుంచి ఢిల్లీ వరకు ఉధృతం చేయటానికి నవంబర్ 2న కళింగ భవన్‌లో బీసీ జేఏసీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ రెండవ వారంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, నియోజకవర్గ మండల కేంద్రాలలో నిరసన దీక్షలు చేపడతామని, నవంబర్ మూడో వారంలో పల్లె నుంచి పట్టణం వరకు భారీ ర్యాలీలు, ప్రదర్శనలు చేపడతామని, బీహార్ ఎన్నికల అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలను కలిసి, బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని కోరతామని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచటానికి రాజ్యాంగ సవరణ ఒక్కటే పరిష్కార మార్గమని, తక్షణమే రాజ్యాంగ సవరణ చేసి, బీసీ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై జరుగుతున్న ఈ పోరాటంలో అన్ని సంఘాలను కలుపుకుంటామని, పార్టీలకు అతీతంగా అందరి మద్దతు తీసుకుంటా మని వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్య క్షులు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుపై బిఆర్ఎస్ ప్రేరేపిత నీలాపనిందలు

### పెట్టుబడులు అడ్డుకోవడానికి కెటిఆర్ డైరెక్షన్‌లో రాజకీయాలు

### రాజకీయ దురుద్దేశ్యంతో మంత్రిపై పుట్ట మధు అసత్య ప్రచారాలు: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నేతలు మంత్రి శ్రీధర్ బాబు పై నిరాధారమైన నీలాపనిందలు వేస్తూ ఆయన ప్రతిష్ఠను దిగజార్చే కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ పుట్ట మధు రాజకీయ దురుద్దేశ్యంతోనే అసత్యాలను ప్రచారం చేస్తున్నాని ఆవేదన చెందారు. మీరు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా,మంత్రి శ్రీధర్‌బాబు ఏంటో, ఆయన కుటుంబం ఏంటో ఈ రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై ప్రజల్లో అపనమ్మకం సృష్టించడానికే కెటిఆర్ స్వీయ దర్శకత్వంలో కొందరు బిఆర్ఎస్ నాయకులు ఈ తరహా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఎన్నో ఏళ్లుగా శ్రీధర్ బాబు మంత్రిగా పనిచేస్తూ వస్తున్నారు, రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వచ్చేలా చేసి, ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నారని ఆయన వివరించారు.అలాంటి వ్యక్తి పేరు బద్నాం చేయాలన్న కుట్రతోనే బిఆర్ ఎస్ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తూ ఆనందం పొందుతున్నారని అన్నారు. దొంగల పార్టీలో ఉన్న దొంగలే ఇప్పుడు 'దొంగ దొంగ' అని అరుస్తూ, నీతులు వల్లే వేస్తూ ఎదుటి వారి పైకి వేలెత్తి చూపుతున్నారని విమర్శించారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోమని ఫిర్యాదు చేసిన వారిపైనే బురద చల్లడం, చిల్లర రాజకీయాలు చేయడం తెలంగాణ లో తప్ప ఎక్కడా కనిపించదని ఉదహరించారు. మంత్రి శ్రీధర్ బాబు ఓఎస్డీ పేరిట నకిలీ లెటర్ హెడ్స్‌ను ఎవరో బయట వ్యక్తులు సృష్టించి ఐటీ ప్రాజెక్టులు ఇప్పిస్తామంటూ బాధితుల నుంచి రూ.1.77 కోట్లు వసూలు చేశారని సంఘటనను ఎమ్మెల్సీ వివరించారు. ఇందులో మంత్రి శ్రీధర్ బాబు పేషీకి గానీ, మంత్రి గారి వ్యక్తిగత, ఇతర సిబ్బందికి గానీ ఎలాంటి సంబంధం లేదని బల్మూరి వివరణ ఇచ్చారు. ఈ విషయం మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి రాగానే ఆయన వెంటనే అప్రమత్తమయ్యారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాధితులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకు న్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ ఓఎస్డీని ఆదేశించారు. మంత్రి ఓఎస్డీ స్వయంగా జూన్ 3న సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో నా నకిలీ లెటర్ హెడ్స్ మోసానికి పాల్పడిన ఓడూరి వివి సత్యనారాయణ అలియాస్ సతీష్ ఆయన ఆరుగురు గ్యాంగ్ సభ్యులపై ఫిర్యాదు చేశారని తెలిపారు ఫిర్యాదు ఇచ్చిన రోజు అంటే జూన్ 3న సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్(ఎఫ్ఐఆర్ 67/2025) నమోదు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ కు చెందిన పోలీస్ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా మాట్లాడారని అన్నారు.

**గ్లోబల్ క్యాపిటల్‌గా హైదరాబాద్‌ను రూపొందించిన శ్రీధర్‌బాబు: లింగంయాదవ్**

హైదరాబాద్ గ్లోబల్ క్యాపిటల్‌గా తయారించిన మంత్రి శ్రీధర్ బాబు ఆరోపణలు చేయడం మానుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ అన్నారు. మంత్రి పేషీ నుండే ఫిర్యాదు చేశారు కానీ పుట్ట మధు శ్రీధర్ బాబు ఇమేజ్ దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని ఆవేదన చెందారు. పుట్ట మధు కి సెటిల్ మెంట్‌లుహత్యలు తప్పా ఆయనకేం తెలుసు అని ప్రశ్నించారు ఆధారాలు ఉంటే మాట్లాడు కానీ శ్రీధర్ బాబు ఇమేజ్ డ్యామేజి చేయాలని చూడకు అని హితవు చెప్పారు. శ్రీధర్ బాబు మీద ఆరోపణలు చేయడం అంటే, ఆకాశం మీద ఉమ్మేయడమే అని అన్నారు. శ్రీధర్ బాబు గురించి కెటిఆర్ కెసిఆర్‌నీ అడిగి తెలుసుకోఅని అన్నారు . పుట్ట మధు కుట్రలపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు. శ్రీధర్ బాబు పేషీ పై పుట్ట మధు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. .

## శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి తిరుమలదేవి



**తిరుమల,అక్టోబరు 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేం కటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలదేవి కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆల య అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల చెల్లింపుల్లో స్వల్ప మార్పులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 26:**ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు నాలుగు విడతలుగా అందచేస్తున్న బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 పని దినాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (ఐహెచ్‌హెచ్ఎల్) పనులను చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ఈ మార్పు అనివార్యమైందని మంత్రి తెలిపారు. కేవలం చెల్లింపుల షెడ్యూల్‌లో మాత్రమే మార్పులు జరుగుతాయని, లబ్ధిదారులకు మంజూరు చేసే రూ.5 లక్షల మొత్తంలో ఎలాంటి మార్పు ఉండదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.ఉపాధి హామీ పథకం కింద రూ.60 వేలు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి అయితే ఒక లక్ష రూపాయలు, రూఫ్ లెవల్ వరకు వచ్చిన తరువాత మరో లక్ష రూపాయలు విడుదల చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. అలాగే ప్రస్తుతం రూఫ్ పూర్తి అయిన తరువాత లబ్ధిదారులకు రూ.2 లక్షలను చెల్లిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కలుగుతున్న లబ్ధి (90 రోజుల పనిదినాల మొత్తం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం నిర్ధేశించిన మొత్తం) వారి ఖాతాల్లోకే నేరుగా జమ అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఇంటి శ్లాబ్ వేసిన తరువాత చెల్లించే మొత్తాన్ని రూ.1.40 లక్షలుగా అందచేయాలని ప్రభుత్వం నిర్ణయించనట్లు మంత్రి పొంగులేటి వివరించారు. ఇకపై శ్లాబ్ పూర్తి అయిన తరువాత రూ.1.40 లక్షలను మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని, మిగిలిన మొత్తాన్ని (రూ.60 వేలను)కూడా లబ్ధిదారుల ఖాతాల్లో ఉపాధి హామీ పథకం కింద అందచేస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. అలాగే, ఇంటి నిర్మాణం పూర్తి అయిన తరువాత మిగిలిన లక్ష రూపాయలను విడుదల చేస్తామన్నారు. పరిపాలనా సౌలభ్యం నేపథ్యంలో ఈ మార్పులు అనివార్యమయ్యాయని, లబ్ధిదారులు ఈ మార్పును గమనించి ప్రభుత్వంతో సహకరించాలని మంత్రి పొంగులేటి కోరారు.

## ఆగ్రా-లక్నో హైవేపై బస్సుకు మంటలు

**లక్నో, అక్టోబరు 26:** ఏపీలోని కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మంటల్లో చిక్కుకుని 20 మంది మరణించిన ఘటనను మరువకముందే మరో ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీ నుంచి గోండా కు 70 మంది ప్రయాణికులతో వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకున్నది.



ఆగ్రా-లక్నో జాతీయ రహదారిపై రేవ్రీ టోల్ ప్లాజాకు 500 మీటర్ల దూరంలో ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. ముందుగా ముందు టైర్‌లో చెలరేగిన మం టలు క్రమంగా బస్సు మొత్తం వ్యాపిం చాయి. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్, కండక్టర్ ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. బస్సులో సుమారు 39 మంది ప్రయాణీకులు ఉన్నారు. వారందరినీ సురక్షితంగా బయటకు తెచ్చామని డ్రైవర్ జగత్‌సింగ్‌తెలిపాడు. మొదట బస్సు చక్రంలో ప్రారంభం అయిన మంటలు వాహనంలోని ఇతరభాగాలకు వ్యాపించాయన్నాడు. ప్రమాదం సమాచారం తెలిసివెంటనే ప్రైవేటు బస్సు ఆపరేటర్ ప్రయాణికులకు మరో బస్సు ఏర్పాటుచేసింది. మంటలు వ్యాపించిన ఘటనపై దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా అధ్యాపకుల ఖాళీలు!

### 2,878 పోస్టులు మంజూరు కాగా.. పనిచేస్తుంది కేవలం 753 మందే

### 2017లోనే నియామకాలకు ఆర్థిక శాఖ ఆమోదం.. ఇప్పటికీ మొదలుకాని ప్రాసెస్

### యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమవుతుందంటున్న నిపుణులు?

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** నేటి బాలలే రేపటి పౌరులు. అలాంటి పౌరులు సమాజంపై అవగాహన కల్పించుకొని.. మంచి పౌరులుగా ఎదిగేది యూనివర్సిటీ విద్య ద్వారా. అటువంటి యూనివర్సిటీ విద్యను బోధించడానికి విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు కరువయ్యారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల కొరత ఉంది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం గత పదమూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. నాణ్యమైన విద్యను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ ఆచరణలో ఇటువంటి ఇబ్బందల మూలంగా అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోనే కాదు.. అనేక ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోధనా సిబ్బంది ఖాళీలుగా భారీగానే ఉన్నాయి. పాఠశాల విద్య స్థాయి నుంచి మొదలుపెడితే యూనివర్సిటీ స్థాయి వరకు అధ్యాపకుల ఖాళీలున్నాయి. బోధించే వారే లేకపోతే.. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్ది రోజుల క్రితం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, తెలంగాణ విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడేలాగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం విద్యాశాఖకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కానీ వాస్తవంగా రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. రాష్ట్రంలోని పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, యూనివర్సిటీ స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో అధ్యాపక ఖాళీలు భారీగా ఉన్నాయి. 26,0167 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉంటే వాటిల్లో సుమారు 15వేల వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉంటే వాటిల్లో సుమారు 500కి పైగా జూనియర్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 130 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 4200 అధ్యాపక పోస్టులు మంజూరైతే ప్రస్తుతం 1600 మంది రెగ్యులర్ లెక్చరర్లు కొనసాగుతున్నారు. ఇక యూనివర్సిటీల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రాష్ట్రంలో ఉన్న 11 యూనివర్సిటీల్లో 2878 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా వాటిల్లో ప్రస్తుతం 753 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు కొనసాగుతున్నారు. మిగిలిన 2125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం కలిపి 2878 పోస్టులు మంజూరు చేయగా.. వాటిలో కేవలం 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మంజూరైన ప్రొఫెసర్ పోస్టుల్లో ఉస్మానియా, తెలంగాణ, జేఎన్‌టియుహెచ్, జెఎన్ఎఫ్ఏయూలో మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన కాకతీయ, మహాత్మా గాంధీ, శాతావాహన, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్‌జీయుకేటిల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు, అసిస్టెంట్ ప్రొపెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. 11 విశ్వవిద్యాల యాల్లోనూ ప్రొఫెసర్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వరకు ఖాళీలున్నాయి. ఇక కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి, ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ల్లోనూ కొత్తగా నియామకాలను చేపట్టలేదు. కొద్దిరోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్)లో భాగంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటికే ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ఖాళీలకు అదనంగా మరో 20 నుంచి 30 ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి 2017లోనే సుమారు 1000కిపైగా పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 8 సంవత్సరాలుగా నియామక ప్రక్రియ ప్రారంభం కాకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా నియామక ప్రక్రియ నిలిచిపోయింది. నియామకాల కోసం ప్రత్యేక నియామక బోర్డును గత ప్రభుత్వం తీసుకురావాలని భావించినప్పటికీ అందుకు గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో నియామక బోర్డు ఏర్పాటు ఆగిపోయింది. ఆ తరువాత 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా యూనివర్సిటీల్లోని ఖాళీగా ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీని ఇప్పటి వరకు చేపట్టలేదు.

## ఎంబిబిఎస్ సీటు పొందిన విద్యార్థులకు కెటిఆర్, హరీశ్‌రావు సన్మానం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 26:** జహీరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు పొందిన విద్యార్థులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సన్మానించారు.

ఎంబీబీఎస్ సీట్ సాధించిన మైనార్టీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను కేటీఆర్, హరీశ్ రావు శాలువతో సత్కరించి సన్మానించారు.

## లొంగుబాటలో మావోయిస్టు టాప్ లీడర్ హిడ్మా?

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగలనుందా...? ఆ పార్టీకి చెందిన కేంద్ర కమిటీ నాయకులు మల్లోజుల వేణుగోపాల్ రావు, ఆశన్న, మల్లోజుల కోటేశ్వరరావు సతీమణి సుజాత సహ పలువురు ముఖ్య నాయకులు, వందల సంఖ్యలో క్షేత్ర స్థా యిలోని కేడార్ తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర పోలీసులకు లొంగిపోవడం తెలిసిందే. వీరి లొంగుబాటును మావోయిస్టు పార్టీ కుట్రగా అభివర్ణి స్తూనే లొంగిపోయిన వారంతా ద్రోహులని పేర్కొనడం విదితమే. అయినప్పటికీ మావోయిస్టుల వరుస లొంగుబాట్లు ఆగడం లేదు. తాజాగా ఆదివా రం నాడు ఛత్తీసగఢ్‌లో పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు తమ కేడర్‌తో కలిసి లొంగిపోయారు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురు దెబ్బ తగులబోతోందని ప్రచారం జరుగుతుంది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడు, పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కా ర్యదర్శి మాడవి హిడ్‌ముయ్ అలియాస్ హిడ్మా పోలీసులకు లొంగిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తన సహచరులతో పాటు భారీగా ఆయుధాలతో ఆయన లొంగిపోయేందుకు నిర్ణయించినట్లుగా కూడా చెబుతున్నారు. మల్లోజుల వేణుగోపాల్ రావు, ఆశన్న తరహాలో భారీ కేడర్‌తో కలిసి లొం గిపోయేందుకు హిడ్మా నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. హిడ్మా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ముఖ్యమైన వారిలో ఒకరుగా పేరొం దడం తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలపై జరిగిన అనేక దాడులకు హిడ్మా సూత్రధారిగా వుండడం గమనార్హం. గెరిల్లా యుద్ధ తంత్రంలో హిడ్మా ఆరితేరినట్లు పోలీసులు పలుమార్లు ప్రకటించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని సుకుమా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మా గిరిజన తెగకు చెందిన వ్యక్తి. గిరిజనులను పెద్ద సంఖ్యలో మావోయిస్టు పార్టీలో చేర్పించడంలో ఆయన చొరవ తీసుకున్నారని మావోయిస్టు పార్టీ అనేకమార్లు ప్రకటించిం ది. హిడ్మా లొంగుబాటు కోసం ఛత్తీస్‌ఘడ్. తెలంగాణ పోలీసు విభాగాలు అంతర్గతంగా కృషి చేస్తున్నట్లు సమాచారం.

హిడ్మాపై ఛత్తీస్‌ఘడ్‌లో ప దుల సంఖ్యలో కేసులున్నాయి. ఇందులో మెజారిటీ కేసులు భద్రతా బలగాలపై దాడులకు సంబంధించినవే కావడం గమనార్హం. ఇదే సమయంలో ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఎపిలోనూ కేసులున్నాయి. కాగా హిడ్మా లొంగిబాటుపై తమకు ఎలాంటి సమాచారం లేదని తెలంగాణ పోలీసులు చెబుతుండగా ఛత్తీస్‌ఘడ్ పోలీసులు మౌనం వహించసాగారు. గతంలో మల్లోజుల వేణుగోపాల్ రావు, ఆశన్నల లొంగుబాటు సందర్భంగా కూడా పోలీసులు మౌనం వహించారు. హిడ్మాపై ఐదు కోట్ల రూపాయలకు పైగా రివార్డు వుంది. హిడ్మా లొంగిపోతే మావోయిస్టు పార్టీలో ముఖ్య నాయ కులు ఐదారుగురు మాత్రమే వుంటారని పోలీసులు చెబుతున్నారు.

## అటవీ భూములుగా మారనున్న రెవెన్యూ స్థలాలు

### 427 ఎకరాలను గుర్తిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 26:** ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురైన అటవీ భూములకు ప్రత్యామ్నయంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ భూములను కేటాయించింది. అటవీ శాఖకు బదలాయించిన భూములను అటవీ శాఖ భూములుగా గుర్తిస్తూ ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం, మొండికుంట వాగుపై నిర్మించిన మీడియం రిజర్వాయర్ నిర్మాణంలో అటవీ శాఖ భూములు ముంపునకు గురయ్యాయి. ఈ భూమికి బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో చోటా ప్రభుత్వ (రెవెన్యూ) భూమిని కేటాయించింది. తాజాగా కేటాయించిన ఈ భూములను అటవీశాఖ భూములుగా నోటిఫై చేస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన అటవీ భూమికి బదులుగా 399.02 ఎకరాల భూమిని వేరు వేరు సర్వే నెంబర్లలో, వివిధ ప్రాంతాల్లో కేటాయించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామపరిధి సర్వే నెంబర్ 61 లో మొత్తం 124.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో నుంచి 84.27 ఎకరాల భూమిని అటవీ శాఖకు పరిహారం కింద కేటాయించారు. హనుమకొండ జిల్లా భీమదేవరం పల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ పరిధిలో సర్వే నెంబరు 340/15/2లో 30.13 ఎకరాలు, సర్వే నెంబర్ 353/14/2 లో 185.17 ఎకరాలు, సర్వే నెంబర్ 355/1/2లో 98.25 ఎకరాలు రెవెన్యూ భూమిని కేటాయించారు. ఈ భూమికి అటవీ శాఖ హద్దులు గుర్తిస్తూ రెవెన్యూ భూమి నుంచి అటవీశాఖ భూమిగా నోటిఫై చేస్తూ నోటిఫికేషన్ ను జారీ చేసింది. ములుగు జిల్లాలో మొండివాగుకుంటపై నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణం లో కోల్పోయిని అటవీశాఖ భూమికి బదులుగా ములుగు జిల్లా వాజేడు మండలం లక్ష్మీపురం గ్రామం సర్వే నెంబర్ 50/2 లో ఉన్న 28.20 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు బదలాయించారు. ఈ భూమి అటవీ భూమిగా గుర్తిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భూమి తాలుకు సంబంధించిన సమగ్ర వివరాలు పేర్కొంటూ, సరిహద్దులు ఏర్పాటు చేశారు. అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తించారు. ఈ భూములకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని అటవీ శాఖ సంబంధిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

## రూ.10 కోట్లు ఇవ్వకపోతే మీ కొడుకును చంపేస్తాం!

### బీహార్ బిజెపి ఎంపికి ఆగంతకుల బెదరింపులు



**పాట్నా, అక్టోబరు 26:** 'మర్యాదగా రూ.10 కోట్లు ఇస్తావా.. లేదంటే నీ కొడుకును చంపేయమంటావా..?' అంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బీహార్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, ఎంపీ సంజయ్ జైశ్వాల్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. దాంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. బాధిత ఎంపీ ఫిర్యాదు మేరకు వెంటనే రంగంలోకి దిగిన బీహార్ పోలీసులు కాల్ చేసిన వ్యక్తిని ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయాన్ని సబ్ డివిజినల్ పోలీస్ అధికారి వివేక్ దీప్ మీడియాకు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఎంపీకి రెండు బెదిరింపు ఫోన్ కాల్స్ రావడంతో ఆయన శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాల్ చేసిన వ్యక్తి రూ.10 కోట్లు అడిగాడని, లేదంటే తన కొడుకును చంపేస్తానని బెదిరించాడని ఎంపీ పోలీసులకు తెలిపారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. కాల్ చేసిన వ్యక్తిని ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎంపీని బెదిరించిన వ్యక్తికి క్రిమినల్ ముఠాలతో సంబంధం ఉండవచ్చునని అనుమానిస్తున్నట్లు చెప్పారు. అయితే ఈ బెదిరింపుల వెనుక రాజకీయ కోణం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలూ లేవని పోలీసులు పేర్కొన్నారు. కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా సంజయ్ జైశ్వాల్ ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ చీఫ్ విప్‌గా ఉన్నారు.

## బిహెచ్ఇఎల్‌లో భారీగా అక్రమాలు

### సిబిఐ దర్యాప్తు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 26:**బీహెచ్‌ఈఎల్ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్పై సీబీఐ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు దర్యాప్తు చేపట్టారు. పెద్దపల్లి ఎన్టీపీసీ రామగుండం సైట్ బీహెచ్ ఈఎల్ సంస్థలో బిల్లుల జారీ, మంజూరు విషయంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు ముమ్మరం చేశారు. బీహెచ్ఎల్ కంపెనీలో రూ.35.03 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డట్టు నమోదైన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. బీహెచ్ ఈఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొడపె సునీల్ కుమార్ సహా మొత్తం 9 మందిపై విజిలెన్స్ అడిషనల్ జీఎం హారీష్ కుమార్ గుప్తా మార్చిలో ఫిర్యాదు చేయగా అక్టోబర్ 14వ తేదీన ఎఫ్ఎఆర్ రిజిస్టర్ అయింది. బాయిలర్ కాంట్రాక్టుల్లో ఎరక్షన్, కమిషనింగ్ పనులను కలకత్తాకు చెందిన బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ ఇండియా లిమిటెడ్, కాంట్రాక్టర్ సంస్థ పవర్ ఇన్ఫ్రామెచ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టాయి. బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియా కంపెనీ లిమిటెడ్ వేతన బిల్లులను బీహెచ్ఎల్కు సమర్పించిన అక్రమాలకు పాల్పడింది. 202122 సంవత్సరాల్లో ఫోర్జరీ, నకిలీ బిల్లులతో రూ.35.03 కోట్ల అదనపు చెల్లింపులు జరిపారు.





## గాజాలో పేలని బాంబులు

### ఒకటి పేలి చిన్నారులకు తీవ్రగాయాలు

**గాజాసిటీ, అక్టోబరు 26:** ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత గాజాలో ప్రస్తుతం శాంతి నెలకొంది. కాల్పుల మోతలు ఆగిపోయాయి. బాంబు దాడులు నిలిచిపోయాయి. యుద్ధ సమయంలో ప్రాణభయంతో వలస వెళ్లిపోయిన పాలస్తీనియన్లు గాజాకు తిరిగివస్తున్నారు. శిథిలాల కింద తమ గూడు వెతుక్కుంటున్నారు. కూలిపోయిన తమ కలల సౌధాలను చూసి నిట్టూర్పు విడుస్తున్నారు. శిథిలాలను తొలగించి గూడు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఈ ప్రయత్నంలో ప్రాణాలు పోతాయేమోననే భయం వారిని వెంటాడుతోంది. యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ ప్రయోగించిన బాంబులలో కొన్ని పేలకుండా శిథిలాల కింద పడి ఉండటమే దీనికి కారణం. ఇటీవల ఇద్దరు చిన్నారులకు శిథిలాల కింద పేలని బాంబు లభించగా, దానిని ఆట వస్తువుగా భావించి ఆడుకున్నారు. ఈ క్రమంలో ఆ బాంబు పేలడంతో పిల్లలిద్దరూ గాయపడ్డారు. యుద్ధం మొదలైన దగ్గర ఇలా 52 మంది మరణించారని మరో 267 మంది గాయడ్డారని యునైటెడ్ నేషన్స్ మైన్ యాక్షన్ సర్వీస్ లెక్కలు చెబుతున్నాయి. భవనాల శిథిలాల తొలగింపునకూ ఆటంకాలు తప్పడంలేదని గాజా ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. కాల్పుల విరమణ తర్వాత యూఎన్ఎమ్ఎస్ కు చెందిన నిపుణులు ఇప్పటివరకు దాదాపు 560 పేలని బాంబులను గుర్తించి నిర్వీర్యం చేశారు. ఇంకా అనేక పేలని బాంబులు అక్కడ ఉండవచ్చని భావిస్తున్నారు. రెండేళ్ల యుద్ధంలో ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజావ్యాప్తంగా 60 మిలియన్ టన్నుల మేర శిథిలాలు పేరుకుపోయాయని అంచనా.



# పరకామణి కేసు పక్కదారి!

### రాజీలో టిటిడి ప్రమేయం ఉండదా!

### కోర్టులో కౌంటర్ దాఖలు వెనుక మతలబేమిటి?

### నేడు న్యాయస్థానం ప్రకటించే నిర్ణయంపై అందరిలో ఉత్కంఠ

**తిరుమల,అక్టోబరు26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి భక్తులు ఎంతో విశ్వాసంతో సమర్పించే కానుకల లెక్కింపు జరిగే పరకామణిలో 2023లో అమెరికన్ డాలర్లు చోరీ కేసు రాజీపడటంతో ఇప్పుడు పెద్ద వివాదాస్పదంగా పరిణమించింది. హైకోర్టు ధర్మాసనం న్యాయమూర్తి ఈ చోరీ కేసుపై అన్ని ఆదారాలు సమర్పించాలని సిఐడిని ఆదేశిం చడం, సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్ గత వారంరోజుల క్రిందట రికార్డులు, సిడిఫైళ్ళు, సిసికెమెరాపుటేజీలు హైకోర్టు ధర్మాసనం ముందుం చారు. ఈ కేసులో తదుపరి ఎలాంటి నిర్ణయాన్ని న్యాయమూర్తి వెలువడించకముందే ఎవరికివారే ముందుజాగ్రత్తగా కోర్టులో కౌంటర్ వేయడం చూస్తే కేసు పక్కదారిపట్టిస్తారా? అనే అనుమా నాలు టిటిడి వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. దేవునికి సమర్పించే కానుకల లెక్కింపు పరకామణి భవ నంలో చేపట్టే టిటిడి ఇందుకు సంబంధించి పూర్తి స్థాయిలో పర్యవేక్షణమాత్రమే విజిలెన్స్ విభాగం చేస్తుందనేది టిటిడి వర్గాల వాదన. అంతమాత్రాన పరకామణిలో ఎలాంటి అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నా టిటిడి అనుమతి లేకుండా విజిలెన్స్ విభాగం తమదే పెత్తనం అంటే బాధ్యతారాహిత్యం చెప్పకనే చెప్పవచ్చు. ఆ సమయంలో విధుల్లో ఉండే వారే తప్పులతడక అనేది నర్మగర్భమైన విషయం.

తప్పు జరిగితే టిటిడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలకు ఉపక్రమించడం జరుగుతుంది. అయితే 2023 ఏప్రిల్‌లో పరకా మణిలో గుమస్తా అయిన సివి రవికుమార్ 72వేల రూపాయలు విలువచేసే 920 అమెరికన్ డాలర్లు చోరీచేస్తూ భద్రత విధుల్లో ఉన్న అప్పటి ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్‌కు రెడ్‌హ్యాండడ్‌గా దొరికాడు. దీంతో అతనిని తదుపరి చర్యలకు తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయిం చారు. ఈ కేసు తిరుపతి కోర్టువరకు వెళ్లింది. ఆ తరువాత టిటిడి అధికారులు కొందరు దీనిపై లోక్ అదాలత్‌తో మధ్యవర్తిత్వంచేసి రాజీచే యించడం జరిగిపోయింది. కానీ ఆ తతంగం కోసం మళ్లీ టిటిడి అనుమతి అవసరం లేదని, ఫిర్యాదిదారుడుగా తన సమ్మతంతోనే పూర్వ అధికారుల సూచన మేరకు రాజీపోయామని ,ఎలాంటి దురుద్దేశం లేదని కౌంటర్ దాఖలు చేయడం తాజాగా మరింత వివాదాస్పద అంశంగా మారింది. ఆయన పోలీస్‌శాఖకు చెందిన ఉద్యోగి అనేది మరచిపోయి టిటిడి అనుమతి అవసరం లేదని కౌంటర్‌లో పేర్కొనడం ఎంతవరకు న్యాయసమ్మతమనేది నేడు హైకోర్టు ధర్మాసనం విచారణ చేయనుంది.

**దేవుని సొమ్ముకు ఎవరైనా బాధ్యులే:**

టిటిడిలో శాశ్వత ఉద్యోగులు అయినా డిప్యూటేషన్‌పై ఇతర శాఖల నుండి వచ్చినా ప్రతి ఒక్కరూ దేవుని పవిత్రతను,ఆస్తులను కాపాడటంలో తమవంతు బాధ్యత ఉంటుందనేది గుర్తుంచుకోవాలని టిటిడి వర్గాలు వెల్లడిస్తున్నాయి. మరీ అలాంటిది చోరీ కేసును సమగ్రంగా విచారణ చేయించాల్సింది పోయి మధ్యవర్తిత్వం జరిపి రాజీచేయడంలో గతంలో కొనసాగిన బోర్డు, ఉన్నతాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే ఏకంగా ఎవిఎస్ఒ సతీశ్‌కుమార్ వ్యవహారం ఎక్కడకు దారితీస్తుందనేది మాత్రం,రాజీ చేసుకోవాలని సూచనలు చేసిన ఆ పైఅధికారులు మాత్రం దోషులుగా నిలబడతారనడంలో ఎలాంటి సందేహం లేదు. హైకోర్టు న్యాయమూర్తి ఇటీవల ఆదేశాలతో టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ కౌంటర్ దాఖలుకు మరికొంత సమయం కావాలని విజ్ఞప్తిచేశారు. ఇదే సమయంలో పూర్వ ఎవిఎస్ఒ హైకోర్టులో కౌంటర్‌దాఖలు చేయడం వెనుక ఉన్న పెద్దలు ఎవరనేది మాత్రం మంగళవారం తిరుమలలో జరిగే బోర్డు సమావేశంలో వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇదే సమయంలో సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిశ్రీనివాసానంద సరస్వతి అప్పటి ఎవిఎస్ఒ వ్యవహార శైలిపై, లోక్‌అదాలత్‌వరకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుచేయడం మరింత చర్చనీయాంశంగా మారింది. మరీ ఈ కేసులో నేడు హైకోర్టు న్యాయమూర్తి ఎలాంటి నిర్ణయం వెలువడించనున్నారనేది అటు టిటిడి వర్గాల్లో ఇటు గత టిటిడి పెద్దల్లో మరింత ఉత్కంఠగా మారింది. ఇప్పటికే ఇదే అంశంపై బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కూడా ఆవేదన పూర్వకమైన విషయం వెల్లడించారు. దేవుని సొమ్మును కాపాడటంలో కాపలాకుక్కలా ఉంటున్నానని, ఈ కేసును ఉపసంహరించుకోవాలని నిందితుడు తరపున తనకు హెచ్చరికలు చేశారనేది ఆయన తెలిపారు. మరీ దేవుని సొమ్ముచోరీచేసిన కేసులో న్యాయం జరగాలనేది తన అభిప్రాయంగా వెల్లడించారు. తాను,తన కుటుంబం ఎవరిపై వ్యక్తిగత కక్ష,ద్వేషంలేదని స్పష్టం చేశారు.



### హిస్టారికల్ ఫిల్మ్ గోపీచంద్33 భారీ ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్

మాచోస్టార్ గోపీచంద్ ప్రస్తుతం తన ప్రెస్టీజియస్ హిస్టారికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గోపీచంద్33లో నటిస్తున్నారు. విజనరీ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరిప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పవన్‌కుమార్‌సమర్పణలో ఈచిత్రాన్ని భారీబడ్జెట్‌తోనిర్మిస్తున్నారు. ఈ చిత్రంఇప్పటికే నాలుగుషెడ్యూల్‌లు 55 రోజుల షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం హీరోగోపీచంద్‌తో పాటుప్రధానతారాగణంపై వెంకట్ మాస్టర్ కొరియోగ్రఫీ లో ఓభారీఇంటర్వెల్‌యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నారుప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది. ఇప్పటికే గోపీచంద్ బర్త్‌డే సందర్భంగా విడుదలచేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అద్భుతమైన స్పందన లభించింది. యోధుడిలా కనిపించిన గోపీచంద్ తన పాత్రలోని ఇంటెన్స్ ని ప్రజెంట్ చేశారు.



నభా నటేష్

# 'నెపోలియన్ రిటర్న్స్' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా..
## టైటిల్, గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు వశిష్ట



**ఆచార్య క్రియేషన్స్** బ్యానర్ మీద ఆనంద్ రవి దర్శకత్వంలో భోగేంద్ర గుప్త నిర్మించిన ప్రొడక్షన్ నెంబర్4 చిత్రానికి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను లాంఛ్ చేశారు. ఆనంద్ రవి, దివి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నెపోలియన్ రిటర్న్స్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టైటిల్, గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్‌కు వశిష్ట, సాయి రాజేష్, వంశీ నందిపాటి, అనిల్ విశ్వంత్ వంటి వారు గెస్టులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో

వశిష్ట మాట్లాడుతూ,నేను రవన్న కోసమే వచ్చాను. నీడ పోయిందని నెపోలియన్ తీశాడు. జంతువుల ఆత్మతోనూ కథను రాసుకోవచ్చని నాకు ఇప్పుడే అర్థమైంది. ఈ మూవీ కథ నాకు తెలుసు. సినిమా అద్భుతంగా ఉండబోతోంది. నెపోలియన్ రిటర్న్ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.
సాయిరాజేష్ మాట్లాడుతూ,నేను ఇక్కడకు ఆనంద్ రవి కోసం వచ్చాను. నేను, వశిష్ట, ఆనంద్ రవి మంచి స్నేహితులం. నెపోలియన్ రిటర్న్‌టైటిల్ చాలా బాగుంది. ఈ మూవీతో ఆనంద్ రవికి పెద్ద విజయం దక్కాలి. టీం అందరికీ ఆల్ ది బెస్ట్‌అని అన్నారు.
అనిల్ విశ్వంత్ మాట్లాడుతూ,ఆనంద్ రవి మొదటి సినిమాకి నేను పని చేశాను. ఆయన నాకు గురువు వంటి వారు. ఆయన రైటింగ్ నాకు చాలా ఇష్టం. ఆయన తీసుకునే హుక్ పాయింట్ చాలా బాగుంటుంది. ఈ మూవీ కథ కూడా నాకు తెలుసు. స్టోరీ చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. గుప్తా వల్లే పొలిమేరకాన్సెప్ట్ పుట్టింది. అందరికీ ఆల్ ది బెస్ట్ అని అన్నారు.
నిర్మాత భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ ,మా కోసం వచ్చిన సాయి రాజేష్, వశిష్ట, అనిల్ గార్లకు థాంక్స్. ఆనంద్ ఈ కథ కోసం చాలా కష్టపడ్డారు. ఏడాదిన్నర పాటుగా ప్రీ ప్రొడక్షన్ కోసమే పని చేశారు. మంచి సబ్జెక్ట్‌తో అందరి ముందుకు రాబోతోన్నామని అన్నారు.
హీరో, డైరెక్టర్ ఆనంద్ రవి మాట్లాడుతూ,మా కోసం వచ్చిన వశిష్ట, సాయి రాజేష్, అనిల్‌గార్లకు థాంక్స్. ఈ ప్రయాణంలో నాకు గుప్తా గారెంతో సహకరించారు. పేరెంట్స్ ప్రతినిధి, నెపోలియన్, కొరమీనుచిత్రాలు తీశాను. నేను అందరికీ తెలుసు. కానీ సరైన సక్సెస్, గుర్తింపు రాలేదు. కానీ నెపోలియన్ రిటర్న్ తో నాకు సక్సెస్, మంచి గుర్తింపు వస్తుంది. సినిమా అంతా అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనింగ్‌గానే ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లాడు ఆత్మగా మారే పాయింట్‌తో ఇంత వరకు ఎక్కడా సినిమా రాలేదు. ముమ్ముందు ఈ మూవీ గురించి మరింతగా తెలియజేస్తాను అని అన్నారు.
దివి మాట్లాడుతూ నెపోలియన్ తరువాత ఆనంద్ రవిని కలిశాను. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన ఆయనకు థాంక్స్. ఆనంద్ చెప్పిన కథ నాకెంతో నచ్చింది. ఈ మూవీ గురించి ముమ్ముందు అందరికీ తెలుస్తుంది అని అన్నారు.
తారాగణం : ఆనంద్ రవి,దివి, ఆటో రామ్ ప్రసాద్, రఘుబాబు, సూర్యపింగ్ పాంగ్, శ్రవణ్ రాఘవేంద్ర, యాంకర్ రవి, రవివర్మ, నరసింహా, బెజయవాడ బాబీ అక్క, మీసాల లక్ష్మణ్, రమణ భార్గవ్, కేదార్ శంకర్ తదితరులు.
సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: ఆనంద్ రవి, నిర్మాత: భోగేంద్ర గుప్తా, సహ నిర్మాత: జై గోస్వామి ప్రొడక్షన్ డిజైనర్: ..డిజైన్‌సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని,ఎడిటర్: విజయ్ వర్ధన్ కావూరి,లైన్ ప్రొడ్యూసర్: పోలాకి సురేష్ స్టైలిస్ట్: ముదస్సర్ మొహమ్మద్‌పబ్లిసిటీ డిజైనర్: సుధీర్ డిఓపి : నాయుడు ఫణి (బియాండ్ మీడియా.

# ఇక 2026లో ..
# మెగాస్టార్ సందడే సందడి



మెగాస్టార్ చిరంజీవి పదేళ్ల గ్యాప్ తర్వాత రీ ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు. ఆయన రీ ఎంట్రీ చిత్రం ఖైదీ నంబర్ 150 సూపర్ హిట్ కావడంతో సినీ పరిశ్రమలో చిరు మళ్లీ తన ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఆ తర్వాత వచ్చిన ఆచార్య చిత్రానికి మంచి స్పందన రాకపోవడం, ఈ సినిమా తర్వాత దాదాపు ఏడాది పాటు చిరంజీవిని వెండి తెరపై చూడడం సాధ్యం కాలేదు. కొన్నాళ్లుగా విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నారు చిరు. ఈ సినిమా 2026 సమ్మర్‌కు రానుంది. ఇప్పటికే విశ్వంభర షూటింగ్ పూర్తి కాగా, చిన్న ప్యాచ్‌వర్క్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా మల్లిడి వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతోంది. మరోవైపు అనీల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వర ప్రసాద్ చిత్రం చేస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. చిరు - బాబి కాంబినేషన్లో కొత్త చిత్రం 2026 దసరా లేదా దీపావళికి రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. మరొక ఆసక్తికర విషయం ఏమిటంటే, చిరు.. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సినిమా చేయనుండగా, ఈ సినిమాని 2026లో సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు.

# 'ఆర్యన్' నుంచి
# లవ్లీ మెలోడీ సాంగ్ రిలీజ్



విష్ణు విశాల్,ప్రవీణ్‌కె,విష్ణు విశాల్ స్టూడియోస్ విష్ణువిశాల్ మోస్ట్ ఎవైటెడ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్‌రమేష్‌సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీజర్, ట్రైలర్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్‌చార్ట్‌బస్టర్ హిట్ అయ్యింది.
ఇప్పుడు మేకర్స్ పరిచయమే సాంగ్ రిలీజ్. జిబ్రాన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. స్వామాట్ అందించిన లిరిక్స్ కట్టిపడేశాయి. జిబ్రాన్, అభి వి, భృత్త వోకల్స్ లవ్లీ ఫీల్ ని యాడ్ చేశాయి. ఈ సాంగ్ లో లీడ్ పెయిర్ జర్నీ హత్తుకునేలా వుంది. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప,మాలపార్వతి,అవినాష్,అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు.విష్ణువిశాల్ ఫైర్ చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. హరీష్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, గిబ్రాన్ సంగీతం, శాన్ లోకేష్ ఎడిటర్.ఆర్యన్‌అక్టోబర్ 31న విడుదల కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి (శ్రేష్ట్ మూవీస్) గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.
తారాగణం: విష్ణువిశాల్ ,సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి
నిర్మాణం విష్ణు విశాల్ (విష్ణు విశాల్ స్టూడియోస్)దర్శకత్వం: ప్రవీణ్ కె, నిర్మాతలు: శుభ్ర, ఆర్యన్ రమేష్, విష్ణువిశాల్ తెలుగు రిలీజ్: సుధాకర్ రెడ్డి (శ్రేష్ట్ మూవీస్)డిఓపి: హరీష్ కన్నన్,సంగీతం జిబ్రాన్,ఎడిటర్ :శాన్ లోకేష్.
స్టంట్స్: స్టంట్ సిల్వా, పిసి స్టంట్స్ ప్రభు,ఎడిషల్ స్క్రీన్ ప్లే మను ఆనంద్, ప్రొడక్షన్ డిజైన్ ఎస్.జయచంద్రన్,కాస్ట్యూమ్ డిజైనర్:స్టైలిస్ట్ వినోద్,సుందర్,పీఆర్వో: వంశీ శేఖర్ .

# 'మా ఇంటి బంగారం'తో సమంత బరిలోకి..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు చాలా రోజుల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు వచ్చింది. హెల్త్ ఇష్యూస్ కారణంగా లాంగ్ బ్రేక్ తీసుకున్న సామ్, ఇప్పుడు ఫుల్ ఎనర్జీతో రీ ఎంట్రీకి రెడీ మా ఇంటి బంగారంతో తిరిగి బరిలోకి!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు చాలా రోజుల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు వచ్చింది. హెల్త్ ఇష్యూస్ కారణంగా లాంగ్ బ్రేక్ తీసుకున్న సామ్, ఇప్పుడు ఫుల్ ఎనర్జీతో రీ ఎంట్రీకి రెడీ అయ్యారు. అభిమానులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న ఆమె సోలో పర్ఫార్మెన్స్ ఇప్పుడు పెద్ద తెరపై కనిపించబోతోంది. ఖుషి (2023) తర్వాత సమంతని మళ్లీ ఒక పవర్‌ఫుల్ లీడ్ రోల్‌లోచూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈసారి ఆమె కేవలం హీరోయిన్‌గానే కాకుండా ప్రొడ్యూసర్‌గా కూడా బరిలోకి దిగుతున్నారు.

సమంత తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై నిర్మిస్తున్న చిత్రం మా ఇంటి బంగారం. ఈ ప్రాజెక్ట్‌ను ఆమె చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకున్నారు. సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం, ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేగంగా కొనసాగుతోంది. సమంతతో పాటు మిగిలిన స్టార్ కాస్ట్‌పై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నది ఓ బేబీ ఫేమ్ నందిని రెడ్డి. సమంతనందిని కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఓ బేబీతో ఈ జంట భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.



అయితే మా ఇంటి బంగారంమాత్రం రెగ్యులర్ ఫ్యామిలీ డ్రామా కాదు. ఇది 1980ల బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక గ్రిప్పింగ్ క్రైమ్ థ్రిల్లర్ అని సమాచారం. ఈ జానర్ సమంతకు, నందిని రెడ్డికి కొత్తది కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా సమంత లుక్ ఈ సినిమాలో పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ అవబోతోందని సమాచారం. ఆ పీరియడ్ సెటప్‌కి తగినట్టుగా ఆమె స్టైల్, బాడీ లాంగ్వేజ్ అన్నీ మారబోతున్నాయి. ఒకవైపు నటిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ, మరోవైపు నిర్మాతగా బాధ్యతలు తీసుకుని సమంత ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త చాప్టర్ ప్రారంభించారు. యశోదతర్వాత సమంత నుంచి ఆ రేంజ్ సోలో పర్ఫార్మెన్స్ రాలేదు. ఈసారి ఆమె ఫుల్ లెంగ్త్ హీరోయిన్ రోల్‌తో తిరిగి వస్తుండటంతో అభిమానులు ఫుల్ ఎగ్జైటెడ్‌గా ఉన్నారు.

# రిలీజ్‌కు రెడీ అవుతున్న 'కిల్లర్'



"శుక్ర", "మాటరాని మౌనమిది", "ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీలవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ సై ఫైయాక్షన్‌థ్రిల్లర్‌మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా నటిస్తుండటం విశేషం.జ్యోతిపూర్వజ్‌హీరోయిన్‌గా నటిస్తుండగా. విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఏయు అండ్ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పైఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డిఈకొలాబ్రేషన్ లో నిర్మాణమవు తున్న రెండవ చిత్రమిది.

ఈరోజు "కిల్లర్" మూవీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్.ఈసినిమాపోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుదిదశకు చేరుకుంటున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇండియా ఫస్ట్ సూపర్ షీ మూవీగా "కిల్లర్" ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందుతోంది. త్వరలోనే "కిల్లర్" సినిమారిలీజ్‌డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు .నటీనటులు:జ్యోతిపూర్వజ్, పూర్వాజ్,విశాల్‌రాజ్,దశరథ, చందూ, గౌతమ్, తదితరులు.టెక్నికల్‌టీమ్: సినిమాటోగ్రఫీ: జగదీశ్‌బొమ్మిశెట్టి, మ్యూజిక్: ఆశీర్వాద్, సుమన్ జీవ,వీఎఫ్ఎక్స్,వర్చువల్ ప్రొడక్షన్ : మెర్జ్ఎక్స్ ఆర్,పీఆర్ఓ : జీఎస్ కే మీడియా(సురేష్ శ్రీనివాస్),లైన్ ప్రొడ్యూసర్:దశరథ:బ్యానర్స్,థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ ఆర్,ఏయుఅండ్ ఐ.స.మర్పణ, ఉర్వీష్‌పూర్వజ్‌నిర్మాతలు:పూర్వాజ్,ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి,రచన దర్శకత్వం: పూర్వాజ్ .

# అల్లు అర్జున్, నానిలతో
# పూజా హెగ్డే ఫుల్ బిజీ ..బిజీ..



పూజా హెగ్డే.. ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో ఒకరు. కానీ ఇటీవల కాలంలో ఆమె ప్రభ తగ్గిపోయింది. వరుస ఫ్లాప్స్ పడటంతో తెలుగులో అవకాశాలు దూరమయ్యాయి. కానీ తమిళం, హిందీ భాషల్లో క్రేజీ ఆఫర్స్ అందుకుంది. అయితే ఇప్పుడిప్పుడే ఈ బుట్టబొమ్మ మళ్లీ తెలుగులోనూ ఛాన్సులు దక్కించుకుంటోంది. తాజాగా అమ్మడి చేతికి మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ వచ్చినట్లుగా సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో తీస్తున్న పాన్ ఇండియన్ మూవీ. దానికి తగ్గట్టుగానే స్టార్ క్యాస్టింగ్‌నితీసుకుంటున్నారు. ఇప్పటికే దీపికా పదుకునేని మెయిన్ హీరోయిన్‌గా అనౌన్స్ చేశారు. ఆమె సెట్స్‌లో అడుగుపెట్టి ఒక షెడ్యూల్ షూటింగ్ కూడా చేసింది. దీపికాతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ వంటి మరో ఇద్దరు గ్లామరస్ హీరోయిన్లను ఫైనలైజ్ చేసినట్లు టాక్. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇంతలో ఇప్పుడు పూజా హెగ్డేని కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం చేస్తున్నట్లు వార్తలు

# "ప్రెడేటర్:బ్యాడ్‌ల్యాండ్స్" నవంబర్ 7న
# ప్రపంచ వ్యాప్తంగా విడుదల

సైన్స్ ఫిక్షన్ చరిత్రలో అత్యంత భయానకమైన పాత్రలలో ఒకటైన ప్రెడేటర్ దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తూనే ఉంది. 1987లో మొదటిసారి తెరపై కనిపించిన ఈయౌట్జాజీవి,అప్పటినుంచి అడవుల్లో, నగరాల్లో, ఆపైఇతర గ్రహాల్లో తన వేట సాగిస్తూ పరిణామం చెందుతూ వచ్చింది.ఇప్పుడు అదే సిరీస్‌కి కొత్తరూపాన్ని ఇస్తూ, ప్రెడేటర్:బ్యాడ్‌ల్యాండ్స్ "నవంబర్7, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈసారి కథలో మలుపు ఏమిటంటే వేటగాడే వేటలో చిక్కుకుపోతాడు.1987లో ప్రారంభమైన లెజెండ్ అర్నాల్డ్ ష్వార్జెనెగర్ ప్రధాన పాత్రలో వచ్చిన తొలి "పెడేటర్" చిత్రం, అమెజాన్ అడవుల్లో కమాండోలు ఎదుర్కొన్న కంటికి కనిపించని భయానక మృగం కథతో ప్రేక్షకులను కుదిపేసింది. 1990లో ప్రెడేటర్ 2" - కాంక్రీట్ జంగిల్ ఈసారి లాస్‌ఏంజెల్స్ నగరాన్ని వేటస్థలంగా మార్చుకున్న యౌట్జా, గ్యాంగ్‌స్టర్లను, పోలీసులను లక్ష్యంగా చేసుకున్నాడు. మానవ చరిత్రలో ఈ జీవుల ఉనికి ఎంతకాలంగా ఉందో ఈ చిత్రం సూచించింది.=2010లో ప్రెడేటర్స్"- గేమ్ ప్రిజర్వ్ అండ్ బియాండ్ ప్రెడేటర్స్‌ఈ భాగంలో మానవ యోధులను ప్రెడేటర్ల స్వగ్రహానికి తీసుకెళ్లి బంధిస్తారు. అక్కడ వారు సూపర్ ప్రెడేటర్లను ఎదుర్కోవలసి వస్తుంది. ఈ కథ యౌట్జా జాతి అంతర్గత విభేదాలను కూడా చూపించింది.2022లో - ఎ రిటర్న్ టు రూట్స్ ప్రే1719లో అమెరికాలోని కమాంచీ తెగకు చెందిన యువతి నారు కథతో తెరకెక్కిన "ప్రే", ప్రెడేటర్ సిరీస్‌కు కొత్త ఊపును తెచ్చింది. కొత్తకాలం, కొత్త దృష్టికోణంతో వేటను చూపిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. 2025లో ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్" వేటలో చిక్కుకున్న వేటగాడుఇప్పుడు డాన్ ట్రాచ్‌టెన్‌బర్గ్ దర్శకత్వంలో రూపొందుతున్న" ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్"ఆ ఊపును మరింతగా పెంచబోతోంది. ఈసారి కథ యౌట్జా యువ ప్రెడేటర్ "డెక్" చుట్టూ తిరుగుతుంది. డెక్ ఒక ప్రమాదకరమైన గ్రహంలో ఆండ్రాయిడ్ యోధురాలు "థియా"తో కలిసి జీవన యుద్ధం సాగించాల్సి వస్తుంది. ఇది మొదటిసారిగా ప్రెడేటర్ దృష్టిలో చెప్పబడుతున్న కథ. యౌట్జా జాతి సంస్కృతి, విలువలు, నైతికత, బలహీనతల్ని లోతుగా చూపించబోతున్న ఈ చిత్రం, ఈ ఫ్రాంచైజ్‌కు ఒక కొత్త మలుపు ఇవ్వనుందనే ఆశలు ఉన్నాయి.సిరీస్‌కు కొత్త ఊపునిచ్చే ప్రయోగం..పెడేటర్: బ్యాడ్‌ల్యాండ్" కేవలం యాక్షన్, థ్రిల్ మాత్రమే కాకుండా, ఆ యౌట్జా జీవుల అంతర్ముఖ ప్రపంచాన్ని కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది.





## కంటిచూపు లేకపోయినా..

ఆమె కళ్లతో ఈ ప్రపంచాన్ని చూడలేదు. కానీ మనుషులను బాగా అర్థం చేసుకోగలదు. వారి మనసులను తేలికపరిచే చక్కటి పాటలను పాడగలదు. ప్రతి మదిలో భక్తిభావాన్ని రగల్చగలదు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కంచుకోటలోని పోలంపల్లి గ్రామానికి చెందిన ఆ బాలికను అందరూ 'సుక్మా లతా మంగేష్కర్' అని పిలుస్తుంటారు. ఆమె పేరు సోధి వీరే. పుట్టిన కొన్నేళ్లకే ఆమె కంటిచూపును కోల్పోయింది. పేదరికం కారణంగా తల్లిదండ్రులు వెంటనే వైద్యం చేయలేకపోయారు. దీంతో సోధి వీరేకు శాశ్వతంగా కంటిచూపు దూరమైంది. ఆకార్‌కు చెందిన గురుకుల పాఠశాలలో ఆమెను చదివించారు. అక్కడ సాధారణ విద్యతో పాటు సంగీతాన్ని నేర్పించారు. అక్కడే పాటలు, గేయాలను అద్భుతంగా ఆలపించడాన్ని సోధి నేర్చుకున్నారు. ప్రస్తుతం సుక్మాలోని పీఎం శ్రీ స్కూల్‌లో ఆమె ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. కష్టాలను ఎదుర్కొంటూ, పేదరికం, వైకల్యంతో పోరాడుతున్నప్పటికీ సోధి వీరే ఎన్నడూ ఆత్మ స్థైర్యాన్ని కోల్పోలేదు. పోలంపల్లి చుట్టూ ఉన్న అడవులు ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోట. ఈ అడవుల్లో గతంలో ఎన్నో ఎన్కౌంటర్లు జరిగాయి. రక్తపాతం సంభవించింది. తుపాకీ కాల్పుల మోతలవల్ల ఇక్కడి ప్రజల మనసుల్లో భయాలు నాటుకుపోయాయి. ఈ భయాలు, ఆందోళనలను పటాపంచలు చేసే మహత్తర అస్త్రంగా సోధి వీరే గొంతుక మారింది. 'ఆవో గాయే' మహిమా భోలేనాథ్ కీ లాంటి ఎన్నో భక్తి గీతాలతో గ్రామస్థులను ఆమె చైతన్యవంతం చేస్తున్నారు. ఈ పాటలు విన్నవారు ఎవరైనా సరే సోధి వీరేకు కంటిచూపు లేదంటే అస్సలు నమ్మరు. మ్యూజిక్ టీచర్ కావాలనేది సోధి వీరే జీవిత లక్ష్యమని, ఆమెకు సంగీతపరంగా మరింత శిక్షణ అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానికులు సహకారాన్ని అందించాలని వారు నిర్ణయించారు.

# అవరోధాలను నిరోధించి, అపరాజితగా నిలిచి..

**రావణుడ్ని సంహరించి రాములోరు సీతమ్మను గెలుచుకున్నది విజయ దశమి నాడే! అర్జునుడు గాంఢీవం ధరించి.. కురు సేనలను తరిమికొట్టి కురుక్షేత్ర సంగ్రామ విజయానికి నాంది పలికిందీ విజయ దశమి రోజే! ఇదే విజయ దశమి సందర్భంగా ఈ ఆడబిడ్డ గొప్ప గెలుపును అందుకుంది. ఈ విజయ తీరానికి ఆమె అలవోకగా చేరుకోలేదు! ఎదురైన ప్రతి ఆటంకాన్నీ దీక్షగా దాటింది. అవకాశం వచ్చిన ప్రతిసారీ పట్టుదలతో ప్రయత్నించింది. అవరోధాలను నిరోధించి, అపరాజితగా నిలిచి.. డీఎస్పీగా గెలిచిన అల్లెపు మోనిక విజయగాథ ఇది..**

ములుగుకు పద్నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది మల్లంపల్లి. మోనిక అదే ఊళ్లో ఓ ప్రైవేట్ బడిలో పది దాకా చదివింది. ఆమె తండ్రి సమ్మయ్య పంక్చర్ షాప్ నడుపుకొంటాడు. తల్లి సరోజన సాధారణ గృహిణి. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. తాము ఎంత కష్టపడ్డా పిల్లలు బాగా చదువుకోవాలని వాళ్ల ఆరాటం. అందుకు తగ్గట్టే మోనిక, ఆమె చెల్లెలు మానస చక్కగా చదివేవారు. టెన్త్ తర్వాత హనుమకొండలో ఇంటర్ ఎంపీసీలో చేరింది మోనిక. 985 మార్కులతోని కాలేజ్ టాపర్‌గా నిలిచింది. "మా మేనమామలు సాఫ్ట్‌వేర్ ఫీల్డులో పని చేస్తున్నారు. వాళ్ల పనిగంటలు, టార్గెట్‌లు తెలుసు. జీతం ఎక్కువే! కానీ, సంతోషం తక్కువ. గవర్నమెంట్ జాబ్‌లో ఒత్తిడి ఉన్నా సంతృప్తి ఉంటుంది. నాకు గుర్తింపు రావాలంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే మార్గం అనుకున్నా! అదే చెబితే.. ఇంట్లోవాళ్లూ అందుకు ఒప్పుకొన్నార్శ అని నేడు తాను అందుకున్న విజయానికి భూమికను చెప్పుకొచ్చింది మోనిక.

**లక్ష్యం దిశగా....** సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న మోనిక.. డిగ్రీలో ఆర్ట్స్ తీసుకోవాలనుకుంది. ఆ విషయం తెలిసి.. అందరూ ఇంజినీర్లు అయితుంటే.. ఆర్ట్స్ చదివి ఏం చేస్తవ్? అని ఎందరో వింతగా చూశారు. అర్జునుడు పక్షికన్నునే గురి చూసినట్టు.. మోనిక తన దృష్టంతా సివిల్స్ పైనే సారించింది. మేనమామ సలహాతో డిగ్రీ కోసం హైదరాబాద్ బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో జాయిన్ అయ్యింది. నగరంలో చదువంటే.. ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అమ్మానాన్నకు భారమవుతానా అనుకుంది. బిడ్డ దిగులు చూసి.. భరోసా ఇచ్చారు తల్లిదండ్రులు. మా రెక్కలు ఆడినంత కాలం.. నువ్వు ఎగురుతూనే ఉంటావు తల్లి అన్నారు. ఈ ఆటంకాన్నీ అధిగమించింది. హాస్టల్‌లో ఉంటూ.. కాలేజీకి వెళ్లేది మోనిక. బిడ్డకు ఏనాడూ కష్టం రావొద్దని.. రెక్కలు ముక్కలు చేసుకునేవాడు సమ్మయ్య. ఎకరం కన్నా తక్కువ ఉన్న చెలకలో సరోజన చెమట చిందించేది. బిడ్డ చదువు ఆగిపోవద్దనే ఆరాటంతో పోరాటమే చేశారిద్దరూ! బిడ్డల కోసం చాల కష్టపడేది. ఏదైనా ఇబ్బందైతే నా అన్నలు, తమ్ముళ్లు ఆదుకునేటోళ్లు. ఈ అక్కకే కాదు.. అక్క బిడ్డలకూ అండైనరు అంటుంది సరోజన. ఆ సాయం చేసిన తన అక్క, చెల్లె బిడ్డలే సరోజనకు ఆదర్శం. చక్కగ చదువుకోవడం వల్లనే కదా.. మంచి ఉద్యోగాలు చేస్తున్నారు అనుకునేది. తన బిడ్డ కూడా వాళ్లలా ఉన్నతంగా ఎదగాలని ఆశపడేది.



**ఏడాది పోరాటం.....** కాలేజీలో అయితే చేరింది.. కానీ, ఇక్కడ మోనికకు పెద్ద అవరోధమే ఎదురైంది. చిన్నప్పటి నుంచి తెలుగు మీడియం చదివిన ఆమెకు.. ఇంగ్లిష్‌లో పాఠాలు బోధిస్తుంటే అర్థం కాక దుఃఖమొచ్చేది. క్లాస్‌మేట్స్‌తో కలవడానికీ మొహమాటపడేది. వాళ్ల కమ్యూనికేషన్ స్కిల్స్ చూసి.. తనూ అలా మాట్లాడాలనుకునేది. కానీ, ఇంగ్లిష్ అంతగా రాకపోవడంతో ఆత్మనూన్యతకు లోనయ్యేది. పాఠంలో ఏదైనా డౌట్ వచ్చినా.. వచ్చీరాని ఇంగ్లిష్‌తో క్లాస్‌లో అడగలేక, అర్థమైందన్నట్టుగా తలూపేది. ఓ ఆరు నెలలు పుస్తకాలతో కుస్తీ పట్టింది. అర్థం కాని విషయాలను హాస్టల్‌మేట్స్‌ని అడిగి తెలుసుకునేది. క్లాస్‌లో కాకుండా.. లెక్చరర్ ఒంటరిగా ఉన్నప్పుడు వెళ్లి తన సందేహాన్ని వెలిబుచ్చేది. చదువుపై మోనిక కనబరిచే శ్రద్ధ చూసి అధ్యాపకులూ ప్రోత్సహించేవారు. మా ఎకనామిక్స్ లెక్చరర్ ఆలిస్ మేడం నాలో సబ్జెక్ట్ ఉందని ఎంతగానో ఎంకరేజ్ చేసేది. ఎన్నాళ్లని ఇంగ్లిష్‌కు భయపడటం అనుకున్నా. హాస్టల్ ఫ్రెండ్స్‌తో మాట్లాడి ఇంగ్లిష్ నేర్చుకున్నా. ఆ భాష మీద గ్రిప్ వచ్చాక.. సబ్జెక్టులపై పట్టు సాధించగలిగాను. ఓ ఏడాదిపాటు కష్టపడ్డాన్శ అని తన వెనుకబాటుని గెలిచిన తీరును చెప్పుకొచ్చింది మోనిక. ఎదిగిన ఆడపిల్ల ఇంటి దగ్గర కనిపించగానే.. పెండ్లి ఎప్పుడు చేస్తరు? ఇంకో బిడ్డ కూడా ఎదుగుతున్నది.. తొందరపడండి అన్న మాటలు మొదలయ్యాయి. వారికి సరోజన మంచి సమాధానం చెప్పేది. నా బిడ్డలకు ఉద్యోగాలొచ్చినాంకనే పెండ్లి చేస్తా! అది సదువుకుంటాంది. మంచి ఉద్యోగం చేస్తనంటాంది. అది ఏదో సాధించాలని కలలు కంటాంది. నా బిడ్డ గెలిచిన తర్వాతనే పెండ్లి సంగతి అని అందరి నోళ్లూ మూయించింది. తండ్రి కూడా అదే మాటమీదున్నడు. తల్లిదండ్రుల అండదండలు మోనికకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చాయి. సివిల్స్ అనే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలంటే.. ముందుగా గ్రూప్స్ సాధించాలని నిశ్చయించుకుంది.

**కలలు పండిన రోజు...** హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్లు మళ్లీ తెరిచేదాకా ఇంట్లోనే ప్రిపేర్ అయింది మోనిక. 2022లో గ్రూప్స్ నోటిఫికేషన్ వచ్చింది. పట్టుదలతో చదివి గ్రూప్స్‌ని సాధించింది. మేం చదువుకోలే. మీరైనా మా కలలు నెరవేర్చండి అన్న సరోజన మాటను ఇద్దరు బిడ్డలు నిజం చేశారు. మోనిక గ్రూప్స్‌లో విజయం సాధించింది. డీఎస్పీగా ఎంపికైంది. ఎంబీఏ చదివిన చిన్న బిడ్డ ఐటీ కంపెనీలో కొలువు సాధించింది. ఇక్కడితో నా విజయం పరిపూర్ణం కాలేదంటున్నది మోనిక. సివిల్స్ సాధించి.. కలెక్టర్ కావాలన్నదే తన లక్ష్యం అని నిండు విశ్వాసంతో చెబుతున్నది. ఆడపిల్ల చదువుకి కావాల్సింది డబ్బు కాదు. పట్టుదల ముఖ్యం. అమ్మానాన్నల అండదండలతోనే ఈ విజయం సాధ్యమైంది. వాళ్ల కండ్లల్లో ఆనందం చూసి గర్వంగా ఫీలవుతున్నాఅంటున్న మోనికను ఎన్నెన్నో ఆటంకాలు పలకరించాయి. అన్నిటినీ అధిగమించి ఆమె సాధించిన గెలుపు మరెందరో ఆడబిడ్డలకు విజయ దిశను చూపిస్తుంది అనడంలో సందేహం లేదు! □

## టీ బదులు ఇది తాగండి !



**వేపుడు కూరలు తినొద్దు, కాయగూరలను ఉడికించి తాలింపు పెడితే మంచిది అంటున్నారు ఆహార నిపుణులు. అలా కూరగాయల్ని ఉడికించాక.. ఆ నీటిని పారబోస్తున్నారా! ఆ నీళ్ల తాగటం వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో తెలుసా..**

◆ కూరగాయలు ఉడికించిన నీళ్లలో చిటికెడు ఉప్పు కలిపి తాగారంటే శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందుతాయి. ఇంకా రుచిగా ఉండాలంటే కాస్తంత మిరియాల పొడి జోడిస్తే సరి.

◆ ఈ నీరు తేలిగ్గా జీర్ణమై వెంటనే శక్తి కలుగుతుంది.

◆ వెచ్చగా ఉన్నప్పుడు తాగితే.. అలసట పోయి ఉత్సాహంగా ఉంటుంది. కాఫీ, చాయ్‌లకు బదులు ఈ నీటిని తాగటం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం సురక్షితం.

4.బరువు తగ్గాలనుకునేవారికి ఈ నీరు తాగడంలా పనిచేస్తుంది. ◆ గోరుచిక్కుడు, క్యారెట్, క్యాబేజ్, క్యాలీఫ్లవర్, బీట్రూట్, దోస, స్థిర కొద్దికొద్దిగా చేర్చి ఉడికించి తాగితే మరింత ఉపయోగం.

రక్తహీనత నుంచి బయటపడొచ్చు.

◆ఆ నీటిని అలాగే తాగటం ఇష్టం లేకపోతే.. సూప్, పులుసు, నూడుల్స్, పాస్తా, ఫ్రైడ్ రైస్ వంటి వాటిలో ఉంటాయి. □

## మెనోపాజ్‌కి మరో కోణం !



పెరిగే బరువు, వేడి ఆవిర్లు, సరిగా నిద్ర పట్టకపోవడం.. మెనోపాజ్ అనగానే గుర్తుకొచ్చేవే ఇవి. ఇక మారిపోయే భావోద్వేగాలు సరేసరి. అనుభవించేవారికే తెలుస్తుంది. ఆ ఇబ్బంది ఏమిటో? అందుకే ఈ దశను మహిళల జీవితంలో ఓ సవాలుగానూ చెబుతారు. అయితే దీన్నీ ఒకసారి సానుకూలంగా ఆలోచించి చూద్దామా? మామూలు రోజుల్లో ఎలాగున్నా.. పీరియడ్స్‌లో పనిచేయడం ఎంత ఇబ్బందిగా ఉంటుందో కదా! వస్తే ఒక గోల. సమయానికి రాకపోతే అదో భయం. ఇక ఆ సమయంలో ఉండే నొప్పి, చికాకు సంగతి సరేసరి. భావోద్వేగాలన్నీ చుట్టుముడతాయి. పీరియడ్ మైగ్రేన్ ఉన్నవారి సంగతైతే చెప్పనక్కర్లేదు. ఎక్కడికి వెళ్తున్నా ప్యాడ్ మోసుకెళ్లాలి. వేడుకలు, పండగల వేళ వచ్చిందా.. సంబరాలు, పూజలన్నింటికీ దూరంగా ఉండాల్సిందే. మెనోపాజ్‌తో నెలసరి గొడవ వదిలిపోతుంది. అంటే ఈ సమస్యలన్నీ పోయినట్లేగా! వేడుకేదైనా ఎప్పుడైనా సిద్ధమైపోవచ్చు. పెళ్లి కాకముందు చదువు, ఉద్యోగాలంటూ పరుగు. పెళ్లయ్యాక ఇంటి బాధ్యతలు, పిల్లల చదువులతో తీరికుండదు. మెనోపాజ్ దశకు చేరుకునేసరికి పిల్లలు వాళ్ల పనులు వారు చేసుకునే స్థాయికి చేరుకుంటారు. అంటే మనకోసం సమయం దొరికినట్టే. ఇప్పుడైనా ఇతరుల కోసం ఆలోచించక 'నాకేం కావాలి' అని ఆలోచించండి. ఒక అధ్యయనం ప్రకారం ఈ సమయంలో మహిళలు ఇంతకాలం తమలో గూడుకట్టుకున్న అసంతృప్తిని బయటపెడుతుంటారట. మీకూ అలా అనిపించిందా చేయండి కానీ..నచ్చినట్టుగా ఉండండి. నచ్చింది చేయండి. భావోద్వేగాలూ అదుపులో ఉంటాయి. మీకూ సంతృప్తి. యవ్వనంలో ఏదైనా చేసేయగలమన్న ధైర్యం ఉంటుంది. ఆ భావన మెనోపాజ్ కూడా కలిగిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. తిరిగి కెరియర్‌లో చేరతారా? వ్యాపారం ప్రారంభిస్తారా? ఒంటరి ప్రయాణాలను ఆస్వాదిస్తారా.. ఎందుకని చేసేయండి. యాభైల్లో రాణిస్తున్నవారి జాబితాలో మీరూ చేరొచ్చు. □

## చెలి చిట్కా

★ తోడు పెట్టిన పెరుగు మరీ ఎక్కువ పులియకుండా ఉండాలంటే.. అందులో చిన్నగా తరిగిన రెండు కొబ్బరిముక్కలు వేయాలి. అలానే ఇడ్లీ, దోశ పిండి త్వరగా పులిసిపోకుండా ఉండేందుకు పిండిలో ఒకటో, రెండో తమలపాకులు వేస్తే సరిపోతుంది.

★ బియ్యం, మైదా, శనగపిండితో ఎక్కువగా స్నాక్ ఐటమ్ చేస్తా కదా.. అవి కరకరలాడాలంటే బాగా వేడి వేడి నూనెలో కాకుండా కొంచెం చల్లారిన నూనెలో నెమ్మదిగా వేయించుకుంటే సరిపోతుంది.

## మొటిమలు, బ్లాక్‌హెడ్స్ పోవాలంటే..



జామకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అయితే జామకాయలే కాదు.. జామాకుల వల్ల కూడా ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. వీటితో మొటిమలు, బ్లాక్‌హెడ్స్ సమస్యలకు చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు.

**మొటిమల నివారణకు....** మొటిమల సమస్యతో బాధపడే వారికి జామాకు చక్కటి పరిష్కారం చూపుతుంది. జామాకులో యాంటీసెప్టిక్ గుణాలు అధికంగా ఉంటాయి. అవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాని నశింపజేస్తాయి. దీనికోసం జామాకులతో చేసిన పేస్ట్‌ని మొటిమల దగ్గర అప్లై చేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది.

**బ్లాక్‌హెడ్స్ పోవాలంటే......** అమ్మాయిలను ఎక్కువగా ఇబ్బంది పెట్టే మరో సమస్య బ్లాక్‌హెడ్స్, వీటికి జామాకు, కలబందతో చెక్ పెట్టచ్చు. దీనికోసం ఒక టేబుల్ స్పూన్ జామాకు పేస్ట్‌ని తీసుకోవాలి. దానికి అంతే మొత్తంలో కలబంద గుజ్జు, చిటికెడు పసుపుని కలపాలి. ఇలా కలపగా వచ్చిన మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. అలా 20 నిమిషాల పాటు ఉంచిన తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. □



## టపాసులు కాదండోయ్ !







ఇంటింటా దివ్వెల కాంతులు, వీధివీధిలో టపాసుల హోరు. పండుగ అందచందాల్ని వర్ణించడానికి మాటలు సరిపోతాయా? భూచక్రాలు, విష్ణుచక్రాలు, చిచుబుడ్లు, మతాబులు, కాకర పూవొత్తులు, సీమ టపాకాయాలు, రాకెట్లు.. ఎన్నెన్ని వెలుగులు ఎంతెంత ధ్వనులు.. వాటి మీద మోజు కొద్దీ స్వీట్లూ, చాక్లెట్లను క్రాకర్స్‌లా చేశారు. నచ్చితే మీరూ ఇలాంటివి కొనుక్కోండి.















## గోవర్ధనపూజ

ఆధ్యాత్మికం

**రైతుల పండుగ ఇది**

ద్వాపరయుగంలో ప్రారంభమైన పూజ, అంతకు ముందు ఈ పూజను 'ఇంద్రయాగం' అనేవారు. ఇదా పేరుకు ఇంద్రయాగం కానీ ఏ విధమైన యాగాలు నిర్వహించరు. ఇంద్రుని షోడశోపచాలతో పూజించి నివేదనలు సమర్పిస్తారు. కార్తీకమాస ఆరంభంలో ఈ పూజ నిర్వహిస్తారు. ఈపూజకు ఆరాధ్యదైవం ఇంద్రుడు. ఇంద్రుడు తూర్పుదిక్పాలుడు. వర్షకారకుడు, వర్షాలు కురిస్తే పంటలు బాగా పండుతాయి. అందుకే ఈ పండుగనాడు ఇంద్రుని పూజిస్తారు. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఈ పండుగనాడు పలురకాలైన తీపి పదార్థాలు, రుచిగల వంటకాలు, అన్నపురాశులు.. గుట్టలు గుట్టలుగా వండి ఇంద్రునకు నివేదనగా సమర్పిస్తారు. అందుకే ఈపూజకు 'అన్నకూటం' అని మరొక పేరుకూడా ఉంది. శ్రీకృష్ణుడు, శ్రీమహావిష్ణువు అవతారమని ఇంద్రునకు తెలిసినా.. మానవుడుగా జన్మించాడు కనుక శ్రీకృష్ణుడు కూడా తనను పూజించాలని భావించాడు ఇంద్రుడు. అది గ్రహించిన శ్రీకృష్ణుడు, ఇంద్రుని గర్వం అణచాలని సంకల్పించాడు. ఎప్పటిలాగే ఇంద్రయాగం చేసేరోజు రానే వచ్చింది. గోకులంలోని వారంతా ఇంద్రుని పూజించడానికి సర్వం సిద్ధంచేసారు. అప్పుడు శ్రీకృష్ణుడు వారందరినీ పిలిచి, గోవర్ధన పర్వతాన్ని చూపిస్తూ ఈ రోజు నుంచి ఇంద్రుని పూజించడం మానేయండి. మనందరికీ పంటలు.. మన పశువులకు మేత ఇచ్చేది. ఈ గోవర్ధన పర్వతమే. కనుక నేటినుంచి ఈ పర్వతాన్నే పూజిద్దాం అన్నాడు. గోకులంలో వారందరకూ శ్రీకృష్ణుని మాటంటే వేదం. ఎందుకంటే శ్రీకృష్ణుడు ఎన్నో సందర్భాలలో, ఎందరో రాక్షసుల బారి నుంచి గోకులవాసులను కాపాడాడు. అందుచేత గోకుల ప్రజలంతా శ్రీకృష్ణుని మాట గౌరవించి ఇంద్రుని పూజించడం మాని గోవర్ధనపర్వతాన్ని పూజించడం ప్రారంభించారు. ఈ సంగతీ నారదుని ద్వారా తెలుసుకున్న ఇంద్రుడు కోపిగించి.. గోకులం మీద రాళ్లతో కూడిన భయకరమైన వర్షాన్ని కురిపించాడు. గోకుల వాసులంతా శ్రీకృష్ణుని శరణుకోరారు. శ్రీకృష్ణుడు వెంటనే గోవర్ధన పర్వతాన్ని తన చిటికనవ్రేలు మీద ఎత్తి, గొడుగులా పట్టుకుని తనవారినందరినీ గోవర్ధన పర్వతం కిందకు రమ్మనాడ్నడు. అందరూ గోవర్ధన పర్వతం కిందకు చేరారు. ఇంద్రుడు అలా ఏడు రాత్రులు, ఏడు పగళ్ళు రాళ్ళవాన కురిపిస్తూనే ఉన్నాడు. అప్పటికీ ఇంద్రుని గర్వం నశించి, అతనే స్వయంగా శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చి శరణుకోరారు. శ్రీకృష్ణుడు ఇంద్రని క్షమించాడు. నాటి నుంచి ఇంద్రయాగం గోవర్ధనపూజగా మారిపోయింది. □

## ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్
### భారత్ మహిళల టీమ్‌కు టైటిల్



**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్, అండర్ 23లో భారత మహిళల జట్టు చరిత్రలో తొలిసారిగా టైటిల్ కైవసం చేసుకుంది. భారత్ ఫ్రీస్టైల్ రెజ్లింగ్ బృందం జపాన్‌ను ఓడించి ఈ టైటిల్‌ను దక్కించుకుంది. ఐదు కాంస్య, రెండు రజత పతకాలతో భారత మహిళల జట్టు మొత్తం 121 పాయింట్లు సాధించి, ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన జపాన్‌ను నాలుగు పాయింట్ల తేడాతో ఓడించింది. మహిళల పోటీల చివరి రోజున హన్సిక లాంబా, సరిక రజత పతకం గెలుచుకున్న తర్వాత భారత్ అగ్రస్థానానికి చేరుకుంది. మహిళల 53 కిలోల ఫైనల్‌లో పోటీ పడిన లాంబా, ఛాంపియన్‌షిప్‌లలో భారత్‌కు తొలి రజతాన్ని అందించింది. బంగారు పతక పోరులో ఆమె జపాన్‌కు చెందిన హరునా మోరికావా చేతిలో 0-4 తేడాతో ఓడిపోయింది. దాదాపు 30 నిమిషాల తర్వాత, సరికా భారత్ ఖాతాలో మరో రజతం చేరింది. మహిళల 59 కిలోల ఫైనల్లో ఆమె జపాన్‌కు చెందిన రుకా నటమి చేతిలో 1-3 తేడాతో ఓడిపోయింది. మహిళల ఫ్రీస్టయిల్‌లో భారతదేశం తరపున పతకాలు గెలుచుకున్న ఇతర క్రీడాకారులలో నిషు (55 కిలోలలో కాంస్యం), నేహా (57 కిలోలలో కాంస్యం), పుల్కిత్ (65 కిలోలలో కాంస్యం), సృష్టి (68 కిలోలలో కాంస్యం), మరియు ప్రియ (76 కిలోలలో కాంస్యం) ఉన్నారు.

### మహిళల ఆసియా ఛాంపియన్‌షిప్..
## షైనా, దీక్షకు టైటిల్స్




**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా యూత్ ఛాంపియన్‌షిప్-2025లో షైనా, దీక్ష అండర్ 15 అండర్ 17 మహిళల సింగిల్స్ టైటిళ్లను గెలుచుకున్నారు. ఆదివారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత యువ క్రీడాకారిణిలు షైనా మణిముత్తు, దీక్షా సుధాకర్ వరుసగా అండర్15, అండర్17 విభాగాలలో ఈ టైటిళ్లను దక్కించుకున్నారు. ఫైనల్లో షైనా 21-14, 22-20తో జపాన్‌కు చెందిన చిహారు టొమిటాపై విజయం సాధించింది. అలాగే దీక్ష 21-16, 21-9 తేడాతో తన స్వదేశానికి చెందిన లక్ష్య రాజేష్‌ను ఓడించి భారతదేశానికి తొలి అండర్17 సింగిల్స్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. రజతం గెలిచిన లక్ష్యపై దీక్ష విజయంతో, అండర్17 విభాగంలో భారత్ 10 ఏళ్ల బంగారు పతక కరువుకు తెరపడింది. అలాగే షైనా ఆసియా అండర్15 మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న భారతదేశపు నాల్గవ మహిళా సింగిల్స్ క్రీడాకారిణిగా నిలిచింది. కాగా భారత పురుష షట్లర్లు సెమీఫైనల్ మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత పురుషుల అండర్17, సింగిల్స్, డబుల్స్ విభాగాలలో రెండు కాంస్య పతకాలను సాధించారు. దీంతో భారత్ టోర్నమెంట్‌ను ఐదు పతకాలతో ముగించింది. వీటిలో 2 బంగారు, 1 రజతం మరియు 2 కాంస్య పతకాలు ఉన్నాయి.




### ఆస్ట్రేలియన్ పారా బ్యాడ్మింటన్..
## ప్రమోద్‌కు 2 స్వర్ణాలు
### సుకాంత్‌కు స్వర్ణం, రజతం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్-2025 లో ప్రమోద్ భగత్ రెండు స్వర్ణాలు సాధించగా, సుకాంత్ కదమ్ ఒక స్వర్ణం, ఒక రజతంతో మెరిశాడు. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3 ఫైనల్‌లో ప్రమోద్ తన స్వదేశీయుడు మనోజ్ సర్కార్‌ను వరుస సెట్లలో (21-15, 21-17) ఓడించి క్లినికల్ ప్రదర్శన ఇచ్చాడు. పురుషుల డబుల్స్ ఎస్‌ఎల్3-ఎస్‌ఎల్4 ఫైనల్‌లో సుకాంత్ కదమ్‌తో జతకట్టి భగత్ తన రెండవ స్వర్ణ పతకాన్ని సాధించాడు. అద్భుతమైన మూడు సెట్ల మ్యాచ్‌లో (21-11, 19-21, 21-18) భారత ద్వయం ఉమేష్ విక్రమ్ కుమార్-సూర్యకాంత్ యాదవ్‌లను ఓడించింది. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్4లో సూర్య కాంత్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో (21-23, 21-14, 19-21) అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన సుకాంత్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. వరుస కాగా ఇప్పటికే కమాండింగ్ ప్రదర్శనలతో మానసి జోషి 2 స్వర్ణ పతకాలను గెలుచుకుంది. మహిళల సింగిల్స్ ఎస్‌ఎల్3ను ఆస్ట్రేలియాకు చెందిన సెలిన్ వినోట్‌పై గెలుచుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌ఎల్3-ఎస్‌యు5ను రుథిక్ రఘుపతితో కలిసి గెలుచుకుంది. పురుషుల డబుల్స్ ఎస్‌యు5లో రుతిక్ భాగస్వామి చిరాగ్ బరేతతో కలిసి ఇంగ్లాండ్‌కు చెందిన రాబర్ట్ డోనాల్డ్-సీన్ ఓఖిసుల్లివన్‌లను వరుస సెట్లలో ఓడించి స్వర్ణం సాధించారు. పురుషుల డబుల్స్ ఎస్‌హెచ్6లో శివరాజన్ సోలైమలై మరియు సుదర్శన్ ముత్తుస్వామి వరుసగా స్వర్ణం, రజతం గెలుచుకున్నారు.

# ఆస్ట్రేలియా సిరీస్: టీం ఇండియాకు గుణపాఠం

### మ్యాచ్ నేర్పిన ఐదు అంశాలు





**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌ను 1-2 తేడాతో కోల్పోయినా, ఈ సిరీస్ టీమ్ ఇండియాకు అనేక పాఠాలు నేర్పింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ సాధారణ శైలిలో బ్యాటింగ్, ఆకర్షణీయమైన ఇన్నింగ్స్ ద్వారా తమ సామర్థ్యం ఏపాటిదో చెప్పకనే చెప్పారు. ఫలితంగా మూడవ, చివరి వన్డేలో భారత్ ఆసిస్‌ను 9 వికెట్ల తేడాతో 69 బంతులు మిగిలి ఉండగానే ఓడించింది. భారత్ ముందు 237 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా రోహిత్, కోహ్లీ దానిని చిన్నదిగా చూపించడానికి అవకాశానీన వదిలిపెట్టలేదు. రోహిత్ 125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సులతో 121 పరుగులు, కోహ్లీ 81 బంతుల్లో 74 పరుగులు, ఏడు ఫోర్లు బాది భారత్‌ను ఈ జోడీ గెలిపించింది. అయితే, ఈ సిరీస్ నుండి టీమ్ ఇండియా చాలా నేర్చుకుంది. ఈ సిరీస్‌లో జస్‌ప్రీత్ బుమ్రాను టీమ్ ఇండియా స్పష్టంగా కోల్పోయింది. ఫాస్ట్ బౌలింగ్ లైనప్‌ను ఎవరూ నడిపించలేదు. మహమ్మద్ సిరాజ్ కూడా తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించడంలో విఫలమయ్యాడు. అందువల్ల, బుమ్రా లేకపోయినా భారత్ పెద్ద జట్లపై బలంగా రాణించాల్సి ఉంటుంది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌ల్లోనూ శుభ్‌మాన్ గిల్ ఒక్క అర్థ సెంచరీ కూడా చేయలేదు. అతని వన్డే కెప్టెన్సీ బ్యాటింగ్‌తో అంత బాగా లేదు. అందువల్ల, గిల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి పెద్ద స్కోరు సాధించే అవకాశం ఉన్నందున, అతను ముందుకు సాగడానికి బ్యాట్స్‌మన్‌గా బాగా రాణించాల్సి ఉంది. ఇక విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను జట్టు నుండి తొలగించడంపై నిరంతరం పుకార్లు వస్తున్నప్పటికీ, వారు లేకుండా టీం ఇప్పటికీ అసంపూర్ణంగా అనిపిస్తుంది. ఈ సీనియర్ ఆటగాళ్ళు ఇతర ఆటగాళ్లకు చాలా నేర్పుతారు. అయితే, రాబోయే టోర్నమెంట్‌కు ముందు రోహిత్, విరాట్ కోల్పోవడం జట్టు అనుభవాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. అలాగే ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో భారత్ లోయర్ మిడిల్ ఆర్డర్ కూడా రాణించలేకపోయింది. వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీష్ కుమార్, హర్షిత్ రాణా వంటి ఆటగాళ్ళు బ్యాట్‌తో బాగా రాణించగలరు. కానీ వారు ప్రదర్శన ఇవ్వడంలో విఫలమయ్యారు. అందువల్ల, వారు కొంత బాధ్యత తీసుకుని రాణించాల్సి ఉంది.



### యూరోపియన్ చెస్ క్లబ్ కప్‌లో
## గుకేష్, దివ్య డబుల్ స్వర్ణం
### నిహాల్ వ్యక్తిగత గోల్డ్ మెడల్

**న్యూఢిల్లీ:** యూరోపియన్ చెస్ క్లబ్ కప్-2025లో భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేష్, దివ్య దేశ్‌ముఖ్ రాణించి, ఒక్కొక్కరు రెండు బంగారు పతకాలను గెలుచుకున్నారు. ఓపెన్ విభాగంలో దొమ్మరాజు బోర్డు నంబర్ 1లో జట్టు టైటిల్, వ్యక్తిగత స్వర్ణాన్ని గెలుచుకోగా, దేశ్‌ముఖ్ మహిళల జట్టు టైటిల్, బోర్డు నంబర్ 2లో స్వర్ణాన్ని గెలుచుకుంది. టీమ్ సూపర్ చెస్ తరఫున ఆడుతున్న గుకేష్ ఐదు పాయింట్లలో 4 పాయింట్లు సాధించి రెండు డ్రాలు, మూడు విజయాలు సాధించి తన జట్టును విజయపథంలో నడిపించాడు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ టోర్నమెంట్‌ను మూడవ రౌండ్ నుండి ప్రారంభించగా, అతని జట్టు 14/14 స్కోరుతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇక దివ్య సెర్కిల్ డి ఎచెక్స్ డి మోంటే-కార్లో జట్టు తరపున 14 లో 13 స్కోరుతో టైటిల్ గెలుచుకున్నారు. రెండవ బోర్డులో దివ్య ఆరు రౌండ్లలో 4.5 పాయింట్లు సాధించి టోర్నమెంట్ సమయంలో 2500 రేటింగ్ అవరోధాన్ని అధిగమించింది. మరో చోట, భారత్‌కే చెందిన నిహాల్ సరిన్ కూడా వ్యక్తిగత బంగారు పతకాన్ని సాధించాడు. బయేగాన్ పెండిక్ చెస్ స్పోర్ట్స్ క్లబ్ తరపున నాల్గవ బోర్డులో ఆడుతూ, అతను ఏడు రౌండ్లలో ఐదు పాయింట్లు సాధించాడు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.